
ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



# యుగశక్తి గాయత్రి





ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ   మాతృ దేవోభవ ! పితృ దేవోభవ ! ఆచార్య దేవోభవ ! అతిథి దేవోభవ !   సజల శ్రద్ధ

సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
డా॥ ప్రణవ్‌పండ్యా
సంపాదకులు
బి.సి.హెచ్.వి. సుబ్బారావు
(అశ్విని)
ఉప సంపాదకులు
ముక్కామల రత్నాకర్
సంపాదక మండలి
సాధన నరసింహాచార్య
శ్రీమతి లక్ష్మీరాజగోపాల్
డి.వి.ఆర్. మూర్తి

సంపుటి 21 - సంచిక 04
సెప్టెంబర్ 2016

పత్రిక అందనివారు మరియు
పత్రికకు సూచనలు, సలహాలు
ఇవ్వదలచినవారు ఈ క్రింది
ఫోన్ నంబర్లలో సంప్రదించగలరు
040-23700722
94407 69798
99491 11175

## అభ్యాసము

అభ్యాసం అనేది రెండు రకములు. ఒకటి ఆంతరికమైనది. రెండవది బాహ్యమైనది. యోగ సూత్రములలో, భగవద్గీతలో ఆంతరిక అభ్యాసం యొక్క మహత్యం, మహిమ చెప్పబడింది. కళలను నేర్చుకోవడం, ఏదో విషయంపై ప్రావీణ్యం సంపాదించుకోవడం బాహ్య అభ్యాసం క్రిందకి వస్తాయి. మన వ్యక్తిత్వం అంతా ఇప్పటివరకు మనం చేసిన అభ్యాసముల ప్రతిఫలమే. ఆధ్యాత్మికతలో అభ్యాసమునకు ప్రత్యేకమైన అర్థములు ఉన్నాయి. ఈ అభ్యాసము యోగమునకు సంబంధించినది, ఆత్మను పరమాత్మలో కలిపేది, మనం మరచిన మన వాస్తవిక స్వరూపాన్ని తిరిగి గుర్తుకు తెచ్చేది.

ఆధ్యాత్మిక అభ్యాసం యొక్క సారం మీరు మీ మనస్సును కేంద్రీకరించుకోవడం, జరుగుతున్న సంఘటనలతో ప్రభావితం కాకుండా ఉండడం, ఇతరులు చేస్తున్న అవమానాన్ని పట్టించుకోకపోవడం, దానినుండి ప్రభావితం కాకుండా ఉండటం. ఇలా చేయడం వలన అన్నీ రూపాంతరం చెందుతాయి. అన్నీ వేరుగా కనిపించడం మొదలవుతుంది. అప్పుడు అవమానం అవమానంలాగా ఉండదు, మూర్ఖత్వంతో నిండిన ఒక పనికిమాలిన పనిగా తెలుస్తుంది. దానిని పట్టించుకోవలసిన అవసరం ఏమి లేదని తెలుస్తుంది.

ఈ అభ్యాసంతో చైతన్యం వస్తుంది, ఒక విలక్షణమైన జాగరణ జరుగుతుంది. ఇలా నిరంతరం చేస్తుండాలి. మధ్యలో ఆపకూడదు, మధ్యలో ఆపివేస్తే చేసిన ప్రయత్నం అంతా వ్యర్థమవుతుంది. అందువలన ఈ అభ్యాసములో సమయమును పట్టించుకోక అభ్యాసాన్ని ప్రగాఢం చేసుకోవాలి. నిరంతరం చేసే ఈ అభ్యాసం యొక్క బోధ పూర్ణమైనది, చైతన్యవంతమైనది.

*అఖండజ్యోతి, అక్టోబరు 2015*
*అనువాదం: ముక్కామల రత్నాకర్*

# విషయసూచిక


1. **సంపాదకీయం:** అభ్యాసము 3
2. **విషయసూచిక** 4
3. **యుగనిర్మాణ చిత్రావళి - 17:** పీడిత మానవులకై త్యాగము చేసిన నివేదిత 5
4. **పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర - 51:** మహాత్మాగాంధీతో విభేదించుట 6
5. **సూక్ష్మీకరణ సాధన-10:** ఆత్మసత్తాలో నిహితమైన విభూతుల రహస్యోద్ఘాటన 9
6. **పరమపూజ్య గురుదేవుల అమృత వచనాలు-13:** జన్మదినము యొక్క విశిష్టత 12
7. **వినాయక చవితి ప్రత్యేకం:** నిర్విఘ్నం కురు మే దేవ 13
8. **చేతనత్వ విజ్ఞానం:** ఆలోచనల వ్యాపకత్వం - సామర్థ్యం 15
9. **వ్యక్తి నిర్మాణం:** సంకల్పశక్తి 16
10. **మహిళా జాగరణ:** నారీ అభ్యుదయం - అరుణోదయం 18
11. **మనము - మన ఆరోగ్యం:** ఆరోగ్యం కొరకు, దీర్ఘజీవనం కొరకు అలవాట్లు మార్చుకోవాలి 21
12. **ఫాస్టు ఫుడ్స్ నుండి దూరంగా ఉండండి** 23
13. **బోధ కథ:** మూడవ ముద్రణ 25
14. **మనిషి ప్రేతముల నడుమగల మధ్యవర్తిత్వ శృంఖల** 27
15. **అనంతమైన శక్తిసామర్థ్యములతో నిండి ఉన్న మానవ శరీరము** 31
16. **సఫలమైన మార్గానికి పునాది దృఢ విశ్వాసం** 33
17. **వ్యక్తి నిర్మాణం:** స్వప్రయత్నంలో జీవన సాఫల్యం 34
18. **బుద్ధుడు - సేవానిరతి** 36
19. **సత్యవ్రతకథ** 37
20. **మొక్కలను నాటడం మహా పుణ్యకార్యం** 38
21. **బోధ కథ :** చాణక్యుని సాధారణ జీవితము-గొప్ప ఆదర్శము 41
22. **పూజ్య గురుదేవుల అమృతవాణి:** ఆధ్యాత్మికత రొక్కబేరం-1 42
23. **నా వారితో నా మాట:** పరమ పవిత్రమైన గంగాజలాలను పరిరక్షించే భాగీరథీ ప్రయత్నం 45
24. **స్ఫూర్తిదాయక గాయత్రీపరివార్ సభ్యులు-28** 47
25. **వార్తలు :** ఉభయ తెలుగు రాష్ట్రాలలో జరిగిన వివిధ కార్యక్రమాలు 49


# యుగశక్తి గాయత్రి


**విడి ప్రతి రూ॥ 15/-** **సం॥ చందా రూ॥ 150/-**
**3 సం॥ చందా రూ॥ 420/-** **10 సం॥ చందా రూ॥ 1300/-**

చందా రుసుమును ఎట్ పార్ చెక్ ద్వారా (at par cheque) లేక డి.డి.ద్వారా కాని పంపగలరు. యం.ఒ. ద్వారా కూడా పైకం పంపించవచ్చు. కానీ యం.ఒ. ద్వారా వచ్చినప్పుడు పూర్తి అడ్రస్సు ఉండుట లేదు. అందువలన యం.ఒ. ద్వారా పైకం పంపినప్పుడు క్రింద ఇచ్చిన ఫోన్ నంబర్లను సంప్రదించి మీ వివరాలు అన్నీ ఇవ్వ ప్రార్థన. రూ. 5,000 లేక అంతకన్నా ఎక్కువ పంపదలచుకున్నప్పుడు ఆన్‌లైన్ ద్వారా పంపవచ్చును. దీనికన్నా తక్కువ పంపే వారు, రూ. 50/- అదనంగా చేర్చి పంపాలి.

ఖాతాపేరు: **శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు**
బ్యాంకు పేరు: **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎర్రగడ్డ శాఖ, హైదరాబాద్**
ఖాతా నెం.: **32506416087**
IFSC Code: **SBIN-0013272**

ఆన్‌లైన్‌లో పంపినప్పుడు బ్యాంక్ చలానా జిరాక్సు కాపీని మీ చిరునామా తెలుపుతూ తప్పక మాకు పంపించాలి.



**"శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు"**
**గాయత్రీ చేతనా కేంద్రము,** హెచ్.పి. రోడ్, మూసాపేట
అశ్విని హౌస్ దగ్గర, హైదరాబాదు - 500 018.
ఫోన్: 040-23700722, సెల్: 9949111175


## పండుగలు

**సెప్టెంబర్ 2016**

| | |
|---|---|
| **05-09-2016** | వినాయక చవితి |
| **06-09-2016** | ఋషి పంచమి |
| **20-09-2016** | మాతాభగవతీదేవిశర్మ జయంతి |
| **28-09-2016** | పండిత శ్రీరామశర్మ ఆచార్య జయంతి |

**అక్టోబర్ 2016**

| | |
|---|---|
| **02-10-2016** | మహాత్మాగాంధీ జయంతి<br>లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతి |
| **09-10-2016** | దుర్గాష్టమి |
| **11-10-2016** | విజయదశమి (దసరా) |
| **30-10-2016** | దీపావళి |

**సత్యాన్ని నమ్ము, సత్యాన్ని ఆలోచించు, సత్యపాలనకై జీవించు**

## యుగనిర్మాణ చిత్రావళి-17

# సిస్టర్ నివేదిత

ఐర్లాండ్ దేశంలోని ఒక క్రైస్తవ ఫాదర్ ఇంట జన్మించిన కుమారి మార్గరెట్ ఎలిజబెత్ నోబుల్, అంతఃకరణలో భగవంతునిపై విశ్వాసం మరియు సేవా వృత్తి బీజాలు చిన్నతనానే నాటబడ్డాయి. కానీ ఈ భావాలు బాహ్య ప్రపంచంలో ప్రకటితం కావలసిన అవకాశం కలుగ లేదు.

క్రీ.శ.1885లో ఈమె, స్వామి వివేకానందుని సంపర్కం లోనికి వచ్చింది. వివేకానందుని ఆదర్శాలైన పీడిత మానవులకు సేవ చేయుటలోనే మానవజీవన సర్వోత్తమ ఉపయోగం దాగి ఉన్నదని తెలిసికొన్నది. దీనికై ఏ ఒక్కరు దేశ, జాతి, లింగ విభేదాలు మున్నగునవి అడ్డు రాకుండా చూచుకోవాలని భావించింది.



ఆ రోజులలో వివేకానందుడు, ధర్మోదర్ధరణకై సమాజంలో నీతి, సదాచారాల ప్రబలతకై, సేవ, ప్రేమ మరియు ఆధ్యాత్మిక గుణాల విస్తృతికై కృషి చేయుచున్నారు. వీని ద్వారా మాత్రమే మనుష్యులకు సుఖము, శాంతి లభిస్తాయనే ప్రబల విశ్వాసంతో వివేకానందుడు ఒక ఉద్యమాన్ని ప్రారంభించాలనే తలంపుతో ఉన్నాడు. ఈ ఉద్యమంలో పాలుపంచుకొనగలిగే, మానవసేవకై స్వచ్ఛమైన హృదయాలతో, త్యాగభావనతో నిండి ఉన్న కార్యకర్తల ఆవశ్యకతను గుర్తించి వారికొరకై అన్వేషిస్తున్నాడు.

మార్గరెట్ నోబుల్ ఒక సంపన్న కుటుంబంలో జన్మించినది. ఆమెకు ధన సంపదలతకు కొదువలేదు. సుఖ సంతోషాలకు, విలాసాలకు కావలసిన ప్రత్యేక సామగ్రి ఆమెకు అందుబాటులో ఉన్నాయి. ఆమె కోరుకొన్నచో ధనవంతులవలె విలాసవంతమైన జీవితాన్ని గడుపగలదు. కానీ సుఖశాంతులు వీటివలన కాక, దీనుల దుఃఖిత జనుల పతితుల ఉద్ధరణ ద్వారా మాత్రమే పొందగలమని ఆమె ప్రగాఢ విశ్వాసము.

తన కొద్దిపాటి ఆయుష్షును సేవా మరియు పరమార్థసాధనలో వినియోగించుట శ్రేయస్కరమని భావించింది. వెంటనే వివేకానందుని ఉద్యమ సఫలతకై ఆమె బయలుదేరింది.

ఆమె ప్రయాణాన్ని నిలుపుటకై ఆమె బంధుమిత్రులు ప్రయత్నించగా, వారిని సమాధానపరుస్తూ ఇలా అన్నది– “వెనుకబడ్డ వారిని ఉద్ధరించుట వారి ప్రగతికై వారికి సహాయ, సహకారాల నందించుట మొదటి కర్తవ్యము. దీనిలో జాతి, లింగ, దేశ, వర్ణ, భేదభావాలు చూపుట నేరము. యావత్ విశ్వము నా ఇల్లు. కొద్దిమంది నా బంధుమిత్రుల కొరకై నేను విశ్వమానవ సేవకు దూరం కాజాలను” అని పలికి ఐర్లాండ్ దేశాన్ని విడచి భారతదేశాన్ని చేరుకుంది.

మహాపురుషుల విశిష్ట నిష్ఠా గరిమలను శ్లాఘించుట కాక వానిని మన లోనికి ధారణచేసికొని, వానిని వ్యాప్తి చేయాలి. దీనికై మన ప్రతిభా పాటవాలను, శక్తియుక్తులను వెచ్చించాలి. ఈ రీతిగా భావించి ఆమె, వివేకానందుని నుండి గురుదీక్షను పొందింది. తదుపరి తన పేరును నివేదితగా మార్చుకొని విశ్వకళ్యాణానికై నిరంతర కృషిని కొనసాగించింది.


అత్యుత్తమ సేవకురాలిగా తయారగుటకై ఆమె తొలుత భారతదేశ ధర్మాన్ని మరియు సంస్కృతిని అధ్యయనం చేసి సరియైన అవగాహనను పెంపొందించుకొంది. అధికారికంగా వీనిపై మాట్లాడగలస్థాయికి ఎదిగి లోకసేవలో సంలీనమై పోయింది. ఈ రీతిగా ఆమె తన “నివేదిత” పేరును సార్థకం చేసికొంది.

సాటి స్త్రీలలో చైతన్యాన్ని పెంపొందిస్తూ, స్త్రీలు కేవలం గృహస్థ జీవితాలకే పరిమితం కాక, త్యాగం, తపస్సు మరియు లోకసేవ పట్ల తమ శక్తి సామర్థ్యాల ప్రదర్శించాలని ప్రబోధించింది. తాను తన జీవన విధానం ద్వారా స్త్రీ జాతికి మార్గదర్శకంగా నిలచింది. ఇట్టి విశిష్ట స్త్రీ మూర్తిని ఆదర్శంగా తీసికొని, స్త్రీ జాతి ముందుకు వచ్చి, భయసంకోచాల వీడి సమాజ కళ్యాణంలో భాగస్వాములు కావాలి.

*అనువాదం: ఎ. పార్థసారథి*

**సర్వం భగవంతునికి చెందినది! ఆయనకు మనమిచ్చేదేమిటి?**

# మహాత్మగాంధీతో విభేదించుట



1934వ సంవత్సరం తరువాత కూడా మహాత్మా గాంధీ అంతకుపూర్వంలా రాజకీయాలలో ఉత్సాహంగా ఉండటంలేదు. కాంగ్రెసు స్వచ్ఛంద కార్యకర్తలా పనిచేయుట మానివేశారు. సామూహిక హరిజనోద్ధరణకై గాంధీజీ అదే సంవత్సరములో కృషిచేశారు. గ్రామోద్ధరణకై చర్యలు ప్రారంభించారు. రాట్నంపై పనిచేయమని చర్యలు ప్రారంభించారు. గ్రామోద్ధరణ సాధించనిదే, దేశస్వాతంత్ర్యానికి అర్థములేదని పూర్తి ప్రయోజనం చేకూరదని ప్రకటించారు. దీనికై రాట్నాన్ని విరివిగా వాడకంలోనికి తేవాలని సూచించారు. గ్రామోద్ధరణకు, రాట్నం పూర్తిగా వినియోగం లోనికి తెచ్చుటకై 3 సంవత్సరాలు సమయాన్ని కోరారు. 1934 అక్టోబరు బొంబాయి కాంగ్రెసు పార్టీ సమావేశాలలో గాంధీజీ సూచనలు సభ ఆమోదాన్ని పొందాయి. గ్రామద్యోగ సంఘాన్ని నెలకొల్పాలనే తీర్మానం కూడా సభ ఆమోదాన్ని పొందింది. కానీ పార్టీ సభ్యులలో అనేకులు దీనిపట్ల అసంతృప్తిని వ్యక్తం చేశారు. గాంధీజీతో విభేదిస్తూ ఇట్టి తీర్మానాలు, పనులతో దేశానికి స్వాతంత్ర్యం వచ్చుటకు మరో నూరుసంవత్సరాలు పట్టవచ్చుననే భావనలో ఉండిపోయారు. సభ్యుల అభిప్రాయంతో ఏకీభవిస్తూ సైనిక్‌పత్రికలో శ్రీరామ్ ఒక వ్యాసాన్ని ప్రచురించాదు. వ్యాసంలో "గ్రామోద్ధరణకై ప్రయత్నాలు చేస్తూ, క్రియాశీలమైన రాజకీయాల్లో ఉండాలి. గాంధీజీ స్వాతంత్ర్య ఉద్యమానికి దూరంగా 3 సంవత్సరాల పాటు ఉన్నచో యువతలో నిరుత్సాహము పొడచూపుతుంది. గాంధీగారు కనీసం యువతకు ప్రేరణనిస్తూ వారు క్రియాశీల రాజకీయాల్లో ఉండేలా చూడాలి."

శ్రీరామ్ క్రియాశీల రాజకీయాలకు దూరం కాలేదు. తన పంథాలో తాను పనిచేస్తూ స్వాతంత్ర్య ఉద్యమాన్ని వేగవంతం చేయుట కొనసాగించుచున్నాడు. సైనిక పత్రికలో ప్రచురించిన వ్యాసం విమర్శలకు గురి అయింది. కారణం పార్టీ కార్యకర్తలు ఉద్యమాలలో అలసిపోయి ఉన్నందున వారు తిరిగి బలాన్ని పుంజుకోవాలి మరియు వారి దెబ్బతిన్న కుటుంబ వ్యాపారాలు తిరిగి ప్రాణవంతం కావాలి. దీనికి కొంత వ్యవధి కావాలి అనే భావన సర్వత్రా నెలకొంది. వీరందరికి గాంధీజీ నిర్ణయం ఒక వరంగా కనపడింది. విమర్శలకు జవాబిస్తూ శ్రీరామ్ "గాంధీజీ పట్ల నాకు గల విశ్వాసం సన్నగిల్లలేదు. కాని పార్టీ శ్రేణుల్లో నిరాసక్తత, నిర్లిప్తత చోటు చేసుకొంటుంది. దీనిని తెలియచెప్పుటే నా ఉద్దేశ్యం" అన్నాడు.

దీనికి పాలీవాల్జీ మాట్లాడుతూ "గాంధీజీ ఈ విషయాన్ని ఆలోచించలేదా? పూర్తిగా పరిస్థితిని విశ్లేషించకుండా నిర్ణయాన్ని గాంధీజీ తీసుకోరు కదా!" అన్నాడు. దీనికి శ్రీరామ్ బదులిస్తూ "అది సరే! ఇతర విషయాలను మనమెందుకు నిర్లక్ష్యం చెయ్యాలి? నా ఆలోచన తప్పు అని తెలిసినచో నా తప్పును అంగీకరిస్తాను అన్నాడు."

శ్రీరామ్‌కు తెలుసు. పాలీవాల్జీ మరియు గాంధీగారు తన అభిప్రాయాలతో బాధపడ్డారని తెలుసు. అయినప్పటికీ తన అభిప్రాయాలకు అంటిపెట్టుకొన్నాడు శ్రీరామ్. దీనితో పాలీవాల్జీ మెచ్చుకోలుగా శ్రీరామ్ వెన్నుతడుతూ, గ్రామోద్ధరణకై మంచి ప్రణాళికను సిద్ధం చెయ్యమని శ్రీరామ్ కోరాదు.

## గ్రామాన్ని దత్తత చేసికొనుటకై ప్రణాళిక

దీనిని గురించి శ్రీరామ్ ఆలోచించవలసిన పనిలేదు. ఈ ప్రణాళిక గురించి తను ఇంతకు పూర్వమే నిర్ణయించు కొన్నాడు. మనం స్వయంగా ఒక్కొక్క గ్రామాన్ని దత్తత తీసికొని గ్రామంలో రెండు పనులను ప్రారంభిద్దాం. ఒకటి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుట, రెండవది ఒక పాఠశాలను ప్రారంభించుట. ఈ పనులకై 4-5గురు స్వచ్ఛంద సేవకులు సరిపోతారు. మిగిలిన పనులను గ్రామాలలో ఉన్న సేవకులు చేపట్టగలరు.

ఈ వాక్యాలలో అట్టడుగు నుంచి గాంధీగారి గ్రామోద్ధరణ పనులను చేపట్టే విధివిధానాలను వివరించుట జరిగింది. దీనిని విన్న పాలీవాల్జీ మిగుల ఆనందించారు "రానున్న

శ్రద్ధా విశ్వాసాలతో మనిషి అన్నింటిని సాధించగలడు

ఆదివారము సాయంత్రం సమావేశంలో ఈ పథకాన్ని ఆమోదింపజేద్దాం నీవేమి ఆలోచిస్తున్నావు? అన్నారు పాలీవాల్జీ.

శ్రీరామ్ దానిని అంగీకరిస్తూ తల పంకించాడు అంగీకార సూచకంగా. అయినప్పటికీ మిగిలిన స్వచ్ఛంద సేవకులు శ్రీరామ్ నిర్ణయాన్ని సంశయించసాగారు. పాలీవాల్జీ శ్రీరామ్‌ను సమర్థించారు.

శ్రీరాం అలజడిలో ఉన్న తోటివారితో బిగ్గరగా మాట్లాడుతూ వారినుద్దేశించి ఇలా అన్నాడు. "నేను చెప్పబోయేది జాగ్రత్తగా ఆలకించండి. "నేను నా ఆలోచనలను వ్యక్తం చేయబోతున్నానని మీరు అనుకోవచ్చు. కానీ నా అభిప్రాయాలు వెల్లడించే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు నాకున్నాయి. ఈ మాత్రం స్వేచ్ఛను మీరు నాకు ఇవ్వనిచో మనము ఏ స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకై పోరాడుచున్నామో దానికి అర్థము లేదు. అది ఒక ఎండమావియే! బ్రిటీషువారిని తొలగించి మన అధికారికతను ప్రదర్శించటం అవుతుంది. ఇప్పటికీ నన్ను క్షమాపణ చెప్పమన్నచో నేను చెప్పుటకు సిద్ధమే! నేను వ్రాసినదానికి, లేక నేను మాట్లాడినదానికి క్షమాపణలు చెప్పను. కానీ ఇప్పటివరకు నేను కలసిమెలసి పనిచేసిన సమూహం కొద్దిపాటి భిన్నాభిప్రాయాన్ని సహించలేనిదైనందున చెప్తాను. కాంగ్రెసు పార్టీని విడచిపెట్టనైనా విడచిపెడతాను కాని, ఈ ఒత్తిడులకు తలొగ్గను.

పై మాటలను విన్న పాలీవాల్జీ, జగన్ ప్రసాద్‌రావత్, గోపాల్ పరీక్ మున్నగువారు ఆశ్చర్యచకితులైనారు. పాలీవాల్జీ లేచి నిలబడి "శ్రీరామ్ ఈ ఉద్యమాన్ని వీడిపోయినచో మరి కొంతమంది కార్యకర్తలు ఆయనను అనుసరిస్తారు కావున ఈ విషయాన్ని మన గాంధీజీ ముందర ఉంచుదాం" అన్నారు. ఇట్టి సమాధానాన్ని వినగానే కార్యకర్తలందరు మిన్నకుండి పోయారు.

## గ్రామదేవతకు సేవచేయుట

ఆగ్రాకు సమీపంలో కరావల్ అనే పేరుగల గ్రామం ఉన్నది. అచ్చట 20 నుండి 30 కుటుంబాలు నివసిస్తున్నాయి. బ్రాహ్మణ వంశానికి చెందినవి రెండు కుటుంబాలు. ఠాకూర్ వంశానికి చెందినవి 8 కుటుంబాలు. మిగతా కుటుంబాలు ఇతర వెనుకబడ్డ వంశాలకు చెందినవి జనాభ సుమారుగా 250 నుండి 300 మంది ఉంటారు. గ్రామోద్ధరణ కార్యక్రమాన్ని గురించి పాలీపాల్జీతో ముచ్చటించేవేళ శ్రీరామ్‌కు ఈ గ్రామం మనస్సులో మెదిలింది. గ్రామోద్ధరణ కార్యక్రమ విధివిధానాల ముచ్చటిస్తుండగా ఐదుగురి స్వచ్ఛందసేవకులకు ఈ బాధ్యతలను చేపట్టవలసిందిగా పిలుపు అందింది. హాజరైన కార్యకర్తలెవ్వరు నోరుమెదపలేదు. అంతా నిశ్శబ్దంగా ఉన్నారు.

శ్రీరామ్ మాట్లాడుతూ ఇలా అన్నారు. ఇంకా నలుగురు కార్యకర్తలు కావాలి "ఉన్నారా? లేరా?" నా పనిని దీపావళి నుండి ప్రారంభిస్తాను" అన్న తరువాత ఏ ఒక్కరు మాట్లాడలేదు. కొంతసేపటికి కృపానిధి అనే కార్యకర్త "నీవు ఒక్కడివే ఎలా గ్రామోద్ధరణ కార్యక్రమాల చేపడతావు" అన్ని ప్రశ్నించాడు.

పాలీవాల్జీ కల్పించుకొంటూ "మీలో కొందరు ముందుకు వచ్చి తనకు సహకరించాలి" అన్నాడు.

శ్రీరామ్ బదులిస్తూ తప్పకుండా! తప్పకుండా! ప్రస్తుతం తాను చేయుచున్న స్వాతంత్ర్య ఉద్యమ పనులు, పత్రిక పనులు, బహిరంగ సభలు, మరింత పనులకు తోడుగా రోజూ మూడు గంటల సమయాన్ని కరావల్ గ్రామానికి కేటాయిస్తాను" అన్నారు.

"ఇది బాగున్నది" అన్నాడు కృపానిధి "కార్యకర్తలకు గ్రామంలోనే శిక్షణ ఇవ్వాలి. శ్రీరామ్‌తో కలిసి నిత్యం మూడు గంటల సమయాన్ని గ్రామపనులకై ఇస్తాను" అన్నాడు కృపానిధి.

"అప్పుడు నీ షాపు పనులు ఎవరు చూస్తారు" అని శ్రీరామ్ ప్రశ్నిస్తూ "ఈ ప్రశ్న ఉద్దేశ్యము నీకు ప్రత్యామ్నాయంగా నీ షాపులో ఎవరిని ఏర్పాటుచేశావు అనేది నిర్ధారించుకొనుటయే. గ్రామంలో పారిశుధ్య పనులు చేసేటప్పుడు, బోధన చేసేవేళ నీ దుకాణం గుర్తుకు వస్తుంది. అప్పుడు నీ పనిభారాన్ని కూడా నేను నా తలకెత్తుకోవలసి ఉంటుంది" అన్నాడు శ్రీరామ్. బదులిస్తూ కృపానిధి "లేదు నా పెద్దకుమారుని దుకాణంలో కూర్చోబెట్టి మిమ్మల్ని అనుసరిస్తాను. సమయం, పరిస్థితులు అనుకూలిస్తే రోజంతా నేను మీతోపాటు గ్రామపనులలో నిమగ్నమవుతాను" అన్నాడు.

## గ్రామంలో స్వాగతం

దీపావళి కన్నా ఒకరోజు ముందుగానే గ్రామంలో శ్రీరామ్ తన పనిని ప్రారంభించాడు. ఆగ్రాకు $2^1/_2$ కి.మీ. దూరంలో ఉంది కరాకల్ గ్రామం. గ్రామాన్ని చేరుకొనుటకు సరియైన

**వ్యక్తిత్వాన్ని కోల్పోయిన వ్యక్తి సర్వస్వాన్ని కోల్పోతాడు**

రహదారి లేదు. శ్రీరామ్ మరియు కృపానిధి, ఇరువురు తమ సైకిళ్ళపై ఉదయం 6 గంటలకు తమ ఇళ్ళనుండి గ్రామానికి బయలుదేరారు. ఇంకా చీకటిగానే ఉంది. చలికాలము, వాతావరణం బాగుంది. శ్రీరామ్ తన అలవాటు ప్రకారం, ఉదయం 3 గంటల కల్లా లేచి తన పనులు పూర్తిచేసి సిద్ధమయ్యే వాడు. కృపానిధికి మొదట కష్టంగా ఉండేది. తరువాత తాను కూడా శ్రీరామ్‌లా పెందలాడే నిద్రలేచుట మొదలుపెట్టాడు, అలవాటు పడ్డాడు.

మొదటిరోజు ఆ గ్రామాన్ని చేరుకోవటానికి అర్ధగంట సమయం పట్టింది. గ్రామంలోనికి వెళ్ళి ఠాకూర్ మహిన్‌సింగ్ ఇంటితలుపు తట్టాడు. ఇతనికి శ్రీరామ్ బాగా తెలుసు. వీరిని లోనికి ఆహ్వానిస్తూ భార్యతో కుంకుమ, అక్షతలు తెమ్మని కోరాడు. ఠాకూర్, వీరిరువురిని మంచంపై కూర్చొనమని కోరాడు. "ఇవ్వన్నీ ఎందుకు" అని శ్రీరామ్ ప్రశ్నించగా "ఉదయానికి నా ఇంటికి బ్రాహ్మణదేవత వచ్చాడు. అది కూడా మీ వంటి ఋషి మా ఇంటికి రావటం చాలా అదృష్టంగా భావిస్తున్నాను" అన్నాడు ఠాకుర్.

ఇంతలో ఠాకూర్ భార్య కుంకుమ, అక్షతలతోరాగా, ఆ రెండింటిని శ్రీరామ్‌నుదుటిపై అలంకరించి, దంపతులిరువురు శ్రీరామ్‌పాదాలకు నమస్కరించాడు. శ్రీరామ్ తాము వచ్చిన పని చెప్తూ, గాంధీజీ గ్రామోద్ధరణ కార్యక్రమంలోని మొదటి దశలో గ్రామాన్ని పరిశుభ్రంగా అందంగా ఉంచాలి. దీని తరువాత గ్రామంలో పాఠశాలను, ఒక కుటీర పరిశ్రమను ప్రారంభించాలి" అన్నారు.

"గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుటకు సమస్య ఏముంది అంటూ "నేను ఇప్పుడే గ్రామ పరిశుద్ధ్య పనివాళ్ళను పిలుస్తాను. రెండురోజుల్లోవారు గ్రామాన్ని శుభ్రపరుస్తారు గ్రామం చక్కగా ఉంటుంది. ఎవ్వరైనా పెద్దవారు మా గ్రామాన్ని సందర్శిస్తున్నారా? అని ఠాకూర్ ప్రశ్నించాడు.

శ్రీరామ్ బదులిస్తూ ఇలా అన్నాడు. అలా కాదు! గ్రామాన్ని పరిశుభ్రపరచుటకై ఊడ్చేవారి సహాయం లేక ఇతరుల సహాయాన్ని పొందుట పాతకాలపు ఆచారం. బాపూజీ సిద్ధాంతం ప్రకారం గ్రామంలోని ప్రతి పౌరుడు, గ్రామ పరిశుభ్రత బాధ్యతను తీసికోవాలి. ఈ పనిని ఈరోజే ఇప్పుడే మొదలుపెట్టాలి.

## ముందు మనతోనే ప్రారంభిద్దాం

గ్రామస్థులందరిని ఒకచోట చేర్చివారికి ఇవి అన్నీ తెలియ జెప్పి ఆ తరువాత పనిని ప్రారంభించుటకు బదులు మనమే తొలుత పారిశుద్ధ్య కార్యక్రమాన్ని ప్రారంభిద్దాం అంటూ, రెండు చీపుళ్ళను తట్టలను అందజేయవలసిందిగా ఠాకూర్‌ను కోరాడు. శ్రీరామ్ ఆ వస్తువులు అందగానే శ్రీరామ్ బయటకు వెళ్తుండగా "ఎక్కడికి పోతున్నారు దేవతా?" అని ఠాకూర్ ప్రశ్నించాడు "గ్రామాన్ని శుభ్రం చేయుటకై పోతున్నాను గ్రామాన్ని ప్రేమించే వారంతా నాతోనే చేతులు కలుపవచ్చు అన్నాడు శ్రీరామ్. వెంటనే తాను ఒక చీపురు తీసికొని రెండవ దానిని కృపానిధికి అందించి, భుజాన కండువాను తలకు ముఖానికి చుట్టుకొని దుమ్ముధూళి ముక్కులోనికి, ముఖంపై పడకుండా జాగ్రత్త వహించాడు. కృపానిధి కూడా ఇదేతరహాలో జాగ్రత్త వహించి, ఇరువురు గ్రామం వీధులను శుభ్రం చేయసాగారు.

ఠాకూర్ ఇంటి ఎడమ భాగము నుండి శుభ్రం చేయసాగారు. దీనిని చూచిన ఠాకూర్ భార్యతో కలసి వెలుపలికి వచ్చి వారు కూడా చీపుర్లు పట్టుకొని వీధిని పరిశుభ్రం చేయసాగారు దీనిని గమనించిన శ్రీరామ్‌వారితో మీరు వచ్చి మాతో చేయి కలుపుతారని నాకు తెలుసు. అందుకే వీధి ఒక మూల నుండి ఊడ్చుట ప్రారంభించాం" అన్నారు. ఈ మాటలు విన్న ఠాకూర్‌లో మోము ఆనందంతో వికసించింది.

ఆగ్రా నుండి వచ్చిన ఇద్దరు కొత్తవారితోపాటు, ఠాకూర్ దంపతులు కూడా వీధులను శుభ్రం చేస్తున్నారనే వార్త ఒక దావానంలా గ్రామం అంతటా వ్యాపించింది. గ్రామస్తులకిది ఎనిమిదవ వింతగా కన్పించింది. దీనిని చూచుటకై ప్రజలు తరలిరాగా వారంతా వీధి చివరనే ఆగిపోయారు.

ఆశ్చర్యంలో మునిగి, నోట మాటరాని వారిని చూసి ఠాకూర్ పెద్దగా ఇలా అరిచారు "ఏమిటి చూస్తున్నారు ఆ మూల నిలబడి! ఓ గణపతి! చీపురుబుట్ట తీసుకురా! ఊడ్చుట ప్రారంభించండి. ఇతరులకు కూడా చెప్పు చెయ్యమని. గ్రామ వీధులన్నింటిని ఊడ్చిన తరువాత మనమంతా కలుసుకుందాం" అన్నాడు.

– *అనువాదం:* ఎ. వేణుగోపాలరెడ్డి

**శ్రమ చేసేవానికే చెందుతుంది సంపద**

సూక్ష్మీకరణ సాధన - 10

# ఆత్మసత్తాలో నిహితమైన విభూతుల రహస్యోద్ఘాటన

ఆధ్యాత్మవేత్తల, ప్రవక్తల నిరంతర ఉద్బోధన 'ఆత్మను తెలుసుకో', నిన్ను నీవు తెలుసుకో, నిన్ను నీవు గుర్తించు, పైకి లే ఈ సంకేతాలనుబట్టి, ఆత్మికప్రగతిపథంలో ముందు కెళ్ళడానికి, వ్యక్తికి తన శరీరపంజరంలో ఉన్న అనేక అవిజ్ఞాత రహస్యాలగురించి తెలియదని స్పష్టమౌతున్నది. ఈ సూక్ష్మ పొరల బోధ అవగానే అతడు జీవన్ముక్తస్థితి పొందుతాడు. సిద్ధార్థుని ఉదాహరణ మనకు సాధనద్వారా బుద్ధత్వాన్ని ఎలా పొందవచ్చో తెలుపుతుంది. కానీ వ్యక్తికి తనగురించి తెలియని దేదో ఇంకా అర్థము కాలేదు. అతని గురించి అడిగినప్పుడు తక్షణమే పేరు, గోత్రము, వంశము మొదలైనవి చెప్పేస్తాడు. చాలామందికి శరీరము వేరని, దానిని నియామకము చేసే ప్రాణ, ఆత్మలు వేరని తెలియదు. దీనిని అర్థము చేసుకొనటానికి అనేక పురాణకథలు, శాస్త్రములు వింటారు, వాదించుకుంటారు. కానీ దీనివలన ఆత్మబోధ అవుతుందా?

నిజానికి మనిషి జన్మతః అజ్ఞానియే. క్రమప్రగతి ద్వారా తన జీవితాన్ని ఏదోవిధంగా నడిపించుకొనుటకు, ఉదరపోషణకు, సమాజంలో పరస్పర సంబంధములకు అవసరమయ్యే విద్యలు మాత్రమే నేర్చుకుంటాడు. ఈ వ్యవహారిక జ్ఞానము వాతావర ణము నుంచి లభిస్తుందని అనుకోవచ్చు. సుసంస్కారాలు, పూర్వ జన్మల కర్మల ఫలస్వరూపముగా కొంతమంది అంతవరకే పరిమితమైపోకుండా ఇంకాస్త పైకి ఎదిగి చేతనత్వస్థాయిలో ఆలోచించడము మొదలెడతారు. వీరికి సరైన మార్గదర్శనము లభించినప్పుడు తమతమ ఆత్మవైభవ సంపదకి సంబంధించిన అజ్ఞానాంధకారాన్ని, జ్ఞానకళికయొక్క జ్యోతితో పోగొట్టుకుంటారు. ఇటువంటి వ్యక్తులే నరపశుస్థాయిని దాటి, భవ-బంధనము లను త్రెంచుకొని బ్రాహ్మీచేతన ఆనంద రసాస్వాదనము చేస్తారు. వీరినే జీవన్ముక్తులంటారు.

తమ గురించి తాము తెలుసుకోలేని విచిత్ర పరిస్థితిలో అనేకమంది వ్యక్తులుంటారు. కంటికి ప్రత్యక్షంగా కనిపించినదే సత్యము అనే మూఢులు, అన్య జీవప్రాణులకన్నా భిన్నం కాదు. నలుగురు గ్రుడ్డివారి కథ ప్రసిద్ధమేకదా! వారిలో ప్రతి ఒక్కరు తమ తమ అనుభూతుల పరంగానే, ఏనుగును గుర్తించారు. వారి 'ఏనుగు' వారి ఊహలకు అనురూపంగా ఉంటుంది. ప్రతిమనిషి యొక్క ఊపిరితిత్తులలో వికృతమైన క్షేత్రము ఉంటుంది. **లోతైన శ్వాస తీసుకొనకపోవడం వలన సంపూర్ణంగా ఊపిరితిత్తులను ఉపయోగించకపోవడం వలన ఆ స్వల్ప క్షేత్రాన్నే ఉపయోగించుకొని జీవిస్తూ ఉంటారు.** కానీ, దీనివల్ల క్షయ, ఆయాసము మొదలగు రోగములతో బాధపడుతూ ఉంటారు. మస్తిష్కము యొక్క అపరిమిత సామర్థ్య సంపదలోని పదమూడు శాతము మాత్రమే బుద్ధిమంతులు సైతం ఉపయోగించుకుంటున్నారు. కానీ దీని అర్థము మిగతా వాటి అస్థిత్వము లేదని కాదు కదా!

ఇక్కడ మనుష్యుని యొక్క ఆత్మవిస్మృతి తద్వారా అతని యొక్క సూక్ష్మపొరలు, వాటి వైభవ సామ్రాజ్యాల గురించి తెలుసుకోలేకపోవుట చర్చిస్తున్నాము. వీటిని వికసింపచేసుకొన గలిగితే వ్యక్తి అసామాన్యస్థాయికి ఎదుగుతాడు. దీనికి కారణము స్థూలజగత్తుకు మాత్రమే ప్రాముఖ్యత నిచ్చే దృష్టికోణము మారక పోవడమే. అనగా ప్రత్యక్షంగా ఉన్నదానికి మాత్రమే అస్థిత్వము (ఉనికి) ఉన్నది. కనిపించనిదానికి విలువ లేదు అన్న భావనే. ఆత్మసత్తారూపమైన చీకటిగదిలో, ఆత్మచేతన నిశ్చయంగా ఉన్నది. అది ఉచ్చస్థరీయ సక్రియతగా వికసించకపోతే విషాక్త తత్త్వములు పోషింపబడుతూ, వ్యక్తిత్వము దిగజారుతూనే ఉంటుంది.

అనాటమీలో శరీరాన్ని కోసి అంతర్భాగాలతో పరిచయము చేస్తారు. కానీ చేతనత్వము యొక్క అనాటమీ ఎలా తెలియ చేయుట? శరీర అంతరాళాలలో ఉన్న పంచకోశములు, షట్చక్రములు, ఉపత్యికల వైభవ సంపద కనిపించనప్పుడు ఫలానా స్థానములో వాటి ఉనికి ఉందని ఎలా గుర్తిస్తాము. ఫిజియాలజీకి పరిమితులు (limitations) ఉన్నట్లే వాటికి వాటి పరిమితులు (limitations) ఉన్నాయి. ఉపరసస్రావములు, శరీర అవయవ సంచాలన మొదలగు దృగ్గోచరమయ్యేవాటినే సమగ్రము అనుకుంటారు. శరీరములో ప్రవహించే విద్యుద్ధార, జీవ అయస్కాంత క్షేత్రములను కొలవగలిగే ఉపకరణాలు కూడా కొంతవరకు మాత్రమే తెలుపగలుగుతాయి.

ఆధ్యాత్మికవేత్తలు తాము శరీరము యొక్క బంధనాలలో

ప్రగాఢ విశ్వాసంతో పర్వతాలను అధిగమించవచ్చు

పరిమితమైనట్లు భావించరు. వారు పరోక్షజగత్తుయొక్క ఉనికిని స్వీకరిస్తారు. వ్యష్టి-సమిష్టిలలో సంవ్యాప్తమైన ఈ బ్రాహ్మీ చేతనత్వమును 'ఎకాలజీ' (ecology) వలె ఆ అత్యున్నత శక్తి యొక్క సామ్రాజ్యముగా గుర్తిస్తారు. వీరు 'ఆత్మసత్తా'యొక్క ప్రయోగ శాలలో యోగసాధనములు, ధ్యానధారణ మొదలగు వాటితో స్వయంగా తన అంతరాళాలలో నిశిత పరిశీలన చేసి, ప్రకృతి యొక్క సూక్ష్మ అంతరాళాలకి మధ్య ఇచ్చిపుచ్చు కొనుటకు వీలైన మార్గములను అన్వేషిస్తారు. శాస్త్రము యొక్క నిష్కర్షలు, ఆప్తవచనములలో ఈ రోమాంచం కలిగించే రహస్యమైన ఉద్ఘాటన చేయబడినది. ఈప్రత్యక్ష దృశ్యమాన బ్రహ్మాండము, సౌరమండలము ఎంత సత్యమో, సూక్ష్మజగత్తు కూడా అంతే సత్యము.

స్థూలశరీరమును ఉపయోగించుకున్నప్పుడు కొంత బరువు ఉండటం వల్ల త్వరగా అలసిపోతుంది. కానీ సూక్ష్మశరీరము బరువు లేనిది. అది కాంతివేగము కంటే తీవ్రమైన వేగముతో తరంగాల సముదాయ రూపంలో సూక్ష్మజగత్తులో నిరంతరము పరిభ్రమిస్తూ స్థూలశరీరము ద్వారా ప్రత్యక్షముగా చేయలేని అసంభవాలను సంభవమయ్యేటట్లు చేస్తుంది. అందువల్లనే అన్ని ఆయామముల (Dimentions) పరిధికి ఆవల ఉన్న విభిన్న లోకాంతరములలో నిరంతరము భ్రమణము చేస్తున్న సూక్ష్మశరీరము ధరించిన దేవాత్మలు, కారణము అంతుపట్టని అనేక ప్రయోజనాలు సాధించడము చూస్తుంటాము. చాలా సార్లు ఇటువంటి సంఘటనలను యోగమని (chance) లేక దేవానుగ్రహమనీ అనుకొని సరిపెట్టుకొంటారు. ఆత్మసత్తా యొక్క ఈ సూక్ష్మీకరణ విధానము చాలా అద్భుతమైనది. ఋషులు, దేవమానవులు, మహామానవుల స్థాయిని పొందిన ప్రజ్ఞావంతులు ఈ శరీరంలో ఉంటూనే అసంభవమైన పురుషార్థములు చేయుటను గమనించవచ్చు. జీవన్ముక్తస్థితిలో సశరీరముగా ఈ ధరిత్రి మీద ఉన్న మహాపురుషులకు ఆయువు ప్రతిబంధకము కాదు. కొంతమంది దేవపురుషులు దేహమును త్యజించిన తరువాత కూడా సూక్ష్మరూపంలో వారు జీవించి ఉన్నప్పుడు చేస్తున్న మానవ కళ్యాణ కార్యక్రమాలు సాగిస్తూనే ఉంటారు.

ఈ చర్చ నా యొక్క సూక్ష్మీకరణ సందర్భంలో అవసరమే కనుక చేస్తున్నాను. ప్రత్యక్షంగా, ఈ స్థూలశరీరముతో, నా ద్వారా చేయబడిన పనుల యొక్క మూల్యాంకనము (evaluation) ఇప్పుడు జరుగదు. రాబోయేకాలంలో జరుగుతుంది. కానీ, సూక్ష్మీకరణ రూపంలో ఏమి జరుగబోవుచున్నదో, ఏమి చేయవలసి ఉన్నదో దాని గురించి వెనుకటిపుటలలో చర్చించాను. ఈనాటి యుగసంధి యొక్క విషమ పరిస్థితులలో 'విశ్వాస రాహిత్యం' (lack of faith) అనేదానిని ప్రపంచంలోనుంచి పీకిపారేయాలి, ఆత్మశక్తినే ఉపయోగించి తీరాలి. నేను, నా యొక్క 24 సంవత్సరముల ఉచ్చస్థరీయ గాయత్రీ సాధన, దైనందిన ఉపాసన, ఆరాధనల వలన ప్రత్యక్షంగా చేసిన కార్యక్రమాలలో అనేక అధ్యాయములు పూర్తయ్యాయి. ఉపసంహారము మాత్రమే మిగిలి ఉన్నది. ఇదే నాయొక్క అత్యంత గొప్ప పురుషార్థమై వర్తమానంలో సమగ్రమైన మార్పు తీసికొస్తుంది. ఆత్మసత్తా యొక్క సూక్ష్మీకరణ రూప ప్రత్యక్షీకరణములో ఎంత చమత్కార పూర్ణమైన మార్పులు రాబోతున్నాయో, అందరూ త్వరలోనే స్పష్టంగా చూడగలుగుతారు.

ఒక ప్రశ్న ఉదయించవచ్చు. ప్రత్యక్షంగానే, స్థూల శరీరం తోనే ఇన్ని అసంభవమనిపించే కార్యక్రమాలు చేయగలిగితే పరోక్షస్థితికి దిగవలసిన అవసరము ఏమి ఉన్నది? దీనికి ఒక్కటే జవాబు. ఈనాటి విపత్కర, విషమ, విరాట్ స్వరూపాలు చూసి ఆ దైవీచేతనత్వము, వాటి నివారణ సూక్ష్మశరీరంలో ఉన్న అనేక దేవాత్మల ద్వారా సుసంపన్నము చేయదలచినది. స్థూల జగత్తులో సమాజతంత్ర వ్యవస్థ ఎలా ఉంటుందో, సుమారు అటువంటిదే పరోక్ష జగతిలో కూడా ఉన్నది. అక్కడ నిరంతరము, అదృశ్య సహాయకులు, పితృగణాలు, సూక్ష్మ శరీరధారి ఆత్మలు దేశకాలాతీతులై పరిభ్రమిస్తూ ఉంటారు. కంటికి కనిపించకపోయిన వారు తమ క్రియాకలాపాలతో సమిష్టి జగత్తును ప్రభావితం చేస్తూ ఉంటారు. సూక్ష్మీకరణ సాధన చేసిన సాధకుడు ఆ శ్రేణిలోనే చేరి పృథ్వీమీద శరీరము ధరించి ఉన్నప్పటికీ, వారితో ప్రత్యక్ష సంబంధము ఏర్పరచు కుంటాడు.

భౌతికంగా శరీరధారులై ఉన్నప్పటికీ, తంత్రశాస్త్రవేత్తలు తమయొక్క అదృశ్య అణువులను తయారుచేసుకొని తద్వారా పిల్లల కథలలో అల్లాఉద్దీన్ యొక్క అద్భుతదీపము యొక్క భూతాలవలె పనులు చేయించుకుంటారు. సోక్రటీస్ యొక్క డీమన్ సంభవతః అలాంటిదేనేమో. సూక్ష్మశరీరజాగృతి నిజానికి ప్రత్యక్ష, అప్రత్యక్ష జగత్తుల మధ్య ఇచ్చి-పుచ్చుకొనే ప్రక్రియను ఏర్పరచుతుంది. అంతేకాక ఆత్మసత్తా యొక్క మానవునికి తెలియని అనేక రహస్యాలను తెరబయటికి తెస్తుంది.

**భగవంతునికి దగ్గరగుటకు చక్కని ఉన్నత ఆదర్శములు కావాలి**

సూక్ష్మశరీరజాగరణ కొరకు సాధకుడు తన యోగాభ్యాసంలో అనేకరకాల ధ్యానధారణలను చేయవలసి వస్తుంది. షట్చక్రములు, పంచకోశములు, మూడుగ్రంథులు, ఇడా, పింగళా, సుషుమ్నా నాడులు ఏ స్థాయిలో ఉంటాయో వాటి అవిజ్ఞాత వైభవాలు జాగృతమైనప్పుడు సాధకుడు అదే విధమైన అనంత వైభవములకు స్వామి అవుతాడు. కుండలినీ మహాశక్తి, దాని సంసిద్ధి విషయంలో నేను విస్తారంగా వివరిస్తూనే ఉన్నాను. ఈనాడు సమస్త ప్రపంచములో ప్రచారంలో ఉన్న అతీంద్రియ శక్తులన్నీ 'సూక్ష్మీకరణ' యొక్క అత్యంత సూక్ష్మ అభివ్యక్తి మాత్రమే. అంతేగాక ఉచ్చస్థరీయ అనేక తలాలలో (planes) సిద్ధులకు గాక ఆత్మయొక్క విభూతులకే ప్రాధాన్యత ఉంటుంది. మనఃచేతన శక్తుల ఉపయోగంతో సిద్ధ సాధకులు ప్రత్యక్షంగా శరీరములో అసంభవమనిపించే కార్యములు సాధించ గలుగుతారు. ఈ చమత్కారములన్నీ సూక్ష్మీకరణ జన్యములే.

కారణశరీరము, దేవస్థరీయ ఆత్మలు కార్యరతులై ఉండే చేతనత్వం (Consciousness) యొక్క ఆయామము (Dimentions), సూక్ష్మీకరణ ప్రక్రియయొక్క చరమస్థితిలో మానవుని వ్యష్టిచేతన-సమిష్టిగత దేవచేతనతో సమన్వయము స్థాపించుకొనుటయే కారణశరీర జాగృతి. ఈ స్థాయికి చెందిన మహాపురుషులకు తమవంటూ వ్యక్తిగతమైన కోరికలు ఉండవు. అంతఃకరణ యొక్క సూక్ష్మపొరలతో నిర్మితమయ్యే కారణ శరీరము ఆధ్యాత్మిక ఫిజియాలజీ ప్రకారము ధరాతలంకంటే పైకిలేచిన Beyond the confines of earth plane conscience చేతనత్వము, సమిష్టి చేతనత్వంతో తాదాత్మ్యము చెందుట యొక్క ఒక విశిష్ట ప్రక్రియ మాత్రమే. ఈ జాగరణ వల్ల లోపల నిర్మాణమై ఉన్న దేవశక్తులు జాగృతమవుతాయి. ఏ పంచదేవతలను, శరీరస్థ పంచదేవతాశక్తుల ప్రతినిధులు అంటారో, అవి పంచకోశముల వలె శరీరములోనే ఉన్నాయి. నిజానికి ఇవి మానవచేతనత్వము యొక్క 5 పొరలు. చివరి స్థితిలో ఇవి దైవీచేతనత్వములో కలిసిపోతాయి. అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ పేర్లతో సంబోధించబడే చేతనత్వము యొక్క 5 ఆయామములు నియంత్రణలోనికి తెచ్చుకున్న సాధకుడు దేవపురుషుల శ్రేణిలో చేరుతాడు. పదార్థవిజ్ఞానులు మూడు ఆయామములతోనే పరిచితులు. ఐన్‌స్టీన్ దేశ-కాలముల రూపంలో చేతనత్వము యొక్క చతుర్థ ఆయామము గురించి కల్పనలను చేశాడు. అక్కడ ప్రతి పదార్థము (anti matter) ప్రతికణములు (anti particles) యొక్క ఉనికిని ఊహిస్తున్నారు. ఈ నాల్గవ ఆయామము మీద ఐదవ ఆయామము ఉన్నది. దీని ఉనికిని గురించి వైజ్ఞానికులకు ఏవిధమైన ఊహా లేదు. ఆధ్యాత్మవేత్తలు ఈ అంతిమ ఆయామములోనే చేతనసత్తా యొక్క ఉనికి ఉందని చెబుతారు. ఇక్కడ సూక్ష్మీకృత వ్యష్టిచేతన సంవ్యాప్తమై ఉంటుంది.

మానవుని శరీరంలో పరోక్షజగత్తుయొక్క సూక్ష్మశరీరమును విధాత చాల దక్షతతో అల్లాడు. ఈ సూక్ష్మశరీరమును జాగృతము చేసుకొని బహుముఖప్రజ్ఞలు (Manifold orientations) సాధించగలిగే స్వాతంత్ర్యముకూడా ఇచ్చాడు. సిద్ధపురుషులు ఇదే చేస్తారు. స్థూలము నుండి సూక్ష్మశరీరము, అక్కడ నుండి కారణశరీర జాగృతి కొరకు సాధనా పురుషార్థము చేసి, ఆప్త వచనాల ప్రమాణికతను ఋజువు చేస్తారు. ఏ పనిని రాగ రహిత, స్ఫూర్తి, ఉత్సాహాలతో కూడిన భౌతికశరీరము చేయగలదో దానికి అనేకరెట్ల ఆలోచనల, భావనల క్షేత్రంలో సూక్ష్మ, కారణ శరీరాలు పని చేయగలుగుతాయి.

నిజానికి సూక్ష్మీకరణ సాధన ఆత్మజాగృతి యోగసాధన. దీనివలన వ్యక్తి స్వయంగా అనంత విశాలత్వము పొందటమే కాక పరోక్షముతో సంబంధము ఏర్పరచుకొని అనన్య వ్యక్తులకు, వాతావరణమునకు, సమస్త సముదాయానికి లాభము చేకూర్చుట కూడా సంభవమే. నా సాధన ఈ ఉచ్చస్థరీయ ఉద్దేశ్యములు సాధించే నిమిత్తమే చేయబడుతున్నది.

## మంచి ఆలోచనల ప్రభావం

*స్వాతి నక్షత్రంలో నీరు ఆల్చిప్పలో పడినప్పుడు ముత్యం తయారవుతుంది. వెదురుపై పడ్డ స్వాతి నక్షత్ర చినుకు సుగంధాన్ని నింపగా, అరటిపై పడ్డ స్వాతి నక్షత్ర చినుకు కర్పూరంగా మారుతుంది.*

*అదే రీతిలో మంచి ఆలోచనలు ఎవ్వరి మనస్సులో-మస్తిష్కంలో ప్రవేశిస్తాయో, అతడు ఉజ్జ్వల నక్షత్రంలా స్వయంగా మెరుస్తాడు - మరియు తన చుట్టురా ఉన్న వారిలో ప్రకాశాన్ని నింపుటకు కారణభూతుడవుతాడు.*

*- అఖండజ్యోతి, మార్చి 2016*
*అనువాదం: ఎ. వేణుగోపాలరెడ్డి*

**వృద్ధుడైన జటాయువు, అతిచిన్న ప్రాణియైన ఉడుత ఉన్నత ఆదర్శముల వలన భగవంతునికి చేరువయ్యారు**

## పరమపూజ్య గురుదేవుల అమృత వచనాలు - 13

# జన్మదినము యొక్క విశిష్టత

మానవ జీవనము అనేది భగవంతుడిచ్చిన ఒక గొప్ప కానుక. భగవంతుడిచ్చే కానుకలలో ఇంతకు మించిన కానుక లేదు. దీనిని ఎలా ఉపయోగించుకోవాలో తెలుసుకొని తదనుసారం మన జీవితాన్ని జీవించాలి, అప్పుడే మానవ జన్మ, మానవ జీవన పూర్తి లాభాన్ని మనం పొందగలం. మానవజీవన విలువ మనకు తెలియనందున మనము దానిని సదుపయోగం చేసికొనజాల కున్నాము.

జీవితాన్ని ఒక నిరర్థకమైన వస్తువుగా మనం భావిస్తున్నాం. అట్లే భారమైనదానినిగా పరిగణిస్తున్నాం, మనపైన ఒక బరువును మోపినట్లు తలుస్తున్నాం. దీనిని మోయక తప్పదు అనే భావనలో జీవిస్తున్నాం. ఇదే భావనతో అనేకమంది జీవిస్తున్నారు. కానీ సత్యము ఏమనగా, ఇంతటి విశాల సంపదలను మనుష్యులకై ఒనగూర్చిన భగవంతుడు, ఈ సంపదలు, వనరుల సహాయంతో మనుష్యులు వారి జీవితాలను సఫలం మరియు సార్థకం చేసికొనమని కోరుతున్నాడు. దీనితోపాటు మనుష్యులను ఏ లక్ష్యసిద్ధికై సృష్టించాడో, ఆ లక్ష్యాన్ని కూడా సిద్ధింపజేసుకోమని మనుష్యులను ఆకాంక్షించాడు. ఈ విశ్వాన్ని అందంగా ఆకర్షణీ యంగా సమున్నతంగా తీర్చిదిద్దాలని మనుష్యుల కోరుకొంటూ మనుష్యులకై అనేక సంపదలను, సంపత్తులను అందించాడు. ఈ సంపదలను అన్నింటిని తగినవిధంగా సదుపయోగం చేసికోవాలని కోరుచున్నాడు. దురదృష్టవశాత్తు ఈ సంపదల విలువ మనము తెలిసికొనజాలకున్నాం.

మనుష్య జీవనం అనేక గొప్ప అవకాశాలతో కూడి ఉన్నది. వీనిని సరియైన రీతిలో ఉపయోగించినచో, మనిషి భౌతిక మరియు ఆధ్యాత్మిక క్షేత్రాలలో ఉచ్చస్తరీతిలో సఫలతను పొంద గలడు. దీన్నికై మనిషికి అన్ని సఫలతా ద్వారాలు తెరచుకుని ఉన్నాయి. వీనిలో ప్రవేశించుటకై మనిషి తనకు గల సత్తాను తెలిసికోవాలి. తదుపరి మన వద్ద ఎంత గొప్ప విలువైన వస్తువులు ఉన్నాయో కూడా తెలిసికోవాలి. అట్లే మన శరీరం మరియు మస్తిష్కం విలువైనందని కూడా తెలియాలి. దీనితో పాటుగా అనేక గుణకర్మలు మరియు విశిష్ట స్వభావాలు మనలో ఉన్నది తెలుసుకోవాలి, వీని విలువ కూడా తెలిసి కోవలసి ఉన్నది. వీనిని సక్రమంగా వినియోగించుకోవలసి ఉన్నది. లేనిచో రత్నం కూడా నిరుపయోగంగా పడి ఉండాల్సిందే!

మనిషి యొక్క జీవిత విలువలను, గొప్పతనాన్ని ప్రతివారికి తెలియచెప్పవలసి ఉంది. అప్పుడు వారిలో ఉత్సాహము పెల్లుబుకుతుంది! దీనికై జీవనవిలువలు తెలుపుట ఎంతో అవసరం మరియు పరివారానికి జన్మదినం యొక్క విశిష్టతను, మనిషి జీవన విలువలను చెప్పవలసి ఉన్నది. జన్మదిన ఉత్సవాన్ని ఒక ఉన్నత భావనాత్మక వాతావరణంలో మరియు ఉత్సాహభరిత వాతావరణంలో మహత్వపూరిత మాటలతో జరుపుకొనుట చాలా అవసరం.

మనిషిని ఉత్సాహపూరితంగా మరియు ఉత్తేజితంగా ఉంచ వలసిన అవసరం కూడా ఎంతైనా ఉంది. ఇట్టి వాతావరణంలో మనిషి అత్యంత ప్రసన్నంగా ఉంటాడు. ఇట్టి సమయంలో తీసుకొన్న నిర్ణయం లేక చేసిన ప్రతిజ్ఞ నెరవేర్చుటకై సదా సంసిద్ధుడై ఉంటాడు. తత్ఫలితంగా అతడు అనుక్షణం దీనిని గురించి యోచిస్తూ ఉంటాడు. తన ప్రతిజ్ఞను పూరించే దిశగా అడుగులు వేస్తాడు. ఎందుకనగా ఇట్టి జీవన విధాన విలువలను తాను సంపూర్ణంగా అవగతం చేసుకొన్నాడు గనుక! జీవితాలలో ఆనందాన్ని ప్రధానంగా కోరుకుంటూ, అట్టి స్థితి అనుభవం లోనికి రాగానే, ఆరోజు అతడు అత్యంత మహత్వపూర్ణంగా జీవిస్తాడు, అట్టి స్థితిలో అతని వోము ప్రసన్నంగా, ప్రకాశవంతంగా ఉంటుంది. అతనిలోని శారీరిక, మానసిక శక్తులు వికసిస్తాయి.

మనిషి తన నిత్యజీవితంలో గౌరవమర్యాదల పొందుటకై ఆనందాన్ని పెంపొందించుటకై, ఆత్మబోధ ఆధారంగా ప్రగతి పథంలో పయనించుటకై, జన్మదినం వంటి ఉత్తేజిత, ఉత్సాహ పూర్వక వాతావరణం చాలా అవసరం. ఆత్మబోధ మనిషి నిత్య జీవితానికి చాలా అవసరము. ఇది గొప్ప జ్ఞానంతో కూడినది. తనను తాను తెలుసుకోవాలి, తనను తాను ఉద్ధరించు కోవాలి, తనను తాను కించపరచుకోకూడదు. జన్మదినం నాడు తనను గురించి లోతుగా ఆలోచించగలడు. ఆత్మబోధ చేసుకో గలడు. జన్మదినం ఈ విధంగా మహత్వపూర్ణమైనది. ఆత్మబోధ మనిషి యొక్క ఆధ్యాత్మిక ఉన్నతి ద్వారాలను తెరుచుకొనేలా చేస్తుంది. నీ గురించి నీవు లోతుగా ఆలోచన చేసిన రోజు, ఆత్మబోధ చేసుకున్న రోజు జన్మదినం రోజు నీ జీవితంలో గొప్ప మహత్వపూర్ణమైన రోజు.

ఈ రోజు ప్రసంగం ఇంతటితో సమాప్తం.

– *అనువాదం: ఎ. వేణుగోపాలరెడ్డి*

**మన అంతరంగంలో సాహసం, వివేకం జాగృతమైననాడే మనలో నిజమైన ఆధ్యాత్మికత ఉదయిస్తుంది**

వినాయక చవితి ప్రత్యేకం

# నిర్విఘ్నం కురు మే దేవ

విఘ్నవినాశకుడైన గణపతి ప్రథమపూజ్యుడు. ఏ శుభకార్యం చేసే ముందైనా ప్రథమపూజ్యుడైన గణపతిని పూజిస్తారు. ఇలా పూజించడం వల్ల మార్గంలోని ఇబ్బందులన్నిటినీ విఘ్నేశ్వరుడు తొలగిస్తాడని నమ్ముతారు.



'గణేశుడు' అన్న పదానికి అర్థం ఇలా చెప్పబడింది – **గణానాం జీవ జాతానాం యః ఈశః, స్వామి స గణేశః.** అంటే, సమస్త జీవజాతుల (ప్రాణులు)కు ఈశ్వరుడు అనగా స్వామి. బ్రహ్మవైవర్త పురాణంలో శ్రీమహావిష్ణువు 'గణేశ' శబ్దానికి దార్శనిక వ్యాఖ్యానాన్ని ఇచ్చారు, **"జ్ఞానార్థవాచకో గశ్చ ణశ్చ నిర్వాణ వాచకః. తయోరీశం పరం బ్రహ్మ గణేశం ప్రణమామ్యహం."** అంటే 'గ' జ్ఞానార్థవాచకం, 'ణ' నిర్వాణార్ధ వాచకం. ఈ రెండింటి ఈశ్వరుడు అయిన ఆ పరబ్రహ్మ గణేశునికి నేను నమస్కరిస్తున్నాను.

సంస్కృతంలో 'గణ' అనే పదం సమూహవాచకంగా చెప్తారు. **"గణశబ్దః సమూహస్య వాచకః పరికీర్తితః:".** కాబట్టి గణపతి అంటే సమూహాలను పాలించే పరమాత్మ. మరో చోట **'గణానాం పతిః గణపతిః'.** అంటే దేవతల అధిపతిని గణపతి అంటారు.

ప్రపంచాన్ని పాలించే పరబ్రహ్మ పరమాత్మనే గణపతి అని నమ్ముతారు. గణపతి నిర్గుణ నిరాకార స్వరూపంలో ప్రణవం (ఓంకారం) మరియు సగుణ సాకార స్వరూపంలో గజముఖుడు (గజాననుడు). గోస్వామి తులసీదాసు శ్రీరామ చరిత మానస్‌లో –

**ముని అనుసాసన్ గణపతిహి పూజెఉ సంభు భవాని ।**
**కోఉ సుని సంసయ కరై జని సుర్ అనాది జియం జాని ॥**

అర్థం: వివాహ సమయంలో ఋషులు, మునుల ఆజ్ఞ ప్రకారం శివపార్వతులు గణేశుని పూజించారు. కానీ గణేశుడు వారి కుమారుడైతే వారి వివాహానికి ముందు ఆయన్ని ఎలా ఆవాహన చేసారు? ఈ అనుమానం కలగడం సహజమే. శ్రీగణేశుడు ఆది పురుషుడు అన్నదే దానికి జవాబు.

శివపురాణం ప్రకారం – పార్వతి తనయుడు గణేశుని ఉత్పత్తి ఆ తల్లి ఒంటి మీద లేపనం ద్వారా అయింది. కానీ బ్రహ్మవైవర్త పురాణం ప్రకారం పుణ్యక వ్రతానికి ఫలంగా పార్వతి మాతకు గణేశుడు పుత్రుడిగా లభిస్తాడు. కారణాలేవైనా గాని మన పౌరాణిక గ్రంథాలు గణపతిని ప్రణవ స్వరూపంగా చెప్తారు. అంటే శివపార్వతుల పుత్రుడుగా అవతరించే ముందే శ్రీగణేశుడు నిరాకార ప్రణవ రూపంలో ఉన్నాడు. శివపుత్రుని రూపంలో ఆయన గజముఖ రూపం సాకారమైంది. ఋషులు, మునులు కూడా ప్రణవాన్ని, గణేశుని వేరుగా చూడరు. ప్రణవ రూపం సాకారం కావడానికే ఉమాశంకరుల పుత్రునికి గజ ముఖం అమర్చబడింది.

మన పురాణాలలో గణేశుని భార్యలు బుద్ధి, సిద్ధి అని పేర్కొన్నారు. వారి పుత్రులు శుభం, లాభం. శ్రీగణేశుని విఘ్నేశ్వ రుడని కూడా అంటారు. అందుకే ఏ పనైనా నిర్విఘ్నంగా కొనసాగాలనే ఉద్దేశంతో పనికి ముందే విఘ్నేశ్వరుడిని పూజిస్తారు. శ్రీగణేశపూజ ఒక్కటి చేస్తే సమస్త దేవతల పూజా చేసినట్టే, ఎందుకంటే ఆయన గణాలన్నిటికీ అధిపతి. దేవ గణాలకు నాయకుడవడం వల్ల ఆయనను గణనాయకుడు, గణాధ్యక్షుడు అని కూడా అంటారు. దేవగణాలకు ఈశ్వరుడు (స్వామి) అవడం వల్ల గణేశుడయ్యాడు. ధర్మగ్రంథాల్లో

**సంస్కరించబడిన భావనలే మానవుతని మహామానవునిగా, నరుని నారాయణునిగా మలచుతాయి**

అనంతకోటి బ్రహ్మాండనాయకుడిని, పరాత్మరుడిని, పూర్ణుడిని, పరబ్రహ్మ పరమాత్మనే 'గణపతి' లేదా గణేశుడనే నామాలతో పిలుస్తారు. సృష్టి చేసేటప్పుడు బ్రహ్మదేవుడికి విఘ్నాలను తొలగించి సహాయం చేస్తాడు. సృష్టిని పాలించేటప్పుడు ఆసురీ శక్తులు ఎప్పుడు ఇబ్బంది కలిగించినా, అప్పుడు వాటిని నివారించడానికి శ్రీగణేశుడు ప్రత్యక్షమవుతుంటాడు.

ప్రతి యుగంలో దుష్టశిక్షణ కోసం శ్రీహరి అవతరించినట్టే, లోకహితార్థమై గణేశుడు కూడా అవతరిస్తూనే ఉన్నాడు. కొందరి నమ్మకం ప్రకారం, సత్యయుగంలో గణేశుడు, 'వినాయకుడు'గా అవతరించాడు. అప్పుడు ఆయనకు పది భుజాలున్నాయి, ఆయన వాహనం సింహం. సింహధ్వజుడైన వినాయకుడు కాశీకెళ్ళి అక్కడ నరాంతకుడు, దేవాంతకుడు అనే దానవులను వధించి ప్రపంచానికి మేలు చేసాడు. త్రేతాయుగంలో ఆరు భుజాలతో మయూరాన్ని వాహనం చేసుకున్నందుకు మయూరేషుడైయ్యాడు. అప్పుడు కమలాసురుడు, మహాదైత్యపతి సింధుడిని అసురపరివారంతోసహా సంహరించాడు. ద్వాపరంలో గజాననుడుగా చతుర్భుజాలతో మూషికాన్ని వాహనం చేసుకుని సింధురాసురుడిని సంహరించి, వరేణ్య మహారాజుకి 'గణేశ గీత'ను ఉపదేశించారు.

ఆది శంకరాచార్యులవారు ప్రతీకాత్మకంగా గణేశుని తత్త్వాల వర్ణన చాలా అందంగా చేసారు. మనల్ని నిరాకార పరబ్రహ్మకు దగ్గరగా తీసుకువెళ్ళడానికే ఆయనికి ఏనుగు తల ఉన్నట్టుగా చిత్రీకరించారు. ఆయన అగమ్యుడు, నిర్వికల్పుడు, నిరాకారుడు, ఒకే ఒక్కడు. అనగా జన్మరహితుడు, గుణాతీతుడు, సర్వవ్యాపితమైన ఆ పరమచైతన్యానికి ప్రతీకుడు. ఈ బ్రహ్మాండ మంతా సృష్టించిన శక్తి ఆయనే. ఆయన ద్వారానే ఇదంతా ప్రకటమైంది, ఆయనలోనే ఇదంతా విలీనమైపోతుంది.

గణేశుడు ఔదార్యానికి, పూర్ణ స్వీకృతికి ప్రతీక ఆ పెద్ద ఉదరం. సంరక్షణకు ప్రతీకగా అభయముద్రలో చేయి ఉంచుతాడు. 'భయపడకండి, నేను మీ వెంటే ఉన్నాను' అని ఈ చేత్తో చెప్తూనే మరో చేయి కిందకి చాచి ఉంచి నిరంతరం మనకి ఇస్తూనే ఉన్నారని చెప్తున్నాడు. ఆయనకున్న ఏకదంతం ఏకాగ్ర చిత్తానికి ప్రతీక. ఆయన చేతిలోని అంకుశం చురుకుదనానికి, అప్రమత్తతకు ప్రతీక. పాశం నియంత్రణకు ప్రతీక. ఆయన వాహనమైన మూషికం, అంటే ఎలుక కూడా ప్రతీకాత్మకమైనదే. మనం పెనవేసుకున్న బంధాలను అది తెంపేస్తుంటుంది. ఏ పరమజ్ఞానానికి శ్రీగణేశుడు ప్రతీకో, ఆ జ్ఞానం వైపు పయనించడానికి అడ్డుగా ఉన్న అజ్ఞానపు పొరలను ఒక్కొక్కటిగా తొలగించే మంత్రం లాంటిది ఈ మూషికం.

ఈ విధంగా ఈ నెల మనం చేసుకునే వినాయక చవితి పూజతో గణేశుని ప్రతీక చిహ్నాలనుండి ప్రేరణను పొంది ఆయన ఉపాసన ద్వారా మన జీవితాలు శుభమార్గం వైపు పయనించేలా చూసుకుందాం.

*సేకరణ: అఖండజ్యోతి, ఆగస్టు 2014;*
*అనువాదం: శ్రీమతి జయలక్ష్మి*

## నీవే నా తల్లివి - నేనే నీ పుత్రుణ్ణి

*మహారాజు ఛత్రపాలుడు ప్రజలను కన్నబిడ్డలకన్నా మిన్నగా భావించేవాడు. వారికేలాంటిలోటు రాకుండా శ్రద్ధగా పరిపాలించేవాడు. అప్పుడప్పుడు మారువేషంలో వీధులు తిరుగుతూ స్థితిగతులను తిలకించేవాడు. ఒక్కొక్కప్పుడు నేరుగా ప్రజలను కలసి కష్టసుఖాలు తెలుసుకునేవాడు. ఆవిధంగా ప్రజల మధ్య తిరుగుతున్న రాజును ఒక అందమైన యువతి చూచింది. ఆతని సుందరరూపాన్ని చూసి ముగ్ధురాలైంది. వయస్సు వేడిలో ఉచ్చనీచాలు మరచిపోయింది రాజును సమీపించింది. "మహారాజా! మీ వంటి ఉదారాల పాలనలోనున్నా నాకు దుఃఖం తప్పటం లేదు. నేనొక్క వరం కోరుకోవాలనుకుంటున్నాను" అన్నది వినయంగా.*

*"నా రాజ్యంలో ఒక అబలకు దుఃఖమా? చెప్పు తల్లీ! నీకేం కావాలి? తప్పక తీరుస్తాను" అన్నాడు రాజు. "మాట తప్పరు కదా! అంటూ హొయలుపోయింది. "నాకు నీ వంటి కుమారుడు కావాలి." అన్నది ముసిముసిగా నవ్వుతూ. రాజు ఒక్కక్షణం బిత్తరపోయాడు వెంటనే తేరుకుని "అమ్మా! ఒకవేళ కుమారుడు జన్మించినా నాలాగా ఉంటాడన్నా నమ్మకం లేదు కదా! అందువలన నేనే నీ పుత్రుడుగా ఉంటాను. నీవు ఈరోజు నుండి రాజమాతవు" అంటూ పల్లకి తెప్పించాడు. తన వెంట రాజమహలుకు తీసికొనివెళ్ళాడు.*

*- అనువాదం: పొన్నూరు హైమవతీశాస్త్రి*

**సత్కార్య సాధనలో ఓడిపోయి మరణించుటకూడా గొప్పకార్యమే**

చేతనత్వ విజ్ఞానం

# ఆలోచనల వ్యాపకత్వం - సామర్థ్యం

ఆలోచనలకి ప్రభావం ఉంటుంది. సామూహిక ఆలోచనలకి ఆ ప్రభావం మరింత ఎక్కువగా ఉంటుంది. స్మశానంలో భయానకమైన వాతావరణం ఉంటుంది. అక్కడికి దహన సంస్కారముల కొరకు వచ్చేవారిలో అధికశాతం వియోగం, వేదన, శోకభావములు ఉంటాయి. ఇలా ప్రతిదినం అక్కడికి వచ్చేవారి బాధకరమైన భావములు అక్కడి వాతావరణమును, చెట్లుచేమలను ప్రభావితం చేస్తాయి.

జంతువులను వధించు ప్రదేశాలలోని వాతావరణం వధింపబడుతున్న జంతువుల హాహాకారములతో నిండి ఉంటుంది. చుట్టుప్రక్కల ఉండేవారి మనస్సులు ఉద్విగ్నతతో నిండిపోతాయి, వారు విశ్రాంతిగా కూర్చోలేరు. శాంతిని పొందలేరు. త్రాగుడు త్రాగే ప్రదేశాలలో కూడా ఇటువంటి పరిస్థితి నెలకొంటుంది. ఆ ప్రాంతాలకి వెళ్ళినప్పుడు అక్కడ జరుగుతున్న కార్యకలాపాలలో పాలుపంచుకుందామనే ఆలోచన తలెత్తుంది. ఇలా అనేకసార్లు జరిగినప్పుడు ఆ ఆలోచన ఆచరణగా మారుతుంది.

సిపాయిలు దగ్గరగా ఉంటే దుర్బల మనస్సుగల వారు కూడా ధైర్యంగా ఉంటారు. నృత్యములు, గానములు వాయిద్యముల కోలాహలంలో ఉంటే మన మనస్సు కూడా తరంగితమవుతుంది. అశ్లీల వాతావరణంలో మంచివారు కూడా కాముకత దిశలో అడుగులు వెయ్యాలని ఆలోచిస్తారు. అతి తీవ్రమయినప్పుడు అక్కడ ఉన్న వాతావరణానికి లొంగిపోతారు. వాతావరణంలో యుద్ధోన్మాదం ఉంటే దాని ప్రభావం వలన అనేకమంది సైన్యంలో చేరాలని యుద్ధంలో పాల్గొనాలని ఉవ్విళ్ళూరుతుంటారు. ఇది సామూహిక ఆలోచనల సంయుక్త శక్తియొక్క ప్రతిఫలం.

కఠిన కార్యములు చేయాలంటే ప్రఖర ప్రతిభ అవసరమవుతుంది. దానితోపాటే ప్రబల ప్రయత్నం కూడా కూడబెట్టుకోవలసి వస్తుంది. ఒక సాహసవంతుడు ఉంటే అనేక సాహసవంతులు తయారవుతారు. ఒక పిరికివాడు ఉంటే అనేకమంది పిరికివాళ్ళు తయారవుతారు. **ఆలోచనల శక్తి అపారము. అవి పైకి తీసుకు వెళ్ళగలవు. క్రింద పడవేయగలవు.**

మనిషి రకరకాల పనులు చేస్తుంటాడు. ఒక పనిచేసే ముందు ఆ పని ఆలోచనలరూపంలో వికసిస్తుంది. ఆలోచనలకు శరీరం యొక్క సమస్త అంగ అవయములపై ఆధిపత్యం ఉన్నది. మనస్సు యొక్క నిర్దేశంతోనే విభిన్న అంగములు నిర్దేశించిన పనులు పూర్తిచేస్తాయి. దీనినే కర్మ అంటారు. ఇది ఆలోచనల యొక్క పరిణితి మాత్రమే.

మనం చేసే మంచిచెడు పనులకు బాధ్యత ఆలోచనలదే. అంతేకాక ఇవి సమీపంలో ఉన్న వ్యక్తులను కూడా ప్రభావితం చేస్తాయి. ఒకరిద్దరు ఆలోచనాపరులైన వ్యక్తులు పరివారం యొక్క స్థాయిని భవిష్యత్తును తయారుచేయగలరు. పిల్లలపై తల్లిదండ్రుల అధ్యాపకుల విశేష ప్రభావం ఉంటుంది. అది వారి కర్తవ్యాన్ని నిర్ధారిస్తుంది.

ఒకేరకంగా ఆలోచించేవారు కలసిమెలసి అడుగులు వేస్తుంటే ఒక వ్యవస్థ తయారవుతుంది. ఆలోచనలలో ఏకత్వం లేకపోతే ఎంత పెద్దగుంపు ఉన్నా ఏమి ఉపయోగం ఉండదు. రైల్వేస్టేషన్లలో రోడ్లపై ఎంతమంది ఉన్నా, వారి ఆలోచనలలో ఏకత్వం ఉండదు, దానివలన ఏ ప్రయోజనం నెరవేరదు. కానీ భావనాత్మక ఏకత్వం, చేసే పనులు ఒకే రకంగా ఉంటే చిన్న సముదాయం కూడా పెద్ద చమత్కారం చూపగలదు.

ఆలోచనల విద్యుచ్ఛక్తి సంబంధించిన వ్యక్తుల వరకు మాత్రమే పరిమితం కాదు, అది అంతరిక్షమంతటా వెదజల్లబడుతుంది. అది గాలివలె ఎగురుతూపోతుంది. దానికి అనురూపమైన పరిస్థితి కనిపించినప్పుడు అక్కడ దిగుతుంది. ఒకే రకమైన ఆలోచనలు ఏకత్రితం అయినప్పుడు వాటి సముదాయం ఏర్పడుతుంది. ఈ రకంగా అనేక వర్గముల ఆలోచనా సముదాయాలు ఏర్పడతాయి, తమప్రభావంతో అనేకమందిని దగ్గర చేసుకుని తమ సముదాయమును పెద్దదిగా చేసుకుంటాయి. ఈవిధంగా ప్రపంచంలో అనేక ఆలోచనా ధారలు తమతమ వర్గాలను (groups) తయారు చేసుకుంటాయి. ఒక ఆదర్శవంతమైన ఆలోచనాసరళి అంతరిక్షమంతటా విస్తరిస్తే ఏకత–సమతల వాతావరణం సహజంగా తయారవుతుంది. 21వ శతాబ్దం ఇలాంటి కొన్ని ఆలోచనా పుంజములను తీసుకురానున్నది.

*– పూజ్యగురుదేవుల వాఙ్మయం 22 (1.1)*

*అనువాదం: ముక్కామల రత్నాకర్*

**భగవంతుని పొందుటకు భావసంవేదనలు ప్రధానం**

# సంకల్పశక్తి

జ్ఞానసంపద కొరకు, బుద్ధి వికాసానికి, పనులలో ప్రావీణ్యానికి శిక్షణ కార్యక్రములు జరుగుతుంటాయి. దీనితో పాటు సంకల్పశక్తి యొక్క మహత్వాన్ని అర్థం చేసుకోవాలి. సంకల్పశక్తితోనే మనిషి ఉన్నత శిఖరాలను అధిరోహించ గలుగుతాడు. **మనోమయకోశం జాగృతం చేసే ఉపాయాలన్నీ సంకల్పశక్తితోనే జరుగుతాయి.**

ప్రగతిపథమున వెళ్ళాలంటే లేమిని, ఇబ్బందులను దాటాలంటే, ప్రతికూలతలను అనుకూలంగా మార్చుకోవాలంటే సాధనా సామాగ్రి సరిపోదు, సంకల్పశక్తిని బాగా పెంచు కోవాలి. సదుపాయాలు బాగా ఉంటే మనిషి బద్ధకస్తుడుగా, విలాసవంతుడుగా కూడా తయారవచ్చు. ఇలా జరిగితే అతను సదుపాయాలన్నీ పోగొట్టుకోవచ్చు, పనికిరానివాడిగా తయారవ వచ్చు. ప్రగతి యొక్క ఇతిహాసాలలో సాధనల కంటే, అనుకూల పరిస్థితులకంటే ఆలోచనల, ఆకాంక్షల మహత్వం ఎక్కువ. సంకల్పశక్తి వీటిని సమన్వయం చేస్తుంది. సంకల్పశక్తియే ప్రగతి పథమును ప్రశస్తం చేస్తుంది. ఎక్కడ దీనిలోటు ఉంటుందో అక్కడ ప్రగతి యొక్క రథచక్రములు అవరోధములనే ఊబిలో కూరుకుపోతాయి.

ఏదైనా వస్తువును కోరుకోవడం వేరు, కోరికతోపాటు శక్తిని కూడగట్టుకోవడం వేరు. ప్రతివారు ధనవంతులు కావాలని, విశ్వమంతా కీర్తిప్రతిష్ఠలు పొందాలని, ఏది కావాలంటే అది వెనువెంటనే ప్రాప్తించాలని కోరుకుంటారు. కానీ కోరుకుంటే సరిపోదు, కోరికతోపాటు (ఇచ్ఛ) శక్తిని కూడగట్టుకోవాలి. ఈ శక్తివల్లనే కోరిక నెరవేరుతుంది.

ఈ తథ్యమును సోదాహరణంగా చెప్పేందుకు కాశీలో సుప్రసిద్ధ సిద్ధయోగి విశుద్ధానంద ముగ్గురు శిష్యులతో ఇలా అన్నాడు. "చూడండి ఇచ్ఛాశక్తి విషయంలో ఒక ప్రయోగం చెప్తాను. మీరు ముగ్గురు మీ పిడికిలి మూసివేసి దానిలో ఉంచుకోతగిన వస్తువును కోరుకోండి" ముగ్గురు శిష్యులు పిడికిలి మూసివేసి స్వామిజీ నిర్దేశానుసారం వారికి ఇష్టమైన వస్తువును కోరుకోవడం మొదలుపెట్టారు. కొంచం సేపు అయిన తరువాత స్వామీజీవారి పిడికిలిని తెరచి చూడమన్నారు. కోరుకున్న వస్తువు వచ్చిందా లేదా అని అడిగారు. వారి పిడికిలిలో కోరుకున్న వస్తువులు ఏమీ లేవు, చేతులు ఖాళీగా ఉన్నాయి. స్వామీజీ మరల అన్నారు – "మీరు మీ పిడికిలి మూసివేసి కోరుకున్న వస్తువుల గురించి ఆలోచించారు కోరుకున్నంత మాత్రన (ఇచ్ఛ) ఏమి జరగదు. నేను ఇప్పుడు మీ ఇచ్ఛలో శక్తిని సంచారం చేస్తాను" ముగ్గురు శిష్యులు పిడికిలి మూసివేసి తాము కోరుకున్న వస్తువుల గురించి ఆలోచిస్తున్నారు. స్వామీజీ చెప్పిన తరువాత వారు పిడికిలి తెరచి చూస్తే వారు కోరుకున్న వస్తువులు ఉన్నాయి.

సిద్ధయోగి ఈ సంఘటనపై వ్యాఖ్యానిస్తూ "మీ కోరిక (ఇచ్ఛ) నాశక్తి కలసి ఇచ్ఛాశక్తి రూపంలో పరిమితి చెందాయి. మీరు మీ శక్తిని వికసింపచేసుకోగలిగితే ఈ శక్తి సంచార అవసరం ఉండదు.

ఎక్కడెక్కడ చమత్కార సంఘటనలు జరిగాయో వాటి మూలంలో ఇచ్ఛాశక్తి తప్పనిసరిగా ఉండి ఉంటుంది. అమెరికా లోని "మిచిగన్ పేరాసైకిక్ రీసర్చి సెంటర్" ఈ రకమైన అనేక సంఘటలను సంకలనము చేసి వాటి వాస్తవికతను తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఎన్నుకున్న కొన్ని సంఘటనలు కొన్ని నిరాధారమైనవని. అసత్యాలని తేలింది, ఎన్నో సంఘటనలు సత్యమైనవని కూడా తేలింది.

అమెరికాలోనే కాక రష్యాలో కూడా ఇలాంటి ప్రయోగాలు జరిగాయి. అనేకమంది వ్యక్తులు ఇచ్ఛాశక్తి యొక్క అద్భుత సామర్థ్యమును వైజ్ఞానిక పరీక్షలకు నిస్సంకోచంగా ముందుకు వచ్చారు. శ్రీమతి ముఖాయిలేవా యొక్క అతీంద్రియ సామర్థ్యం ఖ్యాతి చెందింది. ఒక విందు కార్యక్రమములో ఆమెను తన సామర్థ్యమును ప్రదర్శించమని కోరాడు. అక్కడ టేబుల్‌పై ఉన్న ఒక రొట్టెను నిర్నిమేష (నిర్నిమేష) దృష్టితో చూడటం మొదలుపెట్టింది. కొన్ని క్షణాలలో ఆ రొట్టె ఆమె వైపు జరగటం మొదలు పెట్టింది. ఆ రొట్టె దగ్గరకు రాగానే ఆమె కొంచెం తలవంచి నోరు తెరచింది. ఆ రొట్టె ఆమె నోటిలోకి వెళ్ళిపోయింది.

రష్యాలోనే మరొక మనోచికిత్సకుడు డా॥ బైశ్యనోయి తన

**ఉపయోగింపకూడని రీతిలో ధనాన్ని వినియోగించుటచేత వ్యక్తి మరియు సమాజం నిర్వీర్యమైపోతున్నది**

అలౌకిక శక్తికి ఖ్యాతిచెందాడు. అతను ఏ వస్తువుపైన దృష్టిపెట్టి దానిని కదలించగలడు. ఖాళీపాత్రలను నీటితో, పాలతో నింప గలడు, కొందరు వైజ్ఞానికులు ఆయనకు అన్ని రకముల పరీక్షలు చేసి అతని దగ్గర ఏమిమోసం లేదని తేల్చారు. డా॥ నడ్సోర్ ఫీడర్ తన పుస్తకం "బిట్వీన్ టు వరల్డ్స్"లో ఎన్నో ఇటువంటి సంఘటనల గురించి వ్రాశాడు. వీటిమూలంలో స్థూల మానవీయ సామర్థ్యం కంటే ఏదోశక్తి పని చేస్తుందని అంటాడు.

అమెరికా చెందిన యూరిగైలర్ ఇచ్ఛాశక్తి ద్వారా ఇనుప రేకులను మడతపెట్టడం; కత్తులు, చెంచాలు విరవడం చేసే వాడు. ఇతనిని పరీక్షించినవారికి ఎటువంటి మోసం కనిపించ లేదు.

భారతీయ మహర్షులు ఈ శక్తులను ఇచ్ఛాశక్తి యొక్క సాధారణ చమత్కారములని అంటారు. మనస్సును శుద్ధంగా ఉంచుకుని, అంతఃకరణను పవిత్రంగా చేసుకుని చిత్తాన్ని ఏకాగ్రత చేసుకోగలిగితే అణిమ, మహిమ, లఘిమ మొదలైన సిద్ధులు ప్రాప్తిస్తాయని పతంజలి మహర్షి అంటారు. వస్తుతః మనుష్యుని ప్రవృత్తి తన ఇచ్ఛ ఆకాంక్షలవైపు మళ్ళుతుంది. కానీ ఇచ్ఛల (కోరికల) బలం, శక్తి చిందరవందరగా ఉండటం వలన వాటికి బలం చేకూరదు. సూర్యుని యొక్క కిరణములను ఒక స్థానంపై కేంద్రీకరించగలుగుతే అవి పెద్దపెద్ద పనులు చేయగలవు.

చిందరవందరగా పడి ఉన్న ఇచ్ఛలను (కోరికలను) కేంద్రీకరించగలిగితే ధృడసంకల్పశక్తిని మేల్కొనగలిగితే శారీరిక అసమర్థత లేక అంగహీనతలు కూడా అడ్డంకులు కాలేవు. రష్యాలోని ఒక చూపులేని (గుడ్డి) యువతి తన ఇచ్ఛాశక్తితో కాగితంపై వ్రాసి ఉన్న అక్షరాలను చదవగలిగేది. ఆమె కాగితంపై వ్రాసి ఉన్న అక్షరాలను స్పర్శించి అక్కడ ఏమీ వ్రాసి ఉన్నదో బాగా చూపు ఉన్న వ్యక్తి వలె చెప్పగలిగేది.

ఆమెకు ఈ సామర్థ్యం అకస్మాత్తుగా ఏమీ రాలేదు. చిన్నతనం నుంచే ఆమెకు చూపు లేదు. ఆమె వయస్సుగలవారు స్కూలుకు పోతుంటే తాను స్కూలుకు పోలేకపోతున్నందుకు దుఃఖించేది. తాను స్కూలుకి వెళ్ళి చదువుకోలేకపోవడం వలన ఎన్నో విషయాలు నేర్చుకోలేకపోతున్నందుకు చాలా వ్యాకులపడేది.

ఆమెకు చదువుకోవాలనే ఆకాంక్ష అంతఃకరణలో ప్రబలమయి పుస్తకాలలోని కాగితాలపై చెయ్యిపెట్టి అర్థం చేసుకునే ప్రయత్నం చేసింది. ఒకరోజు ఇలాంటి ప్రయత్నం చేస్తున్నప్పుడు, పుస్తకంలో పేజీలు తిరగేస్తున్నప్పుడు అక్కడి అక్షరాలను చూడగలిగింది. ఆమె దృష్టి చేతి వేళ్ళలోకి వచ్చి అక్కడ కేంద్రితమయింది. దాని తరువాత ఎప్పుడైనా పుస్తకం యొక్క కాగితములను ముట్టుకున్నప్పుడు అక్కడ ఉన్న అక్షరములను ఒక్కొక్కటి తన చేతివ్రేళ్ళతో చూడగలిగేది.

ఉపనిషత్తులు ఇలా అంటాయి–"సంకల్పబోయం పురుషః" పురుషుడు సంకల్పమయం. మనిషి ఇచ్ఛానుసారం జన్మ తీసుకుంటాడు. ఇచ్ఛానుసారం మృత్యువును ప్రాప్తించు కుంటాడు, కావాలనుకుంటే పరబ్రహ్మను కూడా ప్రాప్తించు కోగలడు అలాంటప్పుడు మాములు కోరికలు ఎందుకు నెరవేరవు? కోరికలతోపాటు శక్తిని కలుపుకోగలిగి ఇష్టమైన వస్తువులు, సఫలతలు సాధించుకునే విజ్ఞానం ఇక్కడ చెప్ప బడటం లేదు. ఎందుకంటే ఈ విజ్ఞానం ఆత్మకళ్యాణం మార్గంలో అడ్డం పడుతుందని పండితులు భావిస్తారు. వారి దృష్టిలో ఇది బహిర్ముఖి సాధన ఆత్మకళ్యాణం కొరకు కోరికలను అంతర్ముఖం చేసుకొనవలసి వస్తుంది. సమస్త ఇచ్ఛలను, కోరికలను పరమ చేతనత్వంలో విలీనం చేసి పరమాత్మను ప్రాప్తించు కోవాలి.

*– పూజ్య గురుదేవుల వాఙ్మయం 57 (1.3) నుండి*

*అనువాదం: ముక్కామల రత్నాకర్*

## సేవామార్గం

*దేశబంధు చిత్తరంజన్‌దాసు తాతగారు జగబంధు దాసు. ఆయన పరోపకార పరాయణుడు. అలసిసొలసి వచ్చే బాటసారుల కోసం తన గ్రామంలో ఒక ధర్మశాల కూడా కట్టించారు. ఆయన ఇతరుల దుఃఖాన్ని చూడలేక పోయేవారు. ఒకరోజున పల్లకిలో కూర్చుని పొరుగు గ్రామానికి పోతున్నారు. వేసవి రోజులు. త్రోవలో ఒక బ్రాహ్మణుడు ఎదురయ్యాడు. వేసవి తాపానికి బాగా అలసి పోయాడు, నడవలేకపోతున్నాడు. వెంటనే జగబంధుదాసు పల్లకి నుండి క్రిందికి దిగాడు. ఆ బ్రాహ్మణుని పల్లకిలో కూర్చుండబెట్టి గ్రామానికి చేర్చాడు.*

– *అనువాదం:* పొన్నూరు హైమవతీశాస్త్రి

**తన సుఖాన్ని బలిగాపెట్టి ఇతరులకు సుఖాన్ని అందించుటే ప్రేమకు చిహ్నం**



# నారీ అభ్యుదయం - అరుణోదయం

ప్రకృతి యొక్క అనుపమ కళాకృతి స్త్రీ. సృష్టియొక్క వికాసక్రమంలో స్త్రీ పాత్ర ఎంతో ముఖ్యమైనది. అసలు మానవునికి జన్మను ప్రసాదించునది స్త్రీ మూర్తియే! సౌందర్యం, దయ, మమత, ప్రేమ, త్యాగం, సమర్పణ మున్నగు అన్ని అంశాలకు స్త్రీ సజీవమైన ప్రతిరూపంగా భావించబడుతోంది. ఇన్ని దైవీగుణాలు కలిగి ఉన్న కారణంచేతనే వేదకాలంనుండి నేటి ఆధునికకాలం వరకు ఆమె ప్రాముఖ్యత స్థిరంగా నిలచి ఉన్నది. కారుమబ్బులతో కూడిన మధ్యకాలము, భోగ పూరితమైన నేటి ఆధునికసమాజం కూడా ఎన్నోవిధాలుగా ప్రయత్నాలు చేసినప్పటికీ ఆమె ప్రాముఖ్యతను ఏమాత్రము తగ్గించలేకపోయాయి. ప్రతీయుగంలోను స్త్రీ యొక్క ప్రతిభా పాటవాలవల్ల, వ్యక్తిగతంగానేకాక, దేశం, ప్రపంచంకూడా లాభాన్వితమవుతూనే ఉన్నాయి. అభివృద్ధిపథంలోను, నిర్మాణంలోను స్త్రీ యొక్క పాత్రను ఎన్నటికీ మరచిపోలేం.

వేదకాలం స్త్రీ చరిత్రకు స్వర్ణయుగం వంటిది. ఆరోజులలో స్త్రీని ఆదర్శానికి ప్రతిరూపంగా చూచేవారు. విద్యకు అధిష్ఠాన దేవతగా సరస్వతిని, ధనానికి లక్ష్మీదేవిని, శౌర్యపరాక్రమాలకు దుర్గను, సౌందర్యానికి రతీదేవిని, పవిత్రతకు గంగను ప్రతీకలుగా భావించడం జరుగుతోంది. ఈ యావత్ సృష్టిని పర్యవేక్షించే శక్తియొక్క ప్రకృతి కూడా స్త్రీ రూపంలోనే చిత్రీకరించబడింది. డాక్టర్ రాజకిశోర్‌సిన్హాగారు తాను వ్రాసిన ప్రాచీన భారతీయ కళ మరియు సంస్కృతి అనే గ్రంథంలో స్త్రీ ఔన్నత్యాన్ని వర్ణిస్తూ ఇలా అన్నారు. మమతలకు మంజూష (పెట్టెవంటిది), స్నేహానికి సదనం, దయకు మూలస్థానం, క్షమాగుణంలో మేరుపర్వతం, విధాత యొక్క కళాపూర్ణమైన సృష్టికి శృంగారమూర్తి, పృథ్వియొక్క కవిత, దేశనిర్మాణానికి ఆధారశిలమైనది. లక్ష్మీ, పార్వతి, సరస్వతి ఈ ముగ్గురు మూర్తులకు సమానమైనటువంటి స్త్రీకి ఈ భారతభూమిలోనే కాదు, యావత్ప్రపంచంలో కూడా ఆదరణీయమైన స్థానం ఉంటూనే ఉంది.

వైదికకాలంలో లేదా ప్రాచీన భారతదేశంలో స్త్రీలు ఎంతో ఉన్నతస్థాయి విద్య అభ్యసించేవారు. అందుచేత వారిపట్ల ఎంతో గౌరవం ఉంటూఉండేది. యజుర్వేదంలో స్త్రీని సంబోధిస్తూ ఈ విధంగా చెప్పబడిఉంది. “ఓ స్త్రీ! నీవు స్తుతింపదగిన, ఉత్తమమైన, ఆదరణీయమైన, పూజనీయమైన కమనీయమైన, చంద్రునివలె ఆహ్లాదం కలుగజేయుదానవు. శ్రేష్ఠమైన శీలం చేత నీ దైవీగుణాల ప్రకాశవంతం చేత అజ్ఞానాంధకారాన్ని దూరం చేయగలిగినటువంటిదానవు. నీవు దీన, హీన భావాలు లేనిదానవు.” స్త్రీని గురించిన ఈ దివ్యమైన వర్ణన ఆమె యొక్క శ్రేష్ఠత్వాన్ని సూచించే ఒక మచ్చుతునక. వేదమంత్రాలపట్ల అభిరుచి, వాటిని గురించి తెలుసుకొనవలెననే కుతూహలం కలిగి ఉండుటచేత, స్త్రీని యజుర్వేదంలోనే ‘సోమపృష్ఠా’ అని సంభోదించడం జరిగింది. డాక్టరు ఉపేంద్రఠాకూర్ తాను వ్రాసిన సాహిత్యం – సంస్కృతి అనే పుస్తకంలో ఈ సత్యాన్ని ఎంతో చక్కని రీతిలో ధృవీకరించారు. ఆయన అభిప్రాయాన్ని అనుసరించి అత్రిమహర్షి కుటుంబానికి చెందిన విశ్వవార మంత్రద్రష్టగా ప్రఖ్యాతిగాంచింది. కక్షీవాన్ మహర్షి యొక్క పుత్రికయైన ఘోషా ఋగ్వేదంలోని రెండు మండలాలను, అగస్త్యమహర్షి యొక్క ధర్మపత్నియైన లోపా ముద్ర రెండు ఋక్కులను రచించినట్లుగా చెప్పబడినది. అసంగ మహారాజు భార్య రాణి శాశ్వతి, బ్రహ్మవాదిని అపాల కూడా ఈ యుగంలో ప్రఖ్యాతిచెందిన తత్త్వవేత్తలు.

వైదికయుగంలో విదుషీమణులకు లెక్కలేదు. వారి ప్రఖరపాండిత్యం, అఖండమైన ప్రతిభలను గూర్చిన పలు విషయాలు సవివరంగా మనకు లభిస్తాయి. సులభ అను విదుషీమణి ఆకాలంలోనే ప్రఖ్యాతిగాంచిన మహిళ, వక్తత్వ కళలో ఆమె విశేషమైన ప్రావీణ్యం గడిచింది. ఆమెయేగాక, శ్రద్ధ, సరమ, రోమాశ, యమి, అదితి మున్నగు స్త్రీ–ఋషికలు వేదాల యొక్క నిగూఢమైన రహస్యాలను సాక్షాత్కరింప జేసుకొన్నారు. ఆధ్యాత్మికజ్ఞానాన్ని కలిగి ఉండుటతోపాటు, ధార్మిక, సాంఘికరంగాలలోకూడా వారికి పురుషులతో

**నిజమైన సేవభావము, అచంచల విశ్వాసము ఎన్నడూ వృథాకావు**

సమానమైన ప్రతిపత్తి ఉండేది. యజ్ఞాలలోనైతే వారి సహ భాగిత్వం తప్పనిసరి. డాక్టరు వాసుదేవశరణ అగర్‌వాల్‌గారి వాక్కులననుసరించి 'స్త్రీ–పురుష' లిరువురూ నదికి రెండు తీరాల వంటివారు. అనగా తీరాలు రెండూ ఒకదానితో నొకటి అనుసంధానించబడి ఉన్నట్లు, స్త్రీ–పురుషులిరువురి జీవితాలు ఒకదానితో ఒకటి జోడింపబడి ఉంటాయి. ఇరువురి మధ్యా జీవితమనే ప్రవాహం సాగుతూ ఉంటుంది. వైదిక సాహిత్యంలో స్త్రీ–పురుషులను భూమి ఆకాశాలతో పోల్చినారు. ముత్యపు చిప్పలోని రెండు దళాలమధ్య ముత్యం ఉన్నట్లుగా, స్త్రీ–పురుషుల మధ్య సంతతి ఉంటుంది. ఆ విధంగా పతి–పత్ను లిరువురూ పరస్పరపూరకాలుగా ఉంటారు. ప్రకృతి స్త్రీకి సంతానోత్పత్తి చేయడమనే విశిష్టగుణాన్నిచ్చి, సృష్టిలోని సమస్త జీవులలోను ఒక ప్రత్యేకతను ఆపాదించింది.

కుటుంబంలోని గానీ, సంఘంలోనిగానీ స్త్రీ యొక్క పాత్ర, పురుషునితో సమానంగా ఉండేది. కన్యాదాన సమయంలో తల్లియొక్క ఉపస్థితి తప్పనిసరిగా భావించబడుతుండేది. స్త్రీ తల్లిగాను, గృహిణిగాను, సహచరిగాను చూడబడుతుండేది. గృహిణి రూపంలో గృహనిర్వహణ ఆమెయే నిర్వహిస్తూ ఉండేది. పతివ్రతయైన స్త్రీని దేవతాస్వరూపంగా గౌరవించేవారు. స్త్రీకిగానీ, పురుషుడికిగానీ తమతమ ఇష్టానుసారం వివాహం చేసుకునే స్వతంత్రం ఉండేది.

రామాయణకాలంలో స్త్రీని వివిధరూపాలలో చిత్రించడం జరిగింది. అహల్య, సీత, తార, మండోదరి వంటి మహిళా మణుల కారణంగా ఆ యుగం ప్రత్యేకతను సంతరించుకున్నది. ఆనాటి సమాజంలో స్త్రీశిశువు జన్మించింది అంటే ఎంతో శుభంగా భావించబడుతుండేది.

శుభకార్యాలలో అవివాహితమైన కన్యల ఉనికి తప్పనిసరిగా ఉండేది. ఇక కన్యాదానం చెయ్యడమంటే మహాపుణ్యకార్యమే! స్త్రీలకు లౌకికమైన, నైతికమైన విద్యలతోపాటు రాజనైతిక నైపుణ్యాన్ని కూడా బోధించేవారు. స్త్రీలు సంగీతం, నృత్యం మున్నగు పలుకళలలో నిష్ణాతులుగా ఉండేవారు. కౌసల్యాదేవి మంత్రసహితంగా ఆహుతులు వెయ్యడమూ, సీత సంధ్యోపాసన చెయ్యడమూ, తారాదేవి మంత్రాలలో నిష్ణాతురాలు అన్పించు కోవడమూ మొదలైన పలు అంశాలు రామాయణంలో మనకు తారసపడతాయి. కైకేయి యుద్ధవిద్య అభ్యసించి, దశరథ మహారాజును యుద్ధసమయంలో రక్షించింది. ఆ రోజులలో పలు సందర్భాలలో స్త్రీల శౌర్యపరాక్రమాల గురించిన వివరణ మనకు లభిస్తోంది.

రామాయణకాలంలోని స్త్రీల విషయంలో శాంతాకుమార్ వ్యాస్ ఈవిధంగా వ్రాస్తున్నారు. 'ఆ కాలంలో స్త్రీల పరిస్థితి శుభకరంగా ఉండేది. అప్పటి పరిస్థితులననుసరించి స్త్రీని ఒక కన్యగా, పత్నిగా, మాతగా, విధవగా... ఏ స్థితిలో ఉన్నాసరే ఆమెకు సమకూర్చవలసిన సమస్త సౌకర్యాలను ఏర్పరచి, ఎంతో గౌరవంగా చూసేవారు. అధికారాన్నిచ్చి ఆదరించేవారు. అందువల్ల ఆమె కుటుంబంలో, సంఘంలో, దేశంలోను సాంస్కృతిక పురోగతికి అమూల్యమైన కృషిని చేయగలిగేది. స్త్రీత్వమునకు ఆఖరుమెట్టు మాతృత్వంగా ఆదికవి వాల్మీకి అభివర్ణించారు. మానవుని వ్యక్తిత్వ నిర్మాణానికి సూత్రధారణి తల్లియే, తండ్రికాదు.

మహాభారత కాలంలో కూడా స్త్రీ యొక్క సమృద్ధి, ప్రగతి స్పష్టంగా దృగ్గోచరమౌతోంది. మహాభారతంలోని అనుశాసన పర్వంలో భీష్మపితామహుడు స్త్రీని ఎల్లప్పుడు పూజనీయు రాలిగా భావిస్తూ స్త్రీల పట్ల స్నేహపూర్వకమైన ప్రవర్తనను కలిగి ఉండుట ఎంతో అవసరం అని అన్నాడు. స్త్రీలను పూజించి గౌరవించినచోట దేవతలు నివసిస్తుంటారు. స్త్రీలు లేని ప్రదేశాలలో అన్ని కార్యాలు నిష్ఫలం అయిపోతాయి. స్త్రీని దైవీగుణ సంపన్నురాలిగా వర్ణించడం జరిగింది. పత్ని–భర్త యొక్క సగభాగంగా భావించబడింది. భర్తకు ఈ ప్రపంచంలో అందరికన్నా ముఖ్యమైన స్నేహితుడు భార్యయే అని నిర్ణయించడం జరిగింది. మూడురకాలైన ధర్మ అర్థ కామము లకు ఆమెయే మూలంగా భావించిబడింది. దుఃఖమును దాటడానికి ఒకేఒక్క ఆసరా భార్యమాత్రమే! భార్యను కూడి ఉంటేనే భర్తకు గౌరవము, ఆనందమూకూడా! ప్రియమైన మాటలను మాట్లాడుతూ, జనశూన్యమైన ప్రదేశాలలో భార్య–భర్తకు స్నేహితునివలె వ్యవహరిస్తుంది. ధార్మిక కార్యక్రమాలలో తండ్రి వలె సలహాలను ఇస్తూ ఉంటుంది. ఆ రోజులలో వివాహితులైన స్త్రీలకు సన్యాసం స్వీకరించేటందుకు అధికారం ఉండేది. సావిత్రి, దమయంతి, గాంధారి, ద్రౌపది, సత్యభామ,

**నియమబద్ధ జీవనసరళికి చిహ్నం భారతీయ సంస్కృతి**

సుభద్ర మొదలైనవారు ఆనాటి పతివ్రతామణులు. స్త్రీకి సౌశీల్యమే ఆభరణంగా భావించబడేది. భార్యకు భర్తతో సమానంగా అన్ని అధికారాలు లభించేవి. ఆ కాలంలో స్త్రీని గృహలక్ష్మిగా భావించి, సమస్తమైన సుఖసమృద్ధులకు చిహ్నంగా భావించేవారు, గౌరవించేవారు. సమాజంలో సత్యవతి, కుంతి, ఉత్తర మొదలైనవారికి విశిష్టస్థానాలు లభించినట్లుగానే, విధవలకు మంచి గౌరవాభిమానాలు లభించేవి.

మహాభారతకాలం తరువాత మౌర్యులవంటివారి కాలంలో స్త్రీ యొక్క విద్వత్తుకు, పాండిత్యానికి పలు ఉదాహరణలు లభిస్తున్నాయి. గుప్తులకాలంలో కూడా స్త్రీలయొక్క పాండిత్యాన్ని గురించిన వర్ణన మనకు లభిస్తుంది. వాత్స్యాయనుడు తన కామసూత్రాలు అనే పుస్తకంలో కుటుంబగౌరవానికి, ప్రతిష్టలకు సంబంధించిన కొన్ని అవసరమైన పనులను స్త్రీలు నిర్వహించ వలసి ఉంటుందని కూడా వ్రాశారు. ఆ రోజులలో స్త్రీ విద్యపట్ల తగినంత ప్రత్యేక శ్రద్ధ చూపేవారు. శీలాభట్టారిక అనే మహా విద్వాంసురాలు ఆ కాలంనాటి స్త్రీయే! భోజులు తాను వ్రాసిన సరస్వతీకంఠాభరణంలో శీలాభట్టారికను సిద్ధహస్తురాలైన పాంచాలిరీతి ప్రయోక్తగా భావించారు. శూద్రకుడు మృచ్ఛకటికం అనే నాటకంలో ప్రఖ్యాతిగాంచిన సంగీతజ్ఞులను పరిచయం గావించాడు. చంద్రగుప్త విక్రమాదిత్యుని కుమార్తె ప్రభావతి కూడా ఒక ప్రఖ్యాత విదుషీమణి. ఆ కాలంలో పరదావిధానం అమలులో ఉండేదికాదు. ఆరోజులలో స్త్రీలు సార్వజనీనమైన అన్ని ఉత్సవాలు, కార్యక్రమాలలో పాల్గొనే వారు. నారద, పరాశరస్మృతులలో స్త్రీకి పునర్వివాహం సమంజసమే అని సమర్థించబడి ఉంది.

రాజపుత్రుల కాలంలో స్త్రీల పరిస్థితి దృఢంగాను, శక్తివంతంగాను ఉండేది. అవసరమైనప్పుడు వారి అస్త్ర శస్త్రాలను ధరించి రణరంగంలో పోరాటానికి సంసిద్ధమయ్యే వారు. ఎడారివంటి రాజస్థాన్‌ప్రాంతం ఆకాలంలో స్త్రీల శౌర్య పరాక్రమాలకు నిలయంగా ఉండేది. స్త్రీలు మంచి వ్యక్తిత్వం, సౌశీల్యం కలిగి పతీవ్రతలై ఉండేవారు. వారు మహమ్మదీయ దురాక్రమణదారుల నుండి తమ సతీత్వాన్ని, పాతివ్రత్యాన్ని కాపాడుకోడానికి జౌహరు వ్రతాన్ని ఆచరించేవారు. ఆ సందర్భంగా ప్రఖ్యాత విద్వాంసుడు రాధాముఖర్జీ తాను వ్రాసిన "భారతదేశపు సంస్కృతి కళలు" అనే పుస్తకంలో జౌహరు గురించి వ్రాశారు. రాజపుత్ర చరిత్రలో జౌహరుకు ఒక ప్రత్యేక స్థానం ఉండేది. యుద్ధాలలో పరాజితులైన, మరణించిన రాజపుత్రుల భార్యలు, కొందరు సామాన్యస్త్రీలు ఆత్మాహుతి చేసుకునేవారు.

భాస్కరాచార్యుని పుత్రిక లీలావతి గణితశాస్త్రంలో మహా మేధావి, అదేవిధంగా రాజశేఖరుని పత్నియైన అవంతీదేవి కూడా శ్రేష్ఠురాలైన కవయిత్రిగా పేరుగాంచింది. ఆ కాలంలోనే కాశ్మీరురాణి, కాకతీయుల రాణీ రుద్రాంబ మొదలైన శాసకులు కూడా ఉన్నారు. రాణీదుర్గావతి శౌర్యపరాక్రమాలకు ప్రతీక! స్త్రీలలో ఆత్మబలిదానం చేయవలెననే భావం అన్నింటికన్నా ప్రథమంగా ఉండేది.

ఈ మధ్యకాలంలోనే జరిగిన స్వాతంత్ర్యపోరాటంలో స్త్రీలు నిర్వహించిన పాత్ర తక్కువైనదేమీకాదు. స్వాతంత్ర్య సంగ్రామ సమయంలో ఆత్మాహుతి చేసిన వీరాంగన లక్ష్మీబాయి వారిలో ప్రథమురాలు. దేశబంధు సి.ఆర్.దాస్‌గారి పత్ని వాసంతీదేవి, సోదరి ఊర్మిళాదేవి స్వాతంత్ర్యపోరాటంలో తమ వంతుపాత్రను నిర్వహించారు. ఊర్మిళాదేవి సత్యాగ్రహ పోరాటపు కమిటీకి అధ్యక్షురాలిగా ఉండి, గాంధీగారితోపాటు నవకాళీ సంఘటనలో పాల్గొన్నారు. ఉక్కుమనిషి సర్దార్‌పటేల్‌గారి కుమార్తె మణిబెన్ పటేల్ కూడా సజీవత్యాగమూర్తియే. లీలావతీ దేవి స్త్రీ విద్యా సేవసంఘమును స్థాపించి, సాహిత్యాన్ని స్థాపించడంలో విశేష మైన కృషిసలిపారు. శ్రీ అరవిందులవారి సోదరి సరోజినీదేవి, బిస్మిల్లాగారి సోదరి శాంతాదేవి, దుర్గాబాయి మొదలైన వారందరు స్వతంత్రపోరాటమనే యజ్ఞంలో తమ సర్వస్వాన్నీ ఆహుతి చేశారు.

"21వ శతాబ్దం – స్త్రీ శతాబ్దం" అనే పతాకం అన్నింటికన్నా ఎత్తుగా ఎగురవేయగలిగే సమయం దగ్గరలోనే ఉంది. స్త్రీని చేయిపట్టి ముందుకు తీసుకుని పోగలిగిన మహాకాలుని హుంకారమే ఇది!

ఈనాడు స్త్రీ జీవితంలో తాను బంధవిముక్తురాలు కాగలిగే అదృష్టంతోపాటు, ఇతరులకు కూడా బంధవిముక్తి చేయగలిగే గౌరవనీయమైన బాధ్యత కూడా విధాత ఆమెకు అప్పగించాడు.

*– అఖండజ్యోతి, 1998 అక్టోబర్*

*అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

**నేడు కష్టంగా ఉన్నా ముమ్ముందు లాభం చేకూర్చే మార్గాన్ని అనుసరించుట మేలు**

# ఆరోగ్యం కొరకు, దీర్ఘజీవనం కొరకు అలవాట్లు మార్చుకోవాలి

ప్రపంచంలో ప్రతి ఒక్కరు సుఖంగా వంద సంవత్సరాలు జీవించాలని కోరుకుంటారు, త్వరగా చనిపోవాలని ఎవరికీ ఉండదు. చాలా మంది తమ ఆయు ప్రమాణం ముందే నిర్ధారించబడి ఉంటుందని భావిస్తుంటారు. కానీ ఇది ఒక భ్రమ, ఒకరికి 50 సంవత్సరాలు ఒకరికి 70 సంవత్సరాలు, ఒకరికి 30 సంవత్సరాలు అని ఈశ్వరుడు భేదాభిప్రాయం చూపడు, అన్యాయం చేయడు. దీర్ఘజీవనం యొక్క నియమాలు పాటిస్తూ ఎవరైనా 100 సంవత్సరాలు జీవించవచ్చు. మన పూర్వీకుల వలె ఎక్కువకాలం జీవించగలగటం అనేది ఎక్కువ దూరంలో లేదు.

నియమిత జీవనచర్య కారణంగా భీష్మపితామహుడు తన శరీరమంతా బాణాలతో గాయమైనప్పటికీ ఉత్తరాయణ పుణ్య కాలం వరకు జీవించి తుదిశ్వాస విడిచాడు. సత్యవంతుడు, మార్కండేయుడు మొదలైనవారు ఇచ్ఛానుసారం ఆయువుని ప్రాప్తించుకున్నారు. 16వ శతాబ్దంలో ఇటలీ దేశంలో ఒక సాధారణ మనిషి లూయి కొరనారో సంయమ దినచర్య కారణంగా రెండువందల సంవత్సరాలు జీవించాడు. అతడు ఎన్నడు మద్యం, మాంసం ముట్టలేదు. తిను, త్రాగు, మజా చెయ్యి అనే పద్ధతి మంచిది కాదు. ఈ విధానంలో జీవనశక్తి క్షయమవుతుంది.

ఆహారం గురించిన వైజ్ఞానిక విషయాలు తెలుసుకోవడం ఎంతో అవసరం. రుచి కొరకు మసాలవేసిన పదార్థములు తినడం మంచిది కాదు. అధికాధికంగా ప్రాకృతిక నియమాలు పాటించడం, మితాహారం క్షేమకరం. మైసూర్ నివాసి సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య 100 సంవత్సరాల వయస్సులో కూడా 50 సంవత్సరాల వయస్సుగల వాని వలె పనిచేసేవాడు. దానికి కారణం మితాహారం, వ్యాయామం అని ఆయన చెప్పేవాడు. త్రివేండ్రం ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపల్ గత 30 సంవత్సరాలుగా ఒకే బరువు ఉన్నారు. వారు ఆరోగ్యం కొరకు నాలుగు సూత్రాలు చెప్తారు. 1) నిత్యం నూనెతో మాలిష్ 2) నియమిత వ్యాయామం 3) మజ్జిగ 4) మితాహారం.

బ్రెజిల్‌లోని ఒక వయోవృద్ధుడు సంయమజీవనంతో 120 సంవత్సరాలు జీవించడం సాధ్యమేనని అంటాడు. పచ్చివి, తాజావి తినాలి. బయట గాలి పీల్చుకోవాలి, నోటిలో ఆహారాన్ని 32 సార్లు నవలాలని అంటాడు. బాగా ఆకలిగా ఉన్నప్పుడే ఆహారం తీసుకోవాలి.

కేవలం తినే ఆహారాన్ని పట్టించుకుంటే సరిపోదు. వీర్య రక్షణ చాలా అవసరం. క్షణిక సుఖం కొరకు జీవన తత్వమును కోల్పోవడం మరణాన్ని దగ్గరకు తెచ్చుకోవడమే. **బ్రహ్మచర్యము జీవనశక్తిని పెంపొందిస్తుంది. ఓజస్సును పెంచుతుంది,** ఆయు ప్రమాణాన్ని పెంచుతుంది. మహాత్మాగాంధీ 36 సంవత్సరముల వయస్సులో బ్రహ్మచర్యం యొక్క మహత్వాన్ని అర్థం చేసుకుని పాటించారు. 120 సంవత్సరాలు జీవిస్తానని ఆయన అనేవాడు. ఆయన ఒక్కరోజు కూడా రోగాల బారిన పడలేదు. ఆయన హత్యచేయబడకపోతే తప్పనిసరిగా 120 సంవత్సరాలు జీవించేవాడు.

ఈ విధముగా శారీరిక మానసిక సంతులనతో పాటు శ్రమచేయడం చాలా అవసరం. శ్రమచేయడం వలన శరీరం బిగువుగా రక్తం వేడిగా, జీర్ణశక్తి అద్భుతంగా ఉంటుంది. ఆఫీసులలో పనిచేసేవారి కన్నా పొలములలో పనిచేసేవారి ఆరోగ్యం బాగుంటుంది. పొలములలో చేసే శ్రమవలన స్వాభావికంగా ఆకలి, ప్రాకృతిక ఆహారం, స్వచ్ఛమైన గాలి లభిస్తుంది. అందువలన పొలములలో పనిచేసేవారు ఆరోగ్యంగా, బలంగా ఉంటారు.

క్రోధం, కోపం, ఉత్తేజన, చింత, నిరాశ, తొందరపాటు వలన రక్తంలోని జీవాణువులు మరణిస్తాయి, శరీరం నీరసించి పోతుంది. ఒక్కసారి క్రోధం వస్తే ఎనిమిది గంటలపాటు పనిచేయగలిగే శక్తిని కోల్పోతారని ఒక జర్మన్ డాక్టరు అంటారు. ఇంగ్లాండు యొక్క సుప్రసిద్ధ చికిత్సకుడు హార్డర్ చిత్తం ప్రసన్నంగా ఉంటే ఆరోగ్యం బాగుంటుందని అంటాడు. **మానసిక ప్రసన్నత దీర్ఘజీవనానికి తాళం చెవి.**

ఇక్కడ చెప్పబడుతున్న నియమములు అన్నీ సరళమైనవి. సర్వసులభమైనవి, తేలికగా పాటించవచ్చు, **సుఖమయమైన దీర్ఘజీవనానికి సాదా భోజనం, సంయమపూరకమైన ఆహారపు అలవాట్లు, అధికాధిక ప్రాకృతిక జీవనం వీటితోపాటు ఎండలో ఉండటం, తేలికైన వస్త్రాలు ధరించడం స్నానం చక్కగా చేయడం ఉపయోగకరము.**

**నేటి పొదుపు రేపటికి మదుపు**

వేదములలో మనుష్యుని సగటు ఆయువు 100 సంవత్సరాలుగా చెప్పబడింది. నిండా నూరేళ్ళు జీవించాలి. ప్రకృతి నియమానుసారం కూడా మనుష్యుని వయస్సు నూరు సంవత్సరముల పైమాటేగా భావించబడింది. ప్రకృతిలోని ఒక నియమం ఏమంటే ప్రాణి ప్రౌఢవయస్సు ఎంత ఉంటుందో దానికి ఐదురెట్లు ఆ ప్రాణి వయోపరిమాణంగా ఉంటుంది. గుర్రం ఐదు సంవత్సరాలలో యువావస్థకు చేరుకుంటుంది. అందువలన దాని జీవనపరిమాణం 25-30 మధ్యన ఉంటుంది. ఒంటె 8 సంవత్సరాలకు ప్రౌఢవయస్సుకు వచ్చి 40 సంవత్సరాలు వరకు, కుక్క 2 సంవత్సరాలలో వికసించి 10 సంవత్సరాల వరకు, ఏనుగు 50 సంవత్సరాలలో యవ్వనం వచ్చి 200 సంవత్సరాల వరకు జీవిస్తాయి. మనిషి సామాన్యంగా 25 సంవత్సరాలలో వయస్సుకు వస్తాడని 100-150 సంవత్సరాల వరకు అతని జీవన ప్రయాణంగా భావిస్తారు.

గోస్వామి తులసిదాస్ 100 సంవత్సరాల కన్నా ఎక్కువ కాలం జీవించాడు. మహాభారతకాలంలో శ్రీకృష్ణుని వయస్సు 127 సంవత్సరాలు, పితామహుడు భీష్ముని వయస్సు 200 సంవత్సరాల పై మాటే. ఆధునికకాలంలో కూడా వంద సంవత్సరాలు జీవించిన వారు ఉన్నారు. భారతదేశం యొక్క మహర్షి కర్వే, గొప్ప ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య శతాయువులే.

నార్వే దేశపు క్రిస్టియన్ డైకనవర్గ్ 186 సంవత్సరాలు జీవించాడు. 130 సంవత్సరాల వయస్సులో తన అంతిమ వివాహం చేసుకున్నాడు. అంతకుముందు 111 సంవత్సరాల వయస్సులో ఒక 60 సంవత్సరముల విధవను పెళ్ళి చేసుకున్నాడు. 100 సంవత్సరముల వరకు సిపాయిగా శత్రు దేశాలతో యుద్ధంలో పాల్గొన్నాడు. ఇటువంటి ఉదాహరణలు కోకొల్లలుగా చెప్పుకోవచ్చు.

వైజ్ఞానికుల రీసర్చిలో ప్రాణి చనిపోవడం తప్పనిసరికాదు. డా॥ అలెక్సిస్ కైరెల్ ఒక కోడి భ్రూణమును 36 సంవత్సరాలు ఒక పల్చని పోషక పదార్థములో సురక్షితంగా ఉంచాడు. ఇలా ఎంతకాలం అయినా సురక్షితంగా ఉంచవచ్చు అనే అభిప్రాయానికి వచ్చాడు. మనం ప్రాణుల జీవకోశములను నిరంతరం జీవింపచేసే ప్రయత్నం చేయాలి.

దీర్ఘజీవనం కొరకు శారీరిక, మానసిక, వ్యావహారిక జీవన క్రమం సంతులనంగా ఉంచుకోవడంతోపాటు విజాతీయ తత్వములను శరీరంలో ప్రవేశించకుండా చూసుకోవాలి. **తినకూడని పదార్థములను తినడం, త్రాగకూడని పదార్థములను త్రాగడం, అనుపయుక్త వాయుసేవనం (సిగరెట్లు వగైరా) చేసేవారు తమ గోరీలను తామే తవ్వుకుంటున్నామని తెలుసుకోవాలి.** తినకూడని పదార్థములు తింటున్నప్పుడు, శరీరం యొక్క జీర్ణవ్యవస్థకు దెబ్బ తగులుతుంది, దాని పనితీరు అస్తవ్యస్థ మవుతుంది. మందులు, ఇంజక్షనులు మొదలైనవి కూడా విజాతీయ ద్రవ్యముల క్రిందే వస్తాయి. ఉపయుక్తమైన, ఆవశ్యకమైన ఆహారం తీసుకున్నప్పుడు శుద్ధ స్వచ్ఛమైన వాతావరణంలో ఎక్కువ సమయం ఉన్నప్పుడు; శరీరంలోని మాలిన్యాలు మలంద్వారా బయటకు వెళ్ళే పనిపై ధ్యాస ఉంచినప్పుడు ఆరోగ్యం సంతులితంగా ఉంటుంది, దీర్ఘజీవనం లభిస్తుంది.

ప్రస్తుత వైజ్ఞానికయుగంలో మనిషి పరిగెత్తి, పరిగెత్తి తన సంతులన పోగొట్టుకుంటున్నాడు, రోగాలబారిన పడుతున్నాడు.

**అల్పాయువు, ముసలితనమును ఆపేందుకు కావలసినది సంతోషభరిత జీవనము.** మీరు చేసే పనులు మీ శక్త్యానుసారం, మీ వయస్సునుబట్టి ఉండాలి. దీర్ఘాయువు యొక్క మూలాధారం చింతలనుండి, దుఃఖముల నుండి విముక్తి, ఆడుతూ పాడుతూ ఉండే బాల్యం, బరువులులేని యవ్వనం అందుకే భారతీయ జీవన విశారదులు జీవనం యొక్క నాలుగవ భాగం అయిన మొదటి 25 సంవత్సరాలు ఋషుల ఆశ్రమంలో బ్రహ్మచర్య పూర్వకంగా జీవించే విధానాన్ని ఏర్పరచారు.

ఈనాడు సభ్యత, ప్రగతిపేరుతో స్వాభావికమైన క్రమమును, ప్రకృతి నియమాలను ఉల్లంఘించబడుతున్నదనే విషయం చాలా బాధాకరం. ఇలా ప్రకృతి నియమాలను పాటించకపోవడం వలన మనుష్యులు బాధలకు, కష్టాలకు గురవుతున్నారు. ఈనాడు డబ్బు సంపాదనే ధ్యేయంగా గుడ్డిగా పరుగులు పెడుతున్నారు, వేళాపాళాలేకుండా ఇష్టం వచ్చినట్లు తింటున్నారు. ఇలాచేయడం వలన ఆరోగ్యం గడబిడ అయి రోగాలు, అశాంతితో నరకం చవిచూస్తున్నారు, అల్పాయుగా తయారవుతున్నారు. అందువలన ఆరోగ్యం కొరకు, దీర్ఘజీవనం కొరకు మన పద్ధతులను మార్చుకోవసిన అవసరం ఎంతైనా ఉన్నది.

– *పూజ్య గురుదేవుల వాఙ్మయం 42 నుండి*

*అనువాదం: ముక్కామల రత్నాకర్*

**నేటి ప్రయోజనాల కొరకు రేపటి రోజును తాకట్టుపెట్టుట అవివేకం**

# ఫాస్టు ఫుడ్స్ నుండి దూరంగా ఉండండి

నేడు మన ఆహారం-పానీయాలు రుచి కలిగి ఉంటున్నాయి కానీ, పౌష్టికత లోపించి, శరీరం రోగనిరోధక శక్తి సామర్థ్యాన్ని కోల్పోయి, అనేక రకాలైన రోగాలు బహు సులభంగా మన శరీరంలో ప్రవేశిస్తున్నాయి! దీని నివారణకై మంచి పుష్టికరమైన ఆహారాన్ని తీసికొనవలసిన ఆవశ్యకత నేడు ఎంతగానో ఉంది! ఆకలి అందరికి వేస్తుంది, దీనిని తీర్చుకొనుటకై ఉచితమైన ఆహారాన్ని తీసికొననిచో, శరీరంలో అనారోగ్యం ప్రారంభమవుతుంది! నేడు స్వల్పవ్యవధిలో సిద్ధం చేసి అందించే (ఫాస్ట్‌ఫుడ్స్) ఆహారానికి అత్యంత ప్రచారంతో ఆదరణ లభించుటచే ప్రజలు దీనికి బానిసలుగా మారుతున్నారు. స్వల్పవ్యవధిలో సిద్ధం చేసికొనుటకు వీలయిన ఖాద్యపదార్థాలు బజారులో సులభంగా లభిస్తున్నాయి. కాని వీనిలో పౌష్టికశక్తి ఎంతెంత ఉన్నది తెలియజేసే విషయాలను ప్రజలకు అందుబాటులో ఉంచవలసిన ఆవశ్యకత ఎంతగానోఉంది.

రుచికర భోజనాన్ని అందరు ఇష్టపడుట వలన, స్వల్ప వ్యవధిలో భోజనాన్ని తయారు చేసి ఇచ్చే భోజనశాలలు (ఫాస్ట్‌ఫుడ్ సెంటర్సు) అతి శీఘ్రంగా వ్యాప్తిజెందుచున్నాయి! భారతదేశంలో మారుమూల ప్రాంతాలలోకూడా దుకాణాలందు న్యూడుల్స్, వేయించిన చిప్స్, బర్గర్, పిజ్జా మున్నగునవి విరివిగా లభిస్తున్నాయి. వీనిలోని రుచిని ఆస్వాదిస్తూ ప్రజలు ఇష్టపడుతూ ఈ ఆహారాన్ని సేవిస్తున్నారు. ఈ ఫాస్ట్‌ఫుడ్ పైకి ఎంతో ఇంపుగా రుచిగా ఉన్నప్పటికి ఆరోగ్యాన్ని సంరక్షించుటలో అత్యంత హీనస్థాయిలో ఉండి హాని కలిగిస్తుంది. ఈ ఆహార సేవన ప్రభావం వెంటనే శరీరంపై కన్పించదు కాని క్రమంగా తీవ్ర అనారోగ్యాలకు మూలకారణమవుతుంది!

మనదేశంలో పిల్లలు మొదలుకొని పెద్దల వరకు అందరు చిప్స్‌ను తినుటకు చాలా ఇష్టపడతారు! దీనికై అనేక రీతులలో ప్రచారం చేస్తున్నారు. అనేక కంపెనీలు వివిధ పేర్లతో వీనిని బజారులో అమ్ముచున్నాయి. ప్రజలు కూడా వీనిని చాలా ఇష్టంగా, అధిక ధర చెల్లించి ఖరీదు చేయుచున్నారు. దీని సేవనంతో కొవ్వు మరియు కేలరీలు పెరిగి శరీరం బరువెక్కి లావు అవుతారు. ఒక బాలుడు ప్రతిదినము నాలుగు సంవత్సరాల పాటు ఈ చిప్స్‌ను విడువకుండా తిన్నచో అతని బరువు సాధారణ బాలునికన్నా $2\text{-}2^1/_2$ కిలోలు అధికంగా పెరుగుతుంది. ఇట్టి స్థితిలో అతడు బరువు పెరుగుటతో పాటుగా, అతనికి మధుమేహం, హృదయరోగం వచ్చే అవకాశాలు చాలామెండుగా ఉంటాయి అని పరిశీలనలో తేలింది.

అడుగంటిన బాగా వేయించిన ఆహారము మన శరీరాన్ని మరియు మస్తిష్కాన్ని అనేక విధాలుగా ప్రభావితం చేస్తాయి అని పరిశోధకులు తేల్చి చెప్పుట జరిగింది. ఈ వేపుడు పదార్థాలు తినేవారి శరీరాలు లోపల శక్తిని కోల్పోయి బలహీనపడతాయి! అట్లే జీర్ణవ్యవస్థ కూడా దెబ్బతిని తీవ్ర అనారోగ్యాలకు దారితీస్తుంది! మనలోని మూత్రపిండాలలో, కాలేయంలో, ప్రేవులలో కొవ్వు చేరి అనారోగ్యానికి గురిచేస్తుంది. ఇట్టి ఆహారము మన శరీరంలో కొలెస్ట్రాల్‌ను కూడా పెంచుతుంది. రక్తప్రవాహానికి అడ్డుగా నిలచి గుండెపోటుకు దారితీస్తుంది!

కావున బంగాళాదుంపల చిప్స్‌ను నిత్యం తినుట తమ భోజనంలో భాగంగా ఎంచుకొన్నవారు తగు మాత్రం జాగరూకులై ఉండుట శ్రేయస్కరం. చిప్స్‌లో సరియైన పాళ్ళలో విటమిన్లు మరియు మినరల్స్ తగుమాత్రంగా లేవు. అందువలన ఇది పౌష్టికాహారము కానేరదు. పొట్ట నింపుతుంది కానీ, శరీరానికి కావలసిన మేరకు శక్తినివ్వదు.

30 గ్రాముల బంగాళాదుంప చిప్స్‌లో సుమారుగా 120 నుండి 180 మిల్లీగ్రాముల సోడియం ఉంటుంది. ఈ సోడియం గుణం, శరీరంలోని నీటిశాతాన్ని తగ్గిస్తుంది. దీనితో రక్తపోటు పెరిగి గుండె మున్నగు రక్తప్రవాహ సంబంధిత అంగాలు ప్రభావితమవుతాయి. దీనివలన గుండెపోటు, గుండె ఆగిపోయే ప్రమాదం, రక్తనాళముల సంకోచ, వ్యాకోచ ప్రభావం చేత గుండె జబ్బులు, మూత్రపిండాలకు చెందిన వ్యాధులు వచ్చే అవకాశం ఏర్పడుతుంది. చిప్స్ నూనెలో వేయించుట చేత, స్వల్పమాత్రంగా శాచ్యురేటెడ్ క్రొవ్వు ఉండుటచేత, శరీరంలో చెడు కొలెస్ట్రాల్‌ను పెంచి అనేక వ్యాధులకు కారణమవుతుంది.

**కేవలం విజయాల నుంచే పైకి రాలేము - అపజయాల నుంచి కూడా ఎదగడం నేర్చుకోవాలి**

శరీరంలోని ధమనులు ముడుచుకు పోతాయి. దీనిని హృదయరోగంగా గుర్తించవచ్చును. దీనికి కారణం రక్తంలో కొలెస్ట్రాల్ గుర్తింపదగిన స్థాయిలో పెరుగుటయే. దీనికి కారణం మనము తినే నూనెలో గల ఫ్యాటీయాసిడ్. దీనివలన రక్తములోనికి ప్రాణవాయువు చేరకపోవుటచే తగిన పోషణ లభించదు. దీని ప్రభావంతో ఇతర అంగాల అవయవాలు వ్యాధులు పాలగుట జరుగుతుంది.

మధుమేహం లేక డయాబెటిస్ అనేది ఒక పెద్దజబ్బు. దీనికి ప్రధాన కారణం శరీరం లావెక్కుట, పాంక్రియాస్ గ్రంధి కావలసినంత చక్కెరను శరీరంలోని కోశికలకు అందించలేక పోవుట. దీనికి కారణం ఇన్సులిన్ తగినంత ఉత్పాదన జరుగక పోవుట. దీనివలన రోగి చక్కెరను గాని పిండి పదార్థాన్ని కాని ఆహారం ద్వారా స్వీకరించలేడు. అట్లే నూనెతో కూడిన పదార్థాల వాడకంలో కూడా నియంత్రణ కావలసి ఉంది.

నేడు పిల్లలు మొదలు పెద్దల వరకు నూడుల్స్ లేక పాస్తా తినుటకు బానిసలయ్యారు. దీనితో వీరి ఆరోగ్యము మరింతగా దిగజారుట జరుగుచున్నది. నూడుల్స్ మరియు పాస్తా సహజ సిద్ధ ఆహారము కాదు. ఇది తయారు చేయబడినది. దీనిలో పిండి పదార్థము ఎక్కువగా ఉంటుంది. దీనిలో పోషకాలు, పీచు పదార్థం, విటమిన్లు, మినరల్సు చాలా తక్కువగా ఉంటాయి. నూడుల్స్ జిగురు కలిగిన మైదాన్ని కలిగి ఉంటాయి. దీనితో ఆరోగ్యానికి మిగుల హానికారకమవుతుంది. పైవాటికి తోడు దీనిలో ప్రోపలిన్ గ్లయికాల్ కూడా ఉంది. ఈ పదార్థము గుండె, కాలేయం, హృదయాలపై తన చెడు ప్రభావాన్ని చూపుతుంది. దీనిలో ఉన్న ఇతర రసాయనములు మన శరీరంలోని రోగనిరోధక శక్తిపై తన ప్రభావాన్ని చూపుతాయి. దీనితో శరీరము రక్తపోటు, గుండెపోటు మున్నగువానికి దారి తీస్తుంది. వీనిని గుర్తించి ప్రజలు తమ ఆరోగ్యం మరింత నష్టపోకుండా ఉండుటకై ఉత్తరాఖండ్ ప్రభుత్వం నూడుల్స్ అమ్మకాలను నిషేధించింది. ఏలనన ఒక శాంపుల్ నూడుల్స్‌ను రసాయనిక పరీక్షలు చేయగా దానిలో సీసము మరియు మోనోసోడియం గ్లూటామెట్ పరిమితి మోతాదుకు మించి ఉన్నట్లు కనుగొనటమైనది.

వేపుడు పదార్థాలు ఏమైనా సరే శరీరం లావెక్కుటకు కారణమవుతాయి. లావెక్కుట అనగానే నూనెలు, వేపుడు పదార్థాల సేవనంతో కొవ్వుశాతం పెరిగి పిండి పదార్థాల సేవనంతో మరింతగా హెచ్చుతుంది!

అట్లే కొంతమేరకు కొవ్వు రక్తనాళాలలో ప్రవేశించి రక్త ప్రవాహానికి హాని కల్గిస్తుంది. దీనివలన గుండె పోటుకు దారి తీయుట మరియు మానసిక రోగాలకు దారితీయుట జరుగు తుంది. దీనికి తోడు వేపుడు ఆహార పదార్థాల టాక్సిక్ సాల్ట్ ఆరోగ్యానికి చెడు చేస్తుంది. చెడు కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది.

పై వానినన్నింటిని గమనించినచో ఫాస్ట్‌ఫుడ్ సేవించుట హానికరమని రుజువగుచున్నది. కావున రుచికొరకై భోజనం చేయుట మాని ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని పౌష్టిక ఆహారాన్ని తీసికొనుట ఉత్తమము. ఇట్టి భోజనమందు అన్ని రకాలైన మొలకలు, పండ్లు, తాజా కూరగాయలు సలాడ్స్, ఎండిన పండ్లు (డ్రై ఫ్రూట్స్) మున్నగువానిని చేర్చి సేవించిన అత్యంత లాభదాయకం మరియు ఆరోగ్యదాయకం.

*– అఖండజ్యోతి, సెప్టెంబర్ 2015*

*అనువాదం: ఎ. వేణుగోపాలరెడ్డి*

## ప్రతి నిత్యం శాంతికుంజ్‌ని దర్శించండి

*ప్రాతఃకాలమున కళ్ళు తెరుస్తూనే ఈ మానసిక ధ్యాన ధారణలు చక్కగా చేసుకోవచ్చు. మీరు ఉన్న చోటు నుంచే ధ్యానంలోనే (మానసికంగా) హరిద్వార్ వెళ్ళండి. గంగలో స్నానం చేసి, శాంతికుంజ్‌లో ప్రవేశించండి. ప్రఖర ప్రజ్ఞ, సజల శ్రద్ధలకు, గాయత్రీ మందిరానికి, యజ్ఞశాలకు ప్రదక్షిణ చేయండి. అఖండజ్యోతి దగ్గరకు వెళ్ళండి. అక్కడ కూర్చుని కనీసం పదిసార్లు గాయత్రీ మంత్ర జపం చేయండి. తరువాత మాతాజీ నుండి భక్తి, గురుదేవుల నుండి శక్తిని అనుదానంగా పొంది మీ స్థలానికి తిరిగి రండి. ఈ ప్రక్రియకు సుమారు ఐదు నిమిషాలు పడుతుంది. జరుగుతున్న మహా పురశ్చరణలో ఒక చిన్న భాగస్వామి కావచ్చు. ఎవరి దగ్గర సమయం ఉన్నదో వారు ఉదయిస్తున్న సూర్యుని ధ్యానం చేస్తూ గాయత్రీ మంత్రం వీలయినంత వరకు చెయ్యండి.*

*అనువాదం : ముక్కామల రత్నాకర్*

**ఒక సమస్యను ఎదుర్కొనే సమయంలో మనలోని ప్రతిభ వెలికివస్తుంది**

బోధ కథ

# మూడవ ముద్రణ

ఒక బౌద్ధభిక్షువు దిగులుగా కూర్చుని ఉన్నాడు! దగ్గరలో కూర్చొని ఉన్న వారిలో నుండి ఒక వ్యక్తి ఇలా అన్నాడు – "భగవాన్! తమరు ఎందుకు దిగులుగా ఉన్నారు?"

"నేను భారతదేశంలో భగవాన్ తధాగతుని యొక్క కొన్ని దుర్లభమైన ఉపదేశాలను పాళీభాషలో వ్రాసిన వాటిని సంపాదించాను" అవి పోయాయా? అని అడిగిన వ్యక్తి కొంత విచారాన్ని ప్రకటించాడు! "లేదు. అవి నా వద్దనే ఉన్నాయి! నేను వాటన్నిటినీ ఇచ్చటి జపానీ భాషలో అనువదించాను. కూడా!" ఇదెంతో సంతోషించే విషయమే కదా... మరి విచారం దేనికి..?" "చింత ఎందుకంటే వాటిని ముద్రించాలంటే ధనం కావాలి కదా... ధనం లేక ముద్రణ ఆగినందుకే... ఈ చింత!" ఈ పని జరగటానికి ఇక్కడున్న కొంతమంది ధనవంతులను ఆశ్రయిస్తే; సహజంగానే పనిజరిగి పోతుంది కదా...! "అలా యాచించుటకు నాకు మనస్కరించుట లేదు"! "మరైతే తమరే ఏదో ఒక మార్గం చూపండి! "మనమందరం ధనం కొరకు కూలీపని ఎందుకు చేయకూడదు? కూలీగానా... అందులోను బౌద్ధమతాన్ని ప్రచారం చేయుటకొచ్చిన భిక్షులతోనా! ఇదెలా సంభవం? అందరు ఆశ్చర్యంతో ఉండిపోయారు!

సాధన కూడా కార్యానికి సరిపోయే మాదిరిగానే ఉండవలసి ఉంటుంది? శ్రామికుల మధ్యలో తమ ప్రామాణికతను నిరూపించుకొనేందుకు ఇంతకుమించి మరోమార్గం లేదు. స్వయంగా శ్రమచేయకుండా ప్రజాసేవ చేయటం సంభవం కాదు... ముందు తాముపని చేయాలి. అది మిగిలిన వారికి ప్రేరణకావాలి... అందుకని భిక్షువులంతా కూలీపని చేయుట ప్రారంభించారు! చూసే ప్రజలకు ఈ భిక్షువులు ఇలా పనిచేయు అవసరమేమివచ్చిందని అనుకోసాగారు! అలా వచ్చిన వారికి భిక్షువులు బుద్ధదేవుని ఉపదేశాలను వినిపించుటతో ప్రేరణ చెంది, స్ఫూర్తితో వీరితో కలసి చేతులు కలిపి సహాయం అందించుట ప్రారంభించారు!

ఈ విధంగా అందరు కలసి ధనసంపాదన కొరకు శ్రమ చేయు సమయంలోనే; జపానులోని ఒక ప్రాంతంలో కరువు వచ్చింది? అది విన్న మహాభిక్షు హృదయం క్షోభించింది! వారు పీడితుల కళ్ళలోని సేవాదాహం చూసారు! కూడబెట్టి ధనాన్ని, కరువుప్రాంత పీడితుల సహాయార్థం వినియోగించుట నిశ్చయించాడు!

శిష్యులంతా వ్యతిరేకిస్తూ ఇంతగా శ్రమించి సంపాదించిన ధనాన్ని పీడితప్రజలకు పంచటానికా" అంటూ తమ అసమ్మతిని తెలుపసాగారు! ఈవిధంగా విరోధిస్తున్న శిష్యులను శాంతపరచి భిక్షువు ఇలా చెప్పాడు. మిమ్ము మీరు మరువకండి! మన ఈ ధనపు విభూతి అనేది ఒకేదానికి ప్రతీక. అదే మనలోని అంతరాత్మ యొక్క సంవేదనలు! ఇవి ఎప్పటివరకు మనలో ఉంటాయో; మనమెన్నటికీ దరిద్రులు కాజాలము! ఇవి కనుక లేకపోతే మనమంతా ప్రాణంపోయిన వారమవగలం... మన ఉద్దేశ్యం ప్రజాసేవ తప్ప ధనమార్జించుటకాదు...! మరి పుస్తక ప్రచురణ... ఎలా?" జనం జీవించి ఉన్న యెడల; పుస్తకం కూడా ప్రచురించబడగలదు! ఆకలిగొన్నవారికి ఆహారమివ్వటం; వస్త్రాలు లేని వారికి వస్త్రాలు పంచుటలో కూడబెట్టిన ధనమంతా చెల్లిపోయింది!

రెండవ సంవత్సరం తిరిగి మంచి వర్షాలు కురిసాయి! ఆ ప్రాంతంలో కరువుకాటకాలు తొలగిపోయాయి! ఈసారి అనుకొన్న సమయాని కన్నా తక్కువ సమయంలోనే అధికంగా ధనం సంగ్రహించబడింది? భిక్షువులంతా సంతోషించారు! వారి సంతోషం ధనం కూడబెట్టినందుకు కాదు; వారిలోని ప్రామాణిక శక్తి మహత్యం గురించి బాగా తెలిసివచ్చిన కారణంగా వారికి ఎంతో ఆనందం కలిగింది! ఇక ఇప్పుడింకా ఇనుమడించిన ఉత్సాహంతో పనిచేయటానికి అనుభవం చేకూరింది వారిలో...!

కానీ ఈసారి వేరొక క్షేత్రంలో అతివృష్టి కారణంగా విపరీతమైన వరదలు వచ్చి మొత్తం ఆ ప్రాంతంలోని పండిన పంటంతా కొట్టుకుపోయింది! ఈసారి కూడా మహాభిక్షువు తాము కూడబెట్టిన ధనరాశిని పీడితుల సహాయార్థం ఇచ్చి వేయటం జరిగింది.

ఈసారి కూడా ఇలా జరగటంతో కొంతమంది భిక్షువు శిష్యులు నిరుత్సాహపడగా; మహాభిక్షువు తిరిగి వారినందరిని

**మీ అపజయాలను తప్పటడుగులనుకోకండి - భవిష్యత్తులో ఏమి చెయ్యకూడదో తెలిపే పాఠాలవి**

ఉత్సాహపరచి; ధనార్జన ప్రారంభించి చాలా కొద్దికాలంలోనే అనుకున్నంత ధనాన్ని సంపాదించగలిగారు! అదృష్టం కొద్దీ ఈసారి ఏవిధమైన ప్రకృతి ప్రకోపాలు లేనికారణంగా పుస్తక ప్రచురణ నిర్విఘ్నంగా జరిగిపోయినందున భిక్షువులంతా ఆనందించారు!

జపానీభాషలో అనువదించిన ఈ పుస్తకాన్ని ఎందరో చదివి, వారంతా మహాభిక్షువుని ఎంతో ప్రశంసించారు! ఆ పుస్తకం మొదటి పేజీమీద ఇది మూడవ ప్రచురణ అని వ్రాయటం జరిగింది...! చదివినవారంతా ఇది మొదటిసారిగా ప్రచురణ జరిగింది కదా అటువంటిప్పుడు ఇది మూడవ ప్రచురణ అని వ్రాసారు కదా మరి మిగిలిన రెండు ప్రచురణలు ఎప్పుడు; ఎక్కడ ప్రచురించబడ్డాయి అని అడిగారు? అందుకు జవాబునిస్తూ మహాభిక్షువు వారితో ముందు రెండు ప్రచురణలు మీరు ముందే చూచుట జరిగింది అవి ఎవరి వద్ద "సేవ" "సంవేదన" అనే రెండు కళ్ళు ఉన్నాయో అవే రెండు ప్రచురణలు అని మహాభిక్షువు అయిన "భోగ్గాలీ పుత్తస" జవాబిచ్చాడు. ఆయన తన జీవితంలో ఈ రెండు కళ్ళతోనే చూస్తూ; చివరివరకు ఎంతో సక్రియత కలిగి ఉండేవాడు...

*– అఖండజ్యోతి, ఫిబ్రవరి 1990*

*అనువాదం: జి. చెన్నకేశవరావు*

## ఇతరుల దోషాలను చూడకండి

*"ఇతరుల దోషాలను చూసేముందు, ఎవరైనా చెడ్డవాడని చెప్పేముందు నీలో ఏదైనా చెడు ఉందేమోచూడు. ముందుదానిని తొలగించుకో ఇతరులను నిందించడానికి బదులు ఆసమయాన్ని నీ ఉద్ధరణకు వినియోగించు. పరనిందను త్యజించి, పరమానంద ప్రాప్తివైపు పురోగమిస్తున్నానని నీవే అంగీకరిస్తావు.*

*ప్రపంచాన్ని జయించాలనే కోరిక గలిగిన మానవులరా! మొదట మిమ్మల్ని మీరు జయించుకోవడానికి ప్రయత్నించండి. అప్పుడే విశ్వవిజేతలం కావాలన్న మీ స్వప్నం ఏదో ఒక రోజు ఫలిస్తుంది. ప్రపంచంలోని ప్రాణులన్నింటినీ మీ జితేంద్రియత్వం ద్వారా, మీ సైగతో నడిపించగలుగుతారు. ప్రపంచంలోని ఏజీవీ మీకు విరోధిగా ఉండజాలదు." అని పరమపూజ్య గురుదేవులు "ధైర్యం విడువకండి" అనే పుస్తకంలో మొట్టమొదటి పేజీలో వ్రాశారు. పైగా దానిని ప్రతివ్యక్తి, ప్రతి రోజూ చదవాలి అన్నారు. దానిని బట్టి ఈ శీర్షికను చక్కగా అర్థం చేసుకోవచ్చు.*

*ఇతరుల దోషాలను ఎంచటం చాలా చెడ్డ అలవాటు. భార్యలో దోషాలు చూస్తున్నంత కాలం గృహస్థ జీవనం శాంతమయంగా, సుఖంగా ఉండదు. ఇతరులను తప్పు పట్టే వాళ్ళకి ఎదుట ఉన్న వ్యక్తిలో తప్పులే కనిపిస్తాయి. వారిలో ఉన్న మంచి గుణాలు కనిపించవు. ఇతరుల దోషాలను చూడటం ఒక మానసిక రోగం. దీనిని వదిలించుకోవాలి.*

*పార్వతీదేవికి ఇద్దరు పుత్రులున్నారు. ఒకరికి ఆరు ముఖములు 12 చేతులు, ఇంకొకరికి ఏనుగు తొండం లాంటి ముక్కు, చిన్నవాడు పెద్దవాడి ముక్కును తడుముతుంటే, పెద్దవాడు చిన్నవాడి కన్నులను లెక్కబెడుతున్నాడు. 1,2,3,4,5,6,7,8,9, 10,11,12. అంతే పోట్లాట మొదలయింది. పార్వతీదేవి పిల్లలు పోట్లాడుకోవటంతో బాధపడుతుంది. ఒక రోజు తండ్రి అయిన పరమేశ్వరుని దగ్గరకు తీసుకువెళ్ళింది. "వీరిద్దరు రోజంతా కొట్టుకుంటూనే ఉంటున్నారు. వీరిద్దకీ అర్థం అయ్యేటట్లు చెప్పండి" అని అన్నది. జ్ఞానవంతుడైన ఆయన వీరు పోట్లాడుకునే కారణం తెలుసుకుని వారిరువురిని ప్రేమతో ఒడిలో కూర్చోబెట్టుకున్నాడు. ఇతరుల లోపాలు చూడడం తప్పని అర్థం అయ్యేటట్లు వివరించాడు. అప్పటినుండి వారు ఇద్దరు కొట్టుకోవడం ఆపేశారు.*

*కష్టాలలో ఉన్నప్పుడు భగవంతుడా! నా అపరాధాలను క్షమించు. నా తప్పులను చూడకు. అని ప్రార్థిస్తుంటారు. ఇలాంటి కోరికలు కోరేవారు ముందుగా ఇతరుల తప్పులు క్షమించవలసి ఉంటుంది. అప్పుడే మన తప్పులు క్షమింపబడటానికి ఆస్కారముంటుంది. బైబిల్ లో ఇలా ఉన్నది "ఇతరులు నీ తప్పులు పట్టకూడదనుకుంటే నీవు ఇతరుల తప్పులు పట్టకు".*

*మనం అనేక మంది మీద, వీడు ఇలా ఉన్నాడని, వాడు అలా ఉన్నాడని కంప్లేంట్ చేస్తుంటాము. కానీ మనం రెండో ప్రక్క చూడం. అతని వల్ల కష్టాలు వచ్చాయని నిందిస్తాం. చేసిన మేలు గుర్తుండదు. పొగడటం అసలే ఉండదు. కృతజ్ఞత కనిపించదు.*

*మనం ముందుగా ఇతరుల దోషాలను పట్టడం అనే దోషం నుంచి ముక్తి పొందాలి. మంచి గుణాల గురించి ఆలోచించాలి. పెంపొందించుకోవాలి. సద్బుద్ధిని ఇవ్వాలని భగవంతుని ప్రార్థించాలి.*

**కలలు కనటం తప్పుకాదు వానిని సాకారం చేసికొనే ప్రయత్నం చేయకపోవుట తప్పు**

# మనిషి ప్రేతముల నడుమ గల మధ్యవర్తిత్వ శృంఖల

ప్రేతతత్త్వమును గురించి అన్వేషించేవారిలో ఎక్కువమంది చెప్పేది ఏమిటంటే 'శరీరమును వదిలేసిన పిమ్మట ప్రేతాత్మలు సాధారణముగా తమ యొక్క అదృశ్యలోకములలో నివసిస్తుంటాయి' అని. ప్రేతములకు తమదైన ఒక స్వీయ-ప్రపంచమున్నది. సుదీర్ఘ జీవితములో నిరంతరము శ్రమించిన కారణముగా జీవాత్మయొక్క మౌలికశక్తిలోని ఒక పెద్ద అంశము క్షీణించిపోతుంది, నీరసించిపోతుంది. జీవాత్మ ఆ అలసటను, శ్రమను పోగొట్టుకోవటానికి మరియు నూతన స్ఫూర్తిని పొందుటకు విశ్రాంతి తీసుకుంటుంది.

ఈమధ్యకాలములో జీవాత్మకు తను చేసిన మంచి-చెడు కర్మలకు తగిన ప్రతిక్రియలు అనుభవములోకి వస్తాయి. పాంచభౌతికశరీరము నశించిపోయినప్పటికీ సంవేదనా శక్తి గల సూక్ష్మశరీరము నిలిచే ఉంటుంది. అందులో మెదడులోని విశేషతలు సజీవముగా ఉంటాయి. చేతన మరియు అచేతన మనస్సుల యొక్క వివిధ విధులు, క్రియలు-ప్రతిక్రియల చేత సామాన్యజనులకు జాగృదావస్థలో మంచి-చెడులు అనుభవ మవుతుంటాయి, అంతేకాక నిద్రలో కలలను చూస్తుంటారు. అదేవిధముగా మరణించినవానికి తన అనుభవములు మరియు అభ్యాసముల ప్రతిక్రియలు మరణించిన తరువాత లభించే విశ్రాంతికాలములో అనుభవములోకి వస్తాయి. వీటినే స్వర్గ-నరకములు అంటారు.

సత్కర్మలచేత ఆత్మసంతోషము, దుష్కర్మలద్వారా ఆత్మగ్లాని అనుభవమౌతుంది. అదేవిధముగా జీవితముమీద ఆవరించు కుని ఉన్న ఆలోచనలు, క్రియల ఫలస్వరూపము, చేతనత్వం మీద ప్రోదిచెందిన సంస్కారములు ఆ సమయములో బయటకు పెల్లుబికి వస్తాయి. అప్పుడు జీవి మంచి-చెడుల ఫలితమును అనుభవిస్తాడు. ఇటువంటి స్వప్నములు నవజాత శిశువులకు వస్తుంటాయి. వారు అర్ధనిద్రావస్థలో పలుమార్లు నవ్వుతూ, చిరునవ్వులు చిందిస్తుంటారు. ఇంకొన్నిసార్లు ఖిన్నులవ్వటము, భయపడటము, ఏడుస్తుండటము వంటి భావములను ముఖాకృతిని మార్చుడము ద్వారా ప్రదర్శిస్తుండటాన్ని మనము చూస్తూనే ఉంటాము. అవన్నీ పూర్తిగా వారి సంచిత స్మృతుల మీద ఆధారపడి ఉంటాయి. మరణించినవారు ప్రేతలోకములో ఒకరకముగా చెప్పాలంటే నవజాతశిశువుల వంటి స్థితిలో ఉండవలసి వస్తుంది. ఈ కాలావధిలో అచేతనత్వమునకు తన సంచిత అనుభూతులను ప్రకటీకరణ చేసే అవకాశము లభిస్తుంది. సంఘటనలు జరుగకపోయినప్పటికీ మనిషి యొక్క నిజమైన భావనలు, అభిప్రాయములు అవకాశము చూసుకొని సంవేదనలుగా మారుతాయి, అంతేకాకుండా తమకు తగ్గ స్థాయి రూపమును నిర్మించుకొని ప్రకటీకృతమవుతాయి. భ్రాంతులు తక్షణమే మరియు అభిప్రాయములు పలుమార్లు వాస్తవికతకు భిన్నమైన ఆలోచనలు (చింతన) మస్తిష్కమును ఏ రీతిలో చుట్టుముడతాయి అంటే వ్యక్తిగత అభిప్రాయములే నిజమైనవిగా గోచరింపజేస్తాయి.

స్వర్గ-నరకములు స్వీయనిర్మితములే! ప్రేతలోక వాతావరణము శాంతిమయమైనదే. ఇలా ఉన్నప్పటికీ ప్రతి ప్రేతాత్మకు తన నిజ మానసికస్థితి చేత ఉత్పన్నమైన ప్రతిక్రియ లను తమ తమ రీతులలో అనుభవించవలసి వస్తుంది. అధర్మ పరులు నరకమును, ధర్మాత్ములు స్వర్గమును ఏవిధంగా అనుభూతి చెందుతారు అన్నదాని వివరణ కథలు, పురాణములులో విస్తృతముగా లభిస్తాయి.

విశ్రాంతస్థితి మరియు అనుభూతుల మధ్యనుండి సాగి పోయే పరలోక కాలావధి ద్వారా పలుమారులు ప్రేతాత్మలు మనుష్యులతోపాటు సంపర్కం ఏర్పరచుకొని, అనేకరకములైన సంఘటనలను జరిగేటట్లు చేయుట మనము చూస్తూనే ఉంటాము. సృష్టివ్యవస్థకు భిన్నమైన ఈ పద్ధతి అస్వాభావిక మైనది. ఈ ప్రపంచము నుండి వెళ్ళిపోయిన పిమ్మట మరోలోక పరిస్థితులలోనే నివసించుట తగిన పని. నూతనజన్మలో ప్రాణులు గతజన్మల స్మృతులు, సంఘటనలు, సంబంధము లను మరచిపోతారు. నూతన సంపర్కములకు అనురూపముగా తమను తాము మలచుకుంటారు. పరలోకవాసులు సైతము ఇలానే చేస్తారు. వారు గతకాలపు సంబంధములను, సంబంధీకు లను విస్మరిస్తారు. ఏ పరిస్థితులలో వారు జీవితమును గడుప వలసి వచ్చిందో ఆ స్థితిలో కూడా అన్యమనస్కముగానే జీవిస్తారు. అటువంటి మానసికస్థితిలోనే విశ్రాంతి లభిస్తుంది. లేకపోతే కనుక పాతకాలపు సంబంధబాంధవ్యములు మరియు స్మృతులే

**ప్రకృతికి అనుగుణంగా జీవిస్తే రోగాలు దరిజేరవు**

అశాంతికి కారణమవుతాయి. అంతేకాక అలజడిని, అలసటను దూరము చేసుకునేబదులు నూతనవిధానములు శోకజనిత ఉద్వేగాలను తట్టిలేపుతాయి.

జీవించి ఉన్న-మరణించినవారి మధ్యగల ప్రత్యక్ష సంబంధమునకు చెందిన సంఘటనలు జరుగుతూనే ఉంటాయి. దీనికి కారణమేమిటి? తన స్వంత అన్వేషణలు, అనుభూతుల ఆధారముగా దీనికి మైస్యర్ ప్రత్యుత్తరమిచ్చాడు. మరణించిన తరువాత మృతకునికి ఏదో ఒక అతి తీవ్రమైన అంతిమ కోరిక ఉంటుంది. సూక్ష్మశరీర మాధ్యమముగా ఆ ఆత్మ దానిని తీర్చుకునే ప్రయత్నము చేస్తుంది. ఆ ప్రయత్నములో భాగముగా ఆ ఆత్మ సూక్ష్మశరీరము ఎవరో ఒక జీవించి ఉన్న వ్యక్తి శరీరముతో సంపర్కము ఏర్పరచుకొనవలసి ఉంటుంది. అయితే ఆ వ్యక్తి ఈ ఆత్మయొక్క ఆకాంక్షను పూర్తి చేసేందుకు యోగ్యుడైనప్పుడే ఇలా చేస్తుంది.

ప్రేతాత్మకు సూక్ష్మశరీరమును ఎలా నిర్మించబడుతుంది? దీనిని గురించి మైస్యర్ ఇలా అంటాడు. 'మానవ శరీరము నుండి ఒక రకమైన విశిష్టతత్త్వము నిరంతరము ప్రవహిస్తుంటుంది. దాన్ని ఎక్టోప్లాజ్మ అంటారు. ఇది కేవలము శరీరమునుండి వెలువడటము కాదు, సమస్త బ్రహ్మాండములో కూడా నిండి ఉంటుంది. ఈ పదార్థము సంపూర్ణముగా సూక్ష్మమైనది. సర్వదా అదృశ్యముగానే ఉంటుంది. అయినా కూడా దాని ప్రతిక్రియలమీద ఆధారపడి దాని అస్తిత్వ ప్రమాణము ఉందన్న ఆధారములను పొందగలము.

'ఇదేమీ ప్రకాశఛాయ కాదు. పైగా ఇదొక జీవనశక్తి. ఇది తను ప్రకటితమగుటకు ఎవరో ఒక సహయోగిని అన్వేషిస్తుంది. అనుకూలత గలవాడు అని నిరూపించబడినప్పుడు అతనిని వాహనముగా చేసుకుని తాను కోరుకున్న పనులను పూర్తిచేసుకుంటుంది. ఆత్మలు ప్రతి ఒక్కరితోను సంపర్కమును ఏర్పరచుకొనలేవు. పైగా ఎవరినైనా భయపెట్టుటలోను, వశపరచుకోవటములోను ఎల్లవేళలా సఫలతను పొందవు అని అంటాడు. సంపర్క మాధ్యమము యొక్క ఎక్టోప్లాజ్మ అనేది ఆ మృతాత్మకు తగినస్థాయిలో ఉండాలి. సూక్ష్మశరీర అస్తిత్వము సంపూర్ణమైనదే అయినప్పటికీ దానికి భౌతికజీవితములో కొన్ని పనులను చేయుటకొరకు ఎవరో ఒక అనుకూల సహయోగి యొక్క సహాయము అవసరమౌతుంది. తాను అనుకన్న ప్రయోజనమును పూర్తిచేయుటకొరకు తగినవాడు అని ప్రేతాత్మ అనుకున్నప్పుడే అతని సహాయము తీసుకుంటుంది. అతనితో సంపర్కం ఏర్పరచుకుంటుంది. తాను అనుకున్న స్థాయిలో అలజడులను రేకెత్తిస్తుంది.

జీవించి ఉన్నవారు-మరణించినవారి నడుమ మధ్య వర్తిత్వము నెరపగల పరంపరను గురించి పరిశోధిస్తున్న శాస్త్రవేత్త విలియమ్-ఆత్మలు 'ప్రేతాత్మలు-పితరులు' అని రెండు రకాలుగా ఉంటాయి. ప్రేతములు ఉద్విగ్నముగా ఉంటూ కీడును తలపెడుతుంటాయి. పితరులు సద్భావ-సంపన్నులు, సేవా-సహాయములను అందించటానికి సంపర్కం ఏర్పరచు కుంటారు. ప్రేతాత్మతో సంసర్గమనేది హానిని కలిగిస్తుంది, భయపెడుతుంది.

ప్రేతములు ఎవరిమీదపడితే వారిమీద, ఎప్పుడుపడితే అప్పుడు దాడి చేస్తాయి. మనిషి తనకు ఎదురయ్యే ఏ కష్టము నైనా సహించవలసివస్తే దానికి ప్రేతాత్మలే ముఖ్యకారణము అనే మూఢనమ్మకము ఇప్పుడు మెల్లమెల్లగా సమసిపోతున్నది. ఎక్కువమంది ప్రజలు భూతభయాలనుండి విముక్తిని పొందారు. ఈ రీతిలోనే చేతన అంటే కేవలము శరీరములో ఉన్న రసాయనిక పదార్థముల సంపూర్ణసమ్మేళనము అని చెప్పే పదార్థములకు మరణము తరువాత ఆత్మ అనే పేరుతో ఏ పదార్థము వేరుగా మిగిలి ఉండదు అని పదార్థవాదులు అంటున్నారు. మరణము తరువాత జీవన సంబంధమైన విషయములో క్రొత్త అన్వేషణలు చేసే మరియు తిరిగి వాటిని గురించి ఆలోచించే బాధ్యత ఈ రెండు పక్షములకే వదిలి వేయుట జరిగినది.

అనుభూతుల మొత్తము మాయాజాలము, భూతపరమైన దననే మొండిపట్టుదలగలవారి నమ్మకము క్రమముగా సన్నగిల్లుతున్నది. ఆత్మయొక్క అస్తిత్వమునే అంగీకరించనివారు కూడా నూతన ప్రతిపాదనలు మరియు ఖండించటానికి వీలు లేని ప్రమాణములను చూస్తూ తన మొండిపట్టుదలను విడిచి పెట్టి కొంగ్రొత్త కోణములో వాస్తవికతను అర్థము చేసుకునే ప్రయత్నము చేస్తున్నారు.

ప్రసిద్ధ వైజ్ఞానికులు సరలాంజ్, విలియమ్, జానర్, విలియమ్‌క్రక్స్ మొదలగువారు మరణము తరువాత ఆత్మల అస్తిత్వమును అంగీకరించారు. సర్‌జాల్ ఇలా అన్నాడు. 'మనిషి మరణము తరువాత కూడా జీవించే ఉంటాడు అని నేను సంపూర్ణవిశ్వాసముతో చెప్పగలను. ఎందుకంటే నేటికి చాలా

**సంధ్యా వందనము అనగా చేతనత్వంలో మార్పు**

సంవత్సరముల క్రిందట విగతజీవులైన నా స్నేహితులతో నేను సశరీరముగా మాట్లాడాను కనుక'.

ప్రేతాత్మల అస్తిత్వము ఉన్నదా? లేదా? అన్న వివాదము ఇప్పుడు బహుశః సన్నగిల్లుతున్నది, సమాప్తమైపోతున్నది. రాబోయే రోజులలో లభించబోయే ప్రమాణముల యొక్క విశ్వస నీయత అసందిగ్ధస్థాయికి చేరుకుంటుంది. అప్పుడు దీనిని భ్రమ లేక అవాస్తవమని చెప్పి త్రోసిపుచ్చలేము. పైగా వాస్తవ స్థితిని గురించి తిరిగి పునర్విచారణ ఎందుకు చెయ్యకూడదు అని ఆలోచించవలసి వస్తుంది.

ప్రేతముల ఉనికికి సంబంధించిన కొన్ని విశ్వసనీయమైన సంఘటనల క్రమము ఇలా ఉన్నది. అమెరికా చంద్రయాన్ అపోలో-11 తన విజయయాత్రను పూర్తిచేసుకుని చంద్ర మండలము నుండి రాళ్ళ నమూనాలు సేకరించి తిరిగి భూతలము మీదకు చేరుకుంటున్నది. భూమినుండి సుమారు 2,96,000 కి.మీ. దూరములో ఉన్నది. ఆ సయములో హ్యూస్టన్ కంట్రోల్‌రూమ్‌లో అమర్చిన తీవ్రమైన సంవేదనాశీలత గల టేప్‌రికార్డర్‌లో కొన్ని అపరిచిత ధ్వనులు నమోదయ్యాయి. రణదుందుభిలతోపాటు వేల, లక్షలమంది రెండ్‌ఇండియన్స్ చేసిన హుంకారధ్వనులు అవి. అమెరికా అంతరిక్షయాత్రను ఎగతాళి చేస్తూ ప్రేతములు చేసిన భయానకమైన అట్టహాసములు వీటిలో సమ్మిళితమై ఉన్నాయి. అంతరిక్షయాత్రికులైన నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, ఎర్‌బిన్, మైకెల్‌ను ఈ విషయమును గురించి అడిగినప్పుడు తమ యాత్రలో ఏరకమైన శబ్దములు లేదా యంత్రసంబంధమైన ధ్వనులు వెలువడలేదని నొక్కిచెప్పారు.

1890వ సంవత్సరములో జరిగిన సంఘటన. లార్డ్‌డఫ్రిన్ భారతదేశములో గవర్నర్ జనరల్ పదవిని నిర్వహించిన పిమ్మట, పదోన్నతిని పొంది బ్రిటిష్ ప్రభుత్వములో ఉన్నత పదవిలో కొనసాగుతున్నాడు. ఒకసారి వైక్స్‌ఫోర్డ్‌లో గల అతని మిత్రుడు కొంతకాలము తమ కుటుంబముతో గడపమని ఆహ్వానించాడు. ఇతను వెళ్ళాడు. అతను తన పాత, క్రొత్త స్నేహితులతో కలసి అర్ధరాత్రివరకు మందు త్రాగుతూ గడిపిన తరువాత నిద్రించటానికి మంచము దగ్గరకు వెళ్ళాడు. అతనికి ఆరోజు నిద్రరావటము లేదు. నిద్రమాత్రలు మ్రింగినా వాటి ప్రభావము కనిపించలేదు. అతను అశాంతితో లేచి నిలబడి ఆ గదిలోనే నెమ్మదిగా అటూ-ఇటూ తిరుగసాగాడు. ఒక్కసారిగా ఒక అతి చల్లనిగాలి బలంగా వీస్తూ అతనిని ఒక్క కుదుపు కుదిపేటప్పటికి అతను భయపడ్డాడు. తిరిగి చూస్తుండగానే అతని గదిలో తుపాను గాలి బలంగా వీచింది. అది గది నంతటినీ చెల్లాచెదరుచేసి వెళ్ళిపోయింది.

డఫ్రిన్ దృష్టి అకస్మాత్తుగా కిటికీగుండా బయట పచ్చిక బయలు మీదకు మళ్ళింది. అక్కడ ఒక భయంకర ఆకృతి గల వ్యక్తి ఎంతో బరువును భుజముల మీద మోస్తూ కనిపించాడు. అతను పచ్చికబయలు మధ్యన ఆ బరువును దించి రెప్పవెయ్య కుండా సూటిగా డఫ్రిన్‌ను గుడ్లురిమి చూడసాగాడు. డఫ్రిన్ భయముతో కంపించిపోతున్నాడు. కానీ చేసేదేమున్నది? భయముతో కిటికీ మూసివేసి మంచము మధ్యలో కూర్చున్నాడు. కొద్దిసేపటి తరువాత తిరిగి అతను లేచి కిటికీగుండా పచ్చిక బయలు వైపు దృష్టిని సారించినపుడు ఆ బీభత్సస్వరూపము గల వ్యక్తి కనిపించలేదుగానీ, అతను వదిలి వెళ్ళిన అతిపెద్ద శవపేటిక అక్కడ కానవచ్చింది. ధైర్యమును కూడదీసుకుని డఫ్రిన్ ఆ శవపేటికను సమీపించి దానిలోకి తొంగిచూసినపుడు దానిలో శవము మీద కప్పే పెద్దవస్త్రము కనిపించినది. డఫ్రిన్ తన స్నేహితులతో ఈ విషయమును గురించి చెప్పినప్పుడు వారంతా ఇతనిని ఎగతాళి చేశారు. అతను తిరిగి శవపేటికను చూడటానికి పచ్చిక బయలుకు వెళ్ళినప్పుడు అతనికి ఏ ఆధారము కనిపించలేదు. కానీ డఫ్రిన్ తను చెప్పిన విషయము మీద దృఢముగా నిలబడ్డాడు.

5 సంవత్సరముల తరువాత ఫ్రాన్స్‌లో డఫ్రిన్ ఇంగ్లండ్ దేశపు రాయబారిగా నియుక్తుడయ్యాడు. అప్పుడు ఒక అంతర్జాతీయ సమ్మేళనములో పాల్గొనటానికి అతను పారిస్ చేరుకోగా ప్రసిద్ధిగాంచిన గ్రాండ్ హోటల్‌లో బస ఏర్పాటు చేశారు. 5వ అంతస్తులో ఇతనికి వసతి గది ఇవ్వబడినది. అక్కడికి లిఫ్ట్‌ద్వారా వెళ్ళాలి. డఫ్రిన్ లిఫ్ట్ ఎక్కటానికి ఉద్యుక్తుడవు తున్నప్పుడు లిఫ్ట్‌మాన్‌గా తాను ఇదివరకు శవపేటిక ప్రక్కన చూసిన ఆ భయంకర ముఖాకృతిగల వ్యక్తి నిలబడి ఉన్నాడు. అతను డఫ్రిన్‌ను గుడ్లురిమిచూస్తున్నాడు. ఇతను భయపడి లిఫ్ట్‌లో కాలుకూడా పెట్టలేకపోయాడు. ఆ అపరిచిత వ్యక్తి, కానీ ఇదివరకే పరిచితుడైన వ్యక్తి డఫ్రిన్ కోసమే లిఫ్ట్‌లో ప్రతీక్షిస్తున్నాడు. అతను లిఫ్ట్‌లోకి అడుగుపెట్టలేదు. అయితే అక్కడున్న మిగిలిన వారంతా లిఫ్ట్‌ని త్వరగా పోనివ్వమని అడిగారు. కానీ లిఫ్ట్‌మాన్ డఫ్రిన్ లేకుండా లిఫ్ట్‌ని పైకి తీసుకు వెళ్ళాలనుకోవటంలేదు. కానీ డఫ్రిన్ 5 సంవత్సరముల క్రిందట

**శరీరము సాధనకు ఒక పనిముట్టు**

శవపేటికలో శవమును కప్పే వస్త్రము నుంచి అతనిని భయపెట్టిన ఆ భయంకర ముఖాకృతి గల వ్యక్తినే డఫ్రిన్ భయముతో చూస్తున్నాడు. లిఫ్ట్‌మ్యాన్ నిరాశతో బలవంతముగా లిఫ్ట్‌ని పైకి తీసుకువెళ్ళాడు కానీ 5వ అంతస్తుకు చేరుకున్న తక్షణమే లిఫ్ట్ ప్రమాదమునకు గురయ్యింది. అందులో లిఫ్ట్‌మ్యాన్‌తోపాటు పైకి వెళ్ళినవారిలో ఐదుగురు వ్యక్తులు చనిపోయారు. మిగిలినవారు క్షతగాత్రులయ్యారు.

ప్రమాదము గురించి అనేక అన్వేషణలు, సమీక్షలు జరిగినాయి. డఫ్రిన్ లిఫ్ట్‌మాన్ గురించి వివరాలు సేకరించినప్పుడు హోటల్‌వారు అతనిని గురించి ఏమీ చెప్పలేకపోయారు. ఎందుకంటే అసలైన లిఫ్ట్‌మాన్ ఆరోజు సెలవులో ఉన్నాడు. ఈ అపరిచితవ్యక్తిని ఆ ఒక్కరోజుకు లిఫ్ట్‌మాన్‌గా నియమించుకున్నారు. అప్పుడు డఫ్రిన్ ఈ రహస్యమయ విషయమును గురించి ఒక నిర్ధారణకు రాలేకపోయాడు.

హెన్రీఫ్రాయిస్ అను ప్రసిద్ధ శాస్త్రవేత్త తను వ్రాసిన '50 ఇయర్స్ ఆఫ్ సైకిక్ రీసెర్చ్' లో ఇలాంటి ఒక సంఘటననే వర్ణించాడు. ప్రపంచ యుద్ధములో చనిపోయిన ఒక వ్యక్తికి ఒక కూతురుండేది. 1921 వ సంవత్సరములో అతని కూతురు రోసెలీ సుమారు 6 సంవత్సరముల వయస్సులో చనిపోయింది. రోసెలీ 1921 నుండి తన తల్లికి స్వప్నములో కనిపించేది. తరువాత ప్రతి బుధవారము తన కుటుంబసభ్యులందరికీ కనిపించసాగింది. ఈ విషయములోని వాస్తవములను కనుగొనేందుకు శాస్త్రవేత్తలు మరియు పత్రికాకారుల బృందము ఒకటి 1937వ సంవత్సరములో ఆమె కుటుంబసభ్యులను కలిసింది. ప్రయోగ నేపథ్యములో ఒక గదిలోని కిటికీలు, తలుపులు మూసివేసి వెలుతురు రాకుండా చేశారు.

ప్రయోగము ఆరంభమయ్యింది. రోసలీ యొక్క నీడ నెమ్మదినెమ్మదిగా ఆమె తల్లి వద్దకు రాసాగింది. తల్లి రోసెలీని ప్రశ్నించగా ఆమె తల్లికి ప్రత్యుత్తరమిస్తున్నది. పత్రికాకారులు మరియు శాస్త్రవేత్తల బృందం దీనినంతా చూస్తున్నారు. రోసెలీ నెమ్మదిగా తన తల్లి దగ్గరకు రాసాగింది. 'మేమ ఆమెను స్పృశించగలమా?' అని పత్రికాప్రతినిధులు ప్రశ్నించారు. ఆమె తల్లి అంగీకరించినది. అప్పుడు వారు రోసెలీ శిరస్సును, కంఠమును, చేతులను తమ చేతులతో స్పృశించారు. చేతినాడిని కూడా చూడగా, నాడి కొట్టుకుంటున్నది. తర్వాత దీపాలు వెలిగించారు. ఆ వెలుగులో రోసెలీ మొత్తము శరీరము కనిపించసాగినది. ఆమె శరీరము అతి కోమలముగా ఉండి స్వచ్ఛమైన పాలరాయి వలె మెరుస్తున్నది. ఆమె 'అవును-కాదు' అన్న శబ్దములతోనే జవాబిస్తున్నది. 15 నిముషముల పాటు ప్రయోగము కొనసాగినది.

ఇటువంటి ఉదాహరణలకు లోటు లేదు. భావుకులు, పిరికివారు మరియు అంధవిశ్వాసకుల విషయమును విడిచి పెట్టినా కూడా ప్రేతముల ఉనికిని గురించిన అవిశ్వాస ప్రతిధ్వనులు వినిపించనంతగా ఈ విషయమును గురించి పలు ప్రమాణములు సమకూరుతున్నాయి.

మనుష్యులు-ప్రేతముల మధ్య కొనసాగుతున్న ఇచ్చి పుచ్చుకునే పరంపరలో ప్రేతముల ద్వారా ఎదురయ్యే అపాయముల నుండి ఎలా రక్షించబడాలి అన్న విషయము మీద ఇప్పుడు చర్చ జరుగుతున్నది. ప్రేతముల ద్వారా లభించగలిగే సహాయమును అందిపుచ్చుకోవటము ఎలా? అని ఆలోచిస్తున్నారు. ప్రయోగముల ద్వారా ఈ సందర్భములో కూడా కొన్ని సూత్రములు హస్తగతమయ్యాయి. వీటికి మరింత ప్రామాణికతను చేకూర్చుటకొరకు జరుగుతున్న ప్రయత్నములను చూసినప్పుడు అవి సఫలమవుతాయి అన్న ఆశ రోజురోజుకు పెరుగుతున్నది.

*- అఖండజ్యోతి, నవంబరు 1980*

*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

## సాయం

*కాంగ్రెసు సమావేశం జరుగుతున్నది. జోరుగా వర్షం పడుతోంది. ఒక్కరొక్కరే గొడుగు సాయంతో చేరుకుంటున్నారు. శ్రీ వెంకటేశ నారాయణ తివారి గొడుగు తెచ్చుకోలేదు. ఒకషాపులో ఒకమూలగా నిలబడి ఉన్నాడు. చాలామంది ఆయన్ని చూసి కూడా చూడనట్లు పోతున్నారు. ఒక్కరు కూడా పలుకరించలేదు సరికదా గొడుగు సాయమందించలేదు. ఇంతలో మదన మోహన మాలవ్యాగారు గొడుగులో పోతూ చూశారు. వెంటనే "తివారీజీ! గొడుగు తెచ్చుకోలేదా? అంటూ దగ్గరకు వెళ్ళి అతనిని తన గొడుగులో తీసికొని వెళ్ళారు.*

*- అనువాదం: పొన్నూరు హైమవతీశాస్త్రి*

**వైఫల్యాలు పట్టుదలను పెంచాలి గాని మనిషిని కుంగదీయరాదు**

# అనంతమైన శక్తిసామర్థ్యములతో నిండి ఉన్న మానవ శరీరము

మానవ శరీరమునకు ఒక నిశ్చితమైన పరిమితి ఉన్నది. ఆ పరిమితిని మించిన సుఖమును సహించలేదు, మితిమీరిన కష్టములను ఓర్చుకొనలేదు. శరీర ప్రకృతిని అనుసరించి సుఖదుఃఖములను అనుభవించవలిసి వస్తుంది. అది వ్యక్తి యొక్క విశిష్టతను బట్టి వేర్వేరుగా ఉంటుంది. ఒక యోగి శరీరము ఎన్ని బాధలను తట్టుకొనగలదో, సరిగ్గా అంతే మోతాదులో సామాన్య మానవ శరీరము బాధలను ఓర్వలేదు. సరిగ్గా ఇదే రీతిలో ఒక రాజు యొక్క శరీరము ఎన్నెన్ని సుఖ భోగములను అనుభవిస్తుందో, ఒక సామాన్య మానవ దేహము అంతగా వాటిని అనుభవించలేదు. శరీరము ఒక నిశ్చితమైన పరిమితి వరకే సుఖదుఃఖములను అనుభవించగలుగుతుంది. ఆ అవధిని దాటిన సుఖములను అనుభవించే ప్రక్రియ స్వర్గములో కొనసాగుతుంది. అపరిమితమైన దుఃఖమును నరకములో చవిచూడవలసి వస్తుంది. రెండు దశలలోను భగవంతుడిని విస్మరించడము జరుగుతుంది.

మానవ శరీర సంరచన జటిలమైనది అన్నది ముమ్మాటికీ సత్యము! మనస్సు కంటే దేహము మృదువైనది. ఏయే భోగములను మనస్సు అనుభవించలేదో, వాటన్నింటినీ శరీరము అతి తేలిగ్గా సహిస్తుంది. పరిస్థితులననుసరించి మార్పుచేర్పులకు లోనై, వాటికి అనుగుణ్యముగా తీర్చిదిద్దుకునే నేర్పు శరీరమునకున్నది. మనస్సునకు ఈ విశేష లక్షణము కొంతమటుకు తక్కువగా ఉంటుంది. వాతావరణములోని శీతోష్ణాదులలో మార్పులు చోటుచేసు కున్నప్పుడు శరీరము కూడా వాటికి అనుగుణ్యముగా కొద్ది సమయములోనే సారూప్యతను ఏర్పరచుకుంటుంది. అయితే పై రెండు పరిస్థితుల లోను మనఃస్థితిలో ఎట్టి విశేషమైన మార్పు గోచరించదు. మనస్సు ఒక నిశ్చితమైన ప్రవృత్తిని అనుసరించే సాగిపోతూ ఉంటుంది. దానికి తగినట్టుగానే ఆలోచిస్తుంది, భావన చేస్తుంది. మనస్సు ఈ రీతిలో ఉన్నప్పటికీ శరీరమునకు ఒక హద్దు ఉంటుంది. అది ఈ హద్దులను అతిక్రమించలేదు.

శరీరమునకు చిత్తముతో అనుబంధముంటుంది. చిత్తము కారణముగానే దేహమునకు అస్తిత్వము ఉంటుంది. చిత్తములో గూడుకట్టుకునున్న సంస్కారములను అనుసరించే శరీర సంరచన జరుగుతుంది. చిత్తము అనగా మన బ్లాక్‌బాక్స్ (Blackbox). అందులో మనకు సంబంధించిన అన్ని రకము లైన కర్మల యొక్క వివరములు మరియు అవి పరిపక్వమయ్యే సమయము మొదలైన సమస్త విషయములు నిక్షిప్తం చేయబడి ఉంటాయి. ఆ కర్మల ఫలితమును అనుభవించటానికే జీవాత్మకు శరీరము సంప్రాప్తిస్తుంది. ఏ జీవాత్మకు అధికమైన బాధలను సహించవలసి ఉందో, అది ఆ బాధలను తట్టుకొనటానికిగాను తదనుగుణ్యమైన శరీరమే లభిస్తుంది. జీవాత్మ ఆ శరీరము ద్వారా అతిశయించిన బాధలను ఓర్చుకొనగలుగుతుంది. శరీరము యొక్క సహనశక్తిని మించిన దుఃఖములు ప్రాప్తించి నప్పుడు శరీరము విడిచిపెట్టిన తరువాత జీవాత్మ మిగిలిన ఆ బాధలను నరకములో అనుభవించవలసి ఉంటుంది. ఇదే కర్మ సిద్ధాంతము! దీనిని తృణీకరించలేము, త్రోసిరాజనలేము. సరిగ్గా ఇదే ప్రకారముగా సుఖములను అనుభవించటానికీ శరీరము ప్రాప్తిస్తుంది. పరిమితిని మించిన సుఖభోగములను స్వర్గములో అనుభవించవలసి ఉంటుంది. స్వర్గ-నరకములు అన్నవి సుఖదుఃఖములను అనుభవించే స్థానములు! ఐతే భూమి భోగస్థానమే కాక; వాటిని పెంచుకునేందుకు-తగ్గించు కునేందుకు అవకాశమున్న ఏకైక ప్రదేశము. పృథ్వి మీద సుఖదుఃఖములను అనుభవించడముతో పాటు పుణ్యకర్మల ద్వారా సుఖాభివృద్ధిని గావించుకొనవచ్చును. పాపము వలన దుఃఖపురాశి పెరుగుతుంది.

ఈ సృష్టిలో దుఃఖమును-తపస్సుగాను; సుఖమును-యోగముగాను పరివర్తితము గావించుకొనగలిగే ఏకైక పుణ్య ప్రదేశము ధరిత్రియే! మిగిలిన ఇతర స్థానములలో ఈ అవకాశము లేదు. భూమి మీద ఈ దేహము ద్వారా శుభము లను, పుణ్యకర్మలను ఆచరించి, తపస్సు చేసి మనకు ప్రారబ్ధము వలన సంప్రాప్తించిన కర్మఫలమును నశింపజేసుకొనవచ్చును. తద్వారా ఈ శరీరముతో మోక్షమును హస్తగతము చేసుకొన గలము. అయినా కూడా ఒకానొకజన్మలో మోక్షమును పొందటానికి అనువుగా ఉండే శరీర నిర్మాణము మరోవిధముగా జరుగుతుంది. త్రైలింగస్వామి, రమణమహర్షి వంటి మహాత్ముల శరీరములు ఈ కోవకు చెందుతాయి. వారు తమ శరీరము ద్వారా శేషకర్మఫలమును నశింపజేసుకుంటూ, నేరుగా మోక్షమును చేరుకొనగలిగే సాధనాయాత్రను పూర్తి చేసుకుంటారు. ఈ

**దుఃఖం రెండువైపుల పదునున్న కత్తి వంటిది**

స్థితి ప్రాప్తించుట బహు దుర్లభము! కొంతమంది ప్రత్యేక లక్షణములు గల మహాత్ములే ఈ దుర్లభమైన సంఘటనకు సాక్షులుగా నిలుస్తారు. అట్టి ప్రఖరమైన, జీవన్ముక్త జీవాత్మ దేహము సైతము చాలా విశిష్టముగానే రచింపబడి ఉంటుంది.

అట్టి జీవాత్మల చిత్తములో ప్రారబ్ధజనిత కర్మ క్షీణించిపోయి ఉంటుంది. అవిద్యారూప క్లేశ కారణముగానే వారికి శరీరమయితే తప్పక లభిస్తుంది కానీ, ఆ దేహం ద్వారా వారికి నూతనకర్మ వచ్చి చేరదు. ప్రారబ్ధము ప్రోదిచెందదు. ఈ కారణముగానే వారి చిత్తము అత్యంత నిర్మలముగా ఉంటుంది. అయితే అటువంటి జీవాత్మలలో సూక్ష్మమైన అవిద్య మిగిలే ఉంటుంది. అవిద్య అనగా భ్రమ! భ్రమ కారణముగానే దేహం ఉత్పన్నమవుతుంది. ఎందుకంటే ఈ ప్రపంచమే ఒక మాయ! అవిద్యకు నిలయము! అందుచేత అవిద్య కారణముగానే శరీరమును ధరించుట జరుగుతుంది. యోగికి ఈ అవిద్య అంటే ఏమిటో తెలుసు, అవిద్య యొక్క సంపూర్ణప్రకృతితో పరిచయముంటుంది. యోగికి కర్మశేషం ఉంటే కనుక అతను అవిద్యను పారద్రోలుతాడు. అప్పుడు ఆ యోగి చిత్తము భగవంతునిలో లయమైపోతుంది. చిత్తము విలీనమైపోగానే కొమ్మ నుండి పండుటాకు రాలిపోయినట్లుగా శరీరము కూడా రాలిపోతుంది. యోగి శరీరమునకు మాత్రమే ఈవిధముగా జరుగుతుంది. యోగి తన ఈ శరీరములో అనంత బ్రహ్మాండములో విరాజిల్లే శక్తులను ధారణ చేయగలడు. అయితే ఆ అవధులు లేని శక్తిలోని ఒక్క అంశను స్పృశించినంత మాత్రము చేతనే సామాన్య మానవ శరీరము భస్మీభూతమై పోతుంది.

మహాయోగులైనవారు తమ శరీరమును బ్రహ్మాండములోని ఆ శక్తులను ధారణ చేయుటకు యోగ్యమైనదానినిగా మలచు కొనుటకు బాల్యము నుండే ప్రయత్నములు ఆరంభిస్తారు. త్రైలింగస్వామి ఈవిధముగానే చిన్నతనము నుండే తపస్సు చేస్తూ ఉండేవారని లోకుల ఉవాచ. కానీ అది ప్రాయశ్చిత్త తపస్సు! త్రైలింగస్వామికి ఆయన గురువు యొక్క ప్రత్యక్ష మార్గ దర్శనము లభించిననాటి నుండి కఠోరతపస్సు చేయుట ఆరంభించినారు. ఆ కఠోర తపస్సు చేయుట కొరకు తమ దేహమును అప్పటివరకు తపింపజేసుకున్నారు. తపస్సు వలన శరీరములోని కోశికలు, అణువులు మార్పుకు లోనవుతాయి. పరివర్తన చెందుతాయి. సామాన్య శరీరము యోగమయమైన శరీరముగా మారిపోతుంది. యోగజనిత శరీరము అంతులేని బాధలను, కష్టములను తట్టుకునేందుకు తగినదిగా ఉంటుంది. శ్రీఅరవిందులు తాము వ్రాసిన 'అతిమానసయోగము'లో "దేహమును పరివర్తితము గావించుకునే ప్రక్రియను' గురించి ఇలా వర్ణించారు. 'ఈ యోగము చేత శరీరములోని సమస్త అణువులు, కోశికల ప్రకృతి మార్పుకు లోనవుతుంది. శరీర మంతా ఐకమత్యమున్న ఒక సమూహం వలె పనిచేస్తుంది. పరివర్తిత శరీరము యొక్క శక్తి–సామర్థ్యములు కల్పనాతీతముగా ఉంటాయి. ఆ శక్తిని ఊహించను కూడా ఊహించలేము.

ఒక యోగి తన శరీరమును పరివర్తితము కావించుకునే ఒక అద్భుతమైన, ఆశ్చర్యజనకమైన ప్రయోగమును చేశాడు. ఆయన తన శరీరమును మట్టితో నలువైపులా గోడలను కట్టి మూసివేయించు కున్నాడు. దాని లోపలికి కనీసము గాలి–వెలుతురు వెళ్ళే మార్గము కూడా లేకుండా గోడలను కట్టారు. 'నా ఆజ్ఞ లేకుండా ఈ గోడలను కూల్చరాదు' అని తన శిష్యులకు కఠినమైన ఆదేశమును జారీచేశాడు. ఆంగ్లేయులు పాలిస్తున్నప్పుడు ఈ సంఘటన చోటుచేసుకున్నది. ఈ ప్రయోగము జరిగిన కొద్ది నెలల తరువాత ఈ అద్భుత సంఘటనను గురించి తెలిసిన వెంటనే వారు ఆ గోడలను కూల్చేశారు. అప్పుడు తీక్షణమైన వెలుగులు విరజిమ్ముతున్న కాంతిగోళము ఒకటి వేగంగా విస్ఫోటనము చెంది, అంతరిక్షములో కలసి పోయినది. శరీరమును పరివర్తితము కావించుకునే ఈ ప్రయోగము అసంపూర్ణముగా మిగిలి పోయింది. అంటే మధ్యలోనే ఆగిపోయింది. మానవ దేహపు హద్దులను విస్తరింపజేసు కొనవచ్చును అని ఈ ప్రయోగము ద్వారా తేటతెల్లమవు తున్నది.

సంయమనమును పాటిస్తూ సామాన్యమైన శరీరమును సుఖదుఃఖములను తట్టుకునేందుకు తగిన (యోగ్యమైన) శరీరముగా తయారుచేసుకొనవలెను. అంతేకాక తపించుటకు అనువైనదిగా ఈ శరీరమును మార్చుకొనవలెను. భోగము వలన శరీరము శిథిలమై, క్షీణించిపోతుంది. కష్టము వలన ఈ దేహమునకు తేజస్సు వస్తుంది. అందుచేత మనము ఇంద్రియముల యొక్క అంతులేని భోగవాంఛల వెంటపరుగులు పెట్టకుండా, ఈ శరీరమును భగవంతుడు విరాజమానమై ఉండే దేవాలయముగా మలచుకోవాలి.

*– అఖండజ్యోతి, మే 2010*

*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

**అంతఃకరణ యొక్క ఆకాంక్షలే పరిస్థితులను నిర్మిస్తాయి**

# సఫలమైన మార్గానికి పునాది దృఢ విశ్వాసం

విశ్వాసములో అమితమైన శక్తిదాగి ఉన్నది. ఆత్మ విశ్వాసము కలిగి ఉన్న వ్యక్తి అతి కంటక పాత్రమైన మార్గంలో కూడా సునాయాసంగా నిర్భయంగా ప్రయాణిస్తాడు. దీనికి భిన్నంగా అపనమ్మకముతో ఉన్న మనిషి అదే కంటకప్రాయమైన మార్గంలో తొట్రుపడుతూ, భయంతో అడుగుముందుకు వేయజాలడు.

జీవితములో ముందుకు సాగిపోవుటకు మనిషికి ఒక ఆలంబన కావాలి. మనిషికి ఆత్మ విశ్వాసము లేక విశ్వాసము ఒక ఆధారంగా లేక ఆలంబనగా పనిచేస్తుంది. దీని ఆధారంగా మనిషిజీవితంలోని అవరోధాలను అధిగమిస్తూ ముందుకు సాగిపోతూ ఉంటాడు. మొదటగా మనిషి తనలోని విశ్వాసాన్ని దృఢతరం గావించుకొని, తదుపరి భగవంతునిపై విశ్వాసాన్ని నిలిపి ముందుకుసాగాలి. నిత్యజీవితంలో లేశపాటి అవరోధాన్ని దాటుటకై ఒక దుముకు దుముకవలసి ఉంటుంది. దీనికి కూడా మొదట కావలసింది తనపై తనకు దుమకగలనన్న నమ్మకము ఉండాలి. లేనిచో అనవసరభయంతో ప్రయత్నించక పూర్వమే తన ఓటమిని అంగీకరించవలసి ఉంటుంది. కావున గెలుపుకు ప్రధానం విశ్వాసమని మరువరాదు.

ఎవ్వరిపై ఏవిధంగా, విశ్వాసముంచాలి? ఏవిధంగా మన శక్తి సామర్థ్యాలను, అంచనా వేయాలి? అనే ప్రశ్నలు మనలో ఉదయిస్తాయి. వీనికన్నింటికి సమాధానం ఒక్కటే! ఒక మఱ్ఱిచెట్టు విత్తనంలో ఏ రీతిగా ఆ వటవృక్షం నిబిడీకృతమై (దాగి) ఉందో అదేరీతిలో మనలో (మనశరీరం) అనంత శక్తులు విత్తనరూపంలో దాగి ఉన్నాయి! సరియైన నేలలో సరియైన వాతావరణ పరిస్థితులు ఏర్పడగానే విత్తనం రూపంలో దాగి ఉన్న మఱ్ఱివృక్షం వెలికివచ్చి ఏ రీతిగా వ్యాప్తమవుతుందో దృఢవిశ్వాసంతో మనము మనలో దాగి ఉన్న శక్తులను వెలికితేవాలి. వానిని సదుపయోగం చెయ్యాలి! దీనికై తగినంత ఆత్మవిశ్వాసాన్ని మనలో నింపుకోవాలి. తద్వారా మన వ్యక్తిత్వాన్ని పెంపొందించుకొని వికసింపచేసికోవాలి. దీనికై మనము అనేక వ్యయప్రయాసలనెదుర్కొనాలి. ఏ రీతిగా విత్తనం అంకురించే ముందు పెక్కు సంఘర్షణలనెదుర్కొని వృక్షంగా రూపుదిద్దు కుంటుందో అదేరీతిలో మనిషి తన శక్తిసామర్థ్యాలపై విశ్వాసము ఉంచాలి.

విశ్వంలో సంభవించే అనేకమైన సంఘటనలు మనకు ఆశ్చర్యాన్ని కలిగిస్తూ వీనిని చేయుట ఎవ్వరికి సాధ్యంకాదు. అసంభవం అనే, నిర్ణయానికి వస్తూ ఉంటాము. కానీ కొందరు వీనిని సుసాధ్యం చేసి చూపిస్తూ ఉంటారు. ఇట్టివానిని చేసి చూపుటకు అమితమైన శ్రమచేయుట ఏకాగ్రత, అభ్యాసాలను కలిగి ఉండాలి మరియు సాహసం కావాలి. వీటన్నింటికి విశ్వాసం జోడింపబడిననాడు విజయం తథ్యం. ఇట్టిపనులు చేయుటకు అత్యంత కఠినంగా కన్పించవచ్చు కానీ అభ్యాసముతో కఠినమైనది. మృదుత్వాన్ని, సరళతను సంతరించుకుంటుంది.

విశ్వాసమన్నది ఒక గొప్పగుణము. విశ్వాసంతో కొండలను పిండిచేసిన వారున్నారు, కఠినశిలలను, మనోహర శిల్పాలుగా తీర్చిదిద్దిన వారున్నారు. సర్కస్‌లోనివారు ఒకరిని మించి ఒకరు తమ విన్యాసాలను చూపరుల శరీరం గగుర్పొడిచే రీతిలో చేస్తూ ఉంటారు. ఉత్కంఠతతో ఊపిరి బిగబట్టి చూస్తూ ఉంటాం. వీటన్నింటి విజయం యొక్క కారణాలు ఆయా వ్యక్తులకు గల అభ్యాసం, ఏకాగ్రత, పరిశ్రమ మరియు అన్నింటికి మించిన విశ్వాసము కారణములని మరువరాదు. మన జీవితాలు కూడా సర్కస్‌లోని కళాకారులవలే సాహసంతో నిండి ఉంటాయి. ఆత్మ విశ్వాసం లేనివారు సవాళ్ళను స్వీకరించుటకు వెనుకంజ వేస్తుంటారు. ఇదే మన బలహీనతగా మారుతుంది. తదుపరి మనకు ప్రతిబంధకంగా రూపుదాల్చుతుంది. అటు పిమ్మట మనలను ఎట్టిపనిని చేపట్టకుండా, నిర్వీర్యున్ని చేస్తుంది, పిరికివానిగా మార్చుతుంది.

కావున మనిషి విశ్వాసాన్ని కోల్పోరాదు. ప్రగతిమార్గంలో పయనించాలన్న విశ్వాసం తప్పనిసరిగా పెంపొందించుకోవాలి. అప్పుడే మనలో నిక్షిప్తమై దాగి ఉన్న అనేకశక్తులు జాగృతమై వెలికివస్తాయి. దీనికి మనలో సత్‌సంకల్పం, సాహసము, మరియు విజయోత్సాహం వెల్లివిరియాలి.

వర్తమాన పరిస్థితులలో మానవుని నిత్యజీవితం అత్యంత జటిలంగా మారింది. పలు సవాళ్ళు అతనిని చుట్టుముట్టి ఉన్నాయి. అయినా స్థిరసంకల్పంతో, సాహసవంతుడై శ్రమశీలుడై పరిపూర్ణవిశ్వాసంతో ముందుకు సాగాలి. అప్పుడు కష్టాల సుడిగాలి చెల్లాచెదురై, మార్గనిర్దేశనం జరిగి ప్రగతి మార్గంలో స్వతహాగా పయనిస్తాడు. ఇదే అంతర్గతశక్తుల వికాసానికి నిదర్శనం.

– *అనువాదం: శ్రీమతి సావిత్రి నర్సింగరావు*

**దుఃఖం మనిషిని బలహీనుని గావిస్తుంది - సంతోషం సగం బలం**

వ్యక్తి నిర్మాణం

# స్వప్రయత్నంలో జీవన సాఫల్యం

ఎంత ప్రయత్నించినప్పటికి కొందరికి కోరిన సఫలత ప్రాప్తించదు. దానితో వారు చేస్తున్న ప్రయత్నాలు, పురుషార్థం అంతా వ్యర్థమని, అదృష్టమనేది ముఖ్యమనే భ్రమకు లోనవుతారు. కానీ అదృష్టం మీద నమ్మకం పెట్టుకోవడం ఒక మానసిక దౌర్బల్యం. సఫలత కలుగలేదంటే ప్రయత్నంలో ఎక్కడో ఏదో లోపం ఉన్నది. సంపూర్ణంగా సరైన రీతిలో చేసే ప్రయత్నం వల్ల విజయం లభించడం తథ్యం. ఇందులో ఏ విధమైన సందేహం లేదు.

ఒకసారి ప్రయత్నం చేయగానే సఫలత కలగాలని లేదు. సఫలత కోసం నిరంతర ప్రయత్నం చేస్తూనే ఉండాలి. శారీరిక శ్రమ, పురుషార్థ రూపంలో అవసరమైనంతగా పెట్టుబడి పెట్టాలి. అనుకున్న సమయంలో సఫలత కలుగలేదు కనుక ఆ పని విజయవంతం కాలేదనుకోవడం అనుచితమే అవుతుంది. ప్రపంచంలో లింకన్ వంటి ఎందరో వ్యక్తులు వందల సార్లు సఫలత సాధించలేకపోయినా చివరికి తమ అభీష్టాన్ని నెరవేర్చుకోగలిగారు. నిజమైన ప్రయత్నశీలురు ఎన్నిసార్లు సఫలం కానప్పటికి ప్రయత్న లోపం చేయరు. ప్రతి ఓటమి తర్వాత నూతనోత్సాహంతో సఫలత కొరకు నిరంతరం శ్రమించ వలసి ఉంటుంది. బండరాయి ఒక్క దెబ్బతో పగలకపోతే మరిన్ని సార్లు కొట్టి పగలగొట్టవచ్చు.

ఓటమి అంగీకరించామంటే నిరాశను ఆహ్వానించినట్లే. నిరాశవల్ల ఎన్ని దుష్ఫలితాలు కలుగుతాయో వేరే చెప్పక్కర్లేదు. నిరాశ అనేది ఒక నాగపాశం లాంటిది. మానవుని క్రియాశీలతను పాములా చుట్టుకుని అతని ప్రగతిని ఆటంకపరచడమేగాక, తన విష ప్రభావంతో అతని జీవన తత్వాన్నే పాడు చేస్తుంది.

ఆపదలు పర్వతశ్రేణుల్లాగా విస్తరించి, దుర్భేద్యమైనవిగా కనిపిస్తాయి. కానీ వాస్తవంలో అది ఒక భ్రమ మాత్రమే. ఏదైనా ఒక కష్టం రాగానే అది ఎంతో కఠినమైందని ముందు గానే ఊహించుకొని మన శక్తి చాలదని, మనం దానిని ఎదుర్కోలేమని అడుగు ముందుకు వేయడానికే జంకుతాము. కానీ అక్కడ భయపడేంతగా ఏమి ఉండదు.

ఫలితం కలుగదనే భావనను మనస్సులోకి రానీయ కూడదు. **ఫలాలను ఆశిస్తూ నిరంతరం కృషి చేయడమే మన కర్తవ్యం. ఇవాళ అడుగు ముందుకు వేస్తేనే రేపు గమ్యాన్ని చేరుకోగలుగుతాము. అడుగే వేయకపోతే గమ్యాన్ని ఎలా చేరగలం. కనుక ధైర్యంతో విశ్వాసంతో ముందుకు అడుగులు వెయ్యాలి.**

కష్టాలు కలిగినప్పుడు మానవుడు తల్లడిల్లిపోయి ఎవరైనా సహాయం చేస్తే బాగుంటుందనుకుంటాడు. కానీ వాస్తవంలో ఎవరైనా బాధలో ఉన్నారంటే ఇతరులు వారి వైపు కన్నెత్తి చూడరు. ఇంక సానుభూతి మాట ఎక్కడిది? ఇతరుల కష్ట సుఖాలను తమవిగా భావించి ఎదుటి వాడికి సేవ చేయాలనుకునేవారు ప్రపంచంలో బహుకొద్ది మంది మాత్రమే ఉంటారు.

మన గడ్డు పరిస్థితులకు ఇతరులు కారణమని భావించ కూడదు. పరిస్థితులను వ్యక్తి తనకు తానే తయారుచేసుకుంటాడు. సుఖదుఃఖాలు అతని మనఃస్థితిపైన ఆధారపడి ఉంటాయి. భయాన్ని వదిలి నిర్మలమైన దృష్టికోణంతో ఉంటే ఎటువంటి పరిస్థితులైనా మనలను చలింపచేయవు.

ప్రపంచంలో మన మాటలు, మన చేతలు శత్రువులను, మిత్రులుగా తయారు చేస్తాయి. ఈ ప్రపంచం ఒక అతిథి గృహం, వచ్చే ప్రాణులు వస్తుంటారు, కొద్దికాలముంటారు. తర్వాత వెళ్ళిపోతారు. ఇక్కడ శాశ్వతంగా ఉండేవారెవరూ లేరు. కనుక ఎవరితోనూ కఠోరమైన మాటలు మాట్లాడకూడదు. చెడుగా ప్రవర్తించి శత్రుత్వాన్ని పెంచుకోకూడదు. అందరిని తమ తోటి వారుగా భావించి స్నేహ సౌజన్యాలను సానుభూతిని కనపరచాలి.

కష్టాలను అవరోధాలనుకుంటే ప్రపంచంలో ఎవరు సంపన్నులుగా, సఫలురుగా ఉండరు. కష్టాలు లేని భాగ్యశాలి ఎవరు ఉండరు.

పరిస్థితుల ముందు తను ఓడిపోయాననుకుంటే, కొద్ది బాధలకే, అవరోధాలకే మనుష్యులు క్రుంగిపోతారు. అదే

**ప్రతి సమస్యకు ఒక పరిష్కారం ఉంటుంది**

ప్రగతికి పెద్ద ఆటంకమౌతుంది. ఉన్నతి, ప్రగతి ఆత్మవిశ్వాసంతో లభ్యమవుతాయి. ఆత్మబలం, శరీరబలం జీవనపథంలో మానవుడిని ముందుకు తీసుకెళ్తాయి. బాధలు నిర్బలుడిని చుట్టుకుంటాయి, ఆత్మవిశ్వాసం లేనివారిని ఓడిస్తాయి. కార్య శీలురను, ఆత్మబలం కలవారిని అవి ఏమీచేయలేవు.

ఆత్మవిశ్వాసమే ఆత్మబలం. తమకాళ్ళ మీద తాము నిలవ గలిగి ఎవరి సహాయము అవసరం లేనివారిని వారి స్థానం నుండి ఎవరు కదిలించగలుగుతారు? ముందుకు వెళ్ళకుండా ఎవరు ఆపగలరు?

ఇతర శక్తులు కూడా యోగ్యత కలవానికి సహాయ పడతాయి. ఒక మనిషి అప్పుగాని, ఏదైనా వస్తువుగాని కావాలని ఇతరుల దగ్గరికి వెళ్తే తాము చేసే సహాయం సదుప యోగం అవుతుంది అనుకున్నప్పుడు వారు సహాయం చేస్తారు. కొందరికి ఏ సహాయము లభించకపోవచ్చు. కారణం అతను తన యోగ్యతను, నమ్మకాన్ని ఋజువు చేసుకోలేదు. అంతేగాని సహాయం లభించినవాడు అదృష్టవంతుడు, ఇంకొకడు అదృష్టవంతుడు కాదని కాదు. సహాయం చేయని వారిని దూషించకూడదు. ఎవరైనా యోగ్యులకు సహాయపడతారు కానీ అయోగ్యులకు సహాయపడరు. రైతు బాగా పాలిచ్చే ఆవులను బాగా మేపుతాడు. పనికిరాని పశువుల్ని కసాయి వాడికిస్తాడు. తోటమాలి ఆరోగ్యవంతమైన మొక్కల్ని బాగా కాపాడుకుంటాడు. పనికిరాని మొక్కలను ఏరివేస్తాడు. ఆ స్థానంలో మంచి మొక్కలను నాటుతాడు. భగవంతుడు కూడా యోగ్యమైన వారికే సహాయం చేస్తాడు. జపం చేసినా, మ్రొక్కులు మ్రొక్కినా అయోగ్యులకు నిరాశే మిగులుతుంది.

'ఉద్ధరేత్ ఆత్మనాత్మానామ్' అని గీతలో స్పష్టంగా విశద పరచారు. అనగా ఉన్నతిని కోరేవారు స్వయంగా ప్రయత్నం చేయాలి. గమ్యం వైపు స్వయంగా పయనించాలి. గమ్యం వరకు భుజాల మీద ఎవరూ మోసుకుపోరు. జీర్ణకోశం పని చేయకపోతే అన్నం అరగదు. కళ్ళు సహకరించనిదే ఏ దృశ్యము చూడలేము. అలాగే ప్రయత్నం లేకుండా ఉన్నతిని పొందలేము.

గొర్రెల్లా కాక మన శక్తిని తెలుసుకుని ప్రగతి కొరకు ప్రయత్నించాలి. భగవంతుని శక్తిపుంజంలోని అణువులమని తెలుసుకుని ఈ భూమిని స్వర్గంగా మార్చేందుకు, ఇక్కడ ప్రేమ, సానుభూతులను పంచటానికి మనం వచ్చామని గ్రహించాలి. మంచిని శిరోధార్యం చేసుకోవడమే జీవితం. అగ్రగాములై మన భవిష్యత్తునేగాక, సమాజ భవిష్యత్తును కూడా ఉన్నతికి తీసుకువెళ్ళడమే మన జీవితానికర్థం, పరమార్థం.

★★★

## మార్పు

*పోలీసు అధికారి కుమారుడు ముంశీరామ్. కొత్వాలు కొడుకునన్న అహంకారంతో కన్నుమిన్ను కానక తిరిగేవాడు. త్రాగుడు, జూదం, వ్యభిచారం ఒకటేమిటి? ఆతనికి అలవాటులేని దురభ్యాసమే లేదు. ఒకనాడు చిత్తుగా త్రాగిన మత్తులో జోగుతూ అర్ధరాత్రికి ఇల్లు చేరాడు. తలుపులు దబదబ బాదాడు. దానికోసమే ఎదురు చూస్తూ ఉన్నా భార్య గబగబ వచ్చి తలుపు తీసింది. భరించరాని దుర్గంధాన్ని కూడా లెక్కచేయకుండా భర్తను జాగ్రత్తగా ఇంటిలోనికి తీసుకున్నది. తలుపులు వేసేలోపు భర్త విపరీతంగా వాంతి చేశాడు. ఇరువురి బట్టలు పూర్తిగా తడిసిపోయినాయి.*

*అయినా ఓర్పుతో ఆ సాధ్వి రెండుచేతుల్లో భర్తను ఒడిసి పట్టుకుని గదిలోనికి తీసికొని వెళ్ళింది. దుస్తులు మార్చింది శరీరమంతా శుభ్రం చేసింది. భోజనం తినిపించింది. తాను కూడా దుస్తులు మార్చుకుని వచ్చి భర్తకు పాదాలు వత్తుతూ సేవలు చేసింది. ఆమెకు తిండి తినాలి, నిద్రపోవాలి అన్న ధ్యాసేలేదు. చూస్తూ ఉండగానే తెల్లవారిపోయింది. కన్నులు తెరచిచూచిన భర్త భార్యస్థితిని పూర్తిగా అర్థం చేసుకున్నాడు. రాత్రి జరిగిన తతంగమంతా కన్నులముందు కదలింది. కనువిప్పు కలిగింది. సహనశీల అయిన భార్యసేవల వలన మార్పుచెందిన మనస్సు "స్వామి శ్రద్ధానంద" గా రూపుదాల్చాడు. ఆ ముంశీరామే మన శ్రద్ధానంద.*

– *అనువాదం:* పొన్నూరు హైమవతీశాస్త్రి

**విద్యాలయం ప్రాపంచిక జ్ఞానాన్ని ఇస్తే దేవాలయం ఆత్మజ్ఞానాన్ని అందిస్తుంది**

# బుద్ధుడు - సేవానిరతి

ఒకరోజు బుద్ధుడు మరియు ఆనందుడు నగరానికి వెలుపలనున్న విహారాన్ని చూచుటకై వెళ్ళారు. వీరిరువురు ఆ విహారంలోనికి ప్రవేశించే సమయానికి, విహారంలో ఉన్న బౌద్ధ భిక్షువులంతా భిక్షాటనకై బయటకు వెళ్ళారు. వీరిరువురూ విహారంలో నడుస్తూ ఉండగా, ఒక కుటీరంలో నుండి హీన స్వరంలో బాధతో కూడిన మూలుగు వీరి చెవులో సోకింది. బుద్ధుడు వెంటనే కుటీరంలోనికి వెళ్ళిచూడగా ఒక మూల దుర్బలుడైన భిక్షువు ముడుచుకొని పడుకుని ఉన్నాడు. ఆ కుటీరమంతా దుర్వాసనతో నిండి ఉన్నది. బుద్ధుడు అతని వద్దకు వెళ్ళి అడిగాడు, "బంధు! మీకేమైనది?" జవాబుగా అతడు "గురువర్యా! నేను వాంతులు, విరేచనాలతో బాధపడు తున్నాను" అని భిక్షువు జవాబిచ్చాడు. "ఏమిటి? ఏ ఒక్క భిక్షువు మీకు సహాయసహకారములనందించుట లేదా?" అని ప్రశ్నించాడు బుద్ధుడు.

"గురువర్యా! ఇతర భిక్షువులు భిక్షాటనకై వెళ్ళారు. ఇక్కడ నేను తప్ప మరెవ్వరు లేరు. నేను మొదటిసారి రోగగ్రస్తుడను అయినప్పుడు నాకు ఎవ్వరో ఒకరు సహాయ సహకారములను అందించేవారు. తరువాత నేను ఆలోచించి చూడగా ఇది ఏ ఒక్కరికి సంబంధించిన పనిగా నేను భావించనందున, నేను నా గురించి ఎక్కువగా శ్రద్ధ వహించి సేవ చేయవలసిన అవసరం లేదని" వారితో చెప్పాను.

బుద్ధుడు నీరు తెమ్మని ఆనందునికి చెప్పాడు. ఆనందుడు తెచ్చిన నీటితో బుద్ధుడు, భిక్షువునికి స్నానం చేయించి మంచి బట్టలు ధరింపజేయుటచే అచ్చటనున్న దుర్గంధము పోయింది. కుటీరం నేలను కూడా శుభ్రపరచాడు. రోగగ్రస్తుడైన వాని వస్త్రాలను ఉతికి ఆరవేసే సమయానికి భిక్షకై వెళ్ళిన భిక్షువులు తిరిగి విహారానికి చేరుకున్నారు. ఆనందుడు నీటిని వేడిచేసి మందును తయారు చేయుటకు సిద్ధము చేయమని భిక్షువులను కోరాడు.

భిక్షువులంతా, బుద్ధ భగవానునికి మరియు ఆనందుని భోజనానికి సిద్ధం చేశారు. బుద్ధ భగవానుడు ముందుగా రోగగ్రస్తునిగా ఉన్న భిక్షువునకు, ఔషధంతో కూడిన భోజనాన్ని అందించి, తదుపరి మౌనంగా అందరితో కలసి భోజనాన్ని స్వీకరించాడు. ఆయన ఇతర భిక్షువులతో అన్నాడు. "ఆ కుటీరంలో ఉన్న భిక్షువు ఎట్టి అనారోగ్యంతో బాధపడు చున్నాడు?" అని ప్రశ్నించగా జవాబుగా "బోధిసత్వుడు విరేచనాలతో బాధపడుచున్నాడు" అన్నారు. ఎవరినైనా అతనికి సేవ చేయుటకు నియమించారా?" జవాబుగా "గురుదేవా తొలుత మేము అతనికి సేవ చేస్తూ ఉన్నాం, కానీ తదుపరి ఆయనే స్వయంగా తనకు ఎటువంటి సేవలు అక్కరలేదని మమ్ముల నిరోధించాడు".

భిక్షువులారా! లోకమంగళకర మార్గాన్ని ఏర్పరచుట కొరకై మనము ఎప్పుడు మన గృహజీవితాన్ని త్యాగం చేశామో ఆనాటి నుండి మన కుటుంబం మరియు మన తల్లిదండ్రులు విడచి పెట్టబడ్డారు. ఇట్టి స్థితిలో ఒక భిక్షువు రోగగ్రస్తుడయితే అతనిని మరొకరు సంరక్షించుకొనాలి, అట్టివారికి కావలసిన సహాయాన్ని మనమే అందించాలి, అట్లు కానిచో మరెవ్వరు సహాయపడతారు? మనము ఒకరికొకరు సహాయాన్ని తప్పక అందించుకోవాలి. జబ్బున పడ్డవ్యక్తి ఎవ్వరైనా కావచ్చు. శిష్యుడు కావచ్చు, లేక మిత్రుడు కావచ్చు, మనం అవసరము ఉన్నంత వరకు అతనికి సేవచేయవలసిందే, అనగా అతనికి స్వస్థత చేకూరేంత వరకు! ఒకవేళ నేను జబ్బు పడినచో ఏమి చేస్తారు? మీరు నా అవసరాల పట్ల జాగరూకత వహించరా?" అని వారిని అడిగాడు బుద్ధుడు. వెనువెంటనే "మీరు అస్వస్థులైనచో మేము ప్రతి ఒక్కరం మీకు సేవ చేస్తాం!" అన్నారు. దీనికి ప్రత్యుత్తరంగా బుద్ధుడు "ఏ భిక్షువుకైనా సేవ చేయుట, నాకు సేవ చేయుటతో సమానమే" అన్నాడు. కొద్ది రోజులలోనే ఉచిత రీతిలో సేవలంది భిక్షువు జబ్బు నుండి కోలుకొని పూర్తి ఆరోగ్యవంతుడైనాడు.

*– అఖండజ్యోతి, మార్చి 2013*


*అనువాదం: ఎ. వేణుగోపాలరెడ్డి*

**అజ్ఞానమే దుఃఖానికి మూలం**

# సత్యవ్రతకథ

సత్యాన్ని వ్రతంగా స్వీకరించి నిత్యజీవితాలలో దానిని ఆచరణలో పెట్టుటయే నిజమైన సత్యవ్రతం అవుతుంది. దీనినే మన ఋషులు, మునులు సత్యన్నారాయణ వ్రత కథగా మలచి మనకందించి మనము సత్యసంధులుగా మారే మార్గాన్ని చూపారు. ప్రతిరంగములో ధర్మము, కర్తవ్యము, నీతి, సదాచారము, మర్యాద, వివేకము ఆధారంగా మన ఆలోచనలను ఆచరణలను తీర్చిదిద్దుకొనుటయే సత్యనిష్ఠ యొక్క సమగ్ర రూపం. దీనితో లౌకిక మరియు పారలౌకిక జీవితాలు రెండూ సుఖము మరియు శాంతిమయం అవుతాయి.

దురదృష్టవశాత్తు నేడు ''సత్యమనేది'' మాటలకు పరిమితమై, చేతలలో శూన్యమైంది. నేడు విశ్వమానవాళి ఎదుర్కొనుచున్న సమస్త సమస్యలకు ఇదియే మూల కారణంగా మారింది. దీనిని అధిరోహించి, విశ్వమానవాళి సుఖశాంతులతో మనగలగాలన్నచో ఇది ఒక్కటే మార్గం అదే – "మన సమస్త మనోవృత్తులను, ఆకాంక్షలను, క్రియాకలాపాలను ధర్మ మర్యాదలకు అనుబద్ధంగా రూపొందించుకొనవలసి ఉన్నది." అప్పుడే సత్య సంధత ఫలితాలను మనము చవిచూడగలము.



మన ఆచరణలో చక్రధారియైన శ్రీకృష్ణుని, ధనుర్ధారియైన శ్రీరాముని భగవానునిగా భావించి సంతృప్తిపడుచున్నామేగాని, మానవ శరీరధారులై వారు ఆచరించి చూపిన ధర్మమార్గాన్ని, వారి జీవన విధానాన్ని మన జీవితాలలో అనుసరించుట లేదు.

సదాచారుడైన వ్యక్తి అనాయాసంగానే ఈశ్వరుని కృపకు పాత్రుడవుతాడు. ఆ వ్యక్తి జీవితంలో సుఖము, ఆనందము నిండి ఉంటాయి. దీనికి భిన్నంగా సత్యన్నారాయణునికి భోగము, నైవేద్యము, స్తవనం పూజలు చేసి సంతృప్తిపరిస్తే మిగిలేది శూన్యమే. వాస్తవిక ప్రయోజనం నెరవేరదు. సత్యన్నారాయణ స్వామి వ్రతకథ విని పంచామృతము, ప్రసాదము స్వీకరించినచో ఫలితము లభిస్తుందనే ఆలోచనలలో మునిగి తేలుచున్నాము. ఈశ్వరుని కృప ఒకటి రెండు రూపాయలు, రెండు గంటల సమయాన్ని ఖర్చు పెట్టుట ద్వారా లభించెడి చౌకబారు వస్తువు కాదు. దీనిని బాగుగా గుర్తుంచుకోవాలి.

ఈ కథ ద్వారా సమాజంలోని అన్ని వర్ణముల వారికి మార్గదర్శనం లభిస్తుంది. సమాజంలో నేడు నాలుగు శక్తులు ప్రధానంగా పని చేస్తున్నాయి. 1) జ్ఞానశక్తి 2)భుజ బలశక్తి 3) ధనశక్తి 4) శ్రమశక్తి.

పై నాలుగు శక్తుల వికాసము మరియు సదుపయోగం సమాజ శ్రేయస్సు దృష్ట్యా చాలా అవసరం. ఈ నాలుగు శక్తులలో సంపన్నులైన వ్యక్తులే వరుసగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య మరియు శూద్రులుగా పిలువబడుచున్నారు. ఈ శక్తులు గల వ్యక్తులను సత్యన్నారాయణ వ్రతకథ మాధ్యమంగా సత్యన్నారాయణులుగా చేసి సమాజానికి సుఖసమృద్ధులను అందజేసినచో భూమి స్వర్గంగా మారుతుంది. మానవులంతా దేవతలుగా మారి అలనాటి సత్యయుగ ముక్కోటి దేవతలు నేడు సప్తశతకోటి దేవతలుగా మారెదరు అని పరమపూజ్య వేదమూర్తి, తపోనిష్ఠ, యుగద్రష్ట పండిత శ్రీరామశర్మ ఆచార్య గురుదేవులు అన్నారు. ఇదియే సత్యయుగ పునరాగమనానికి నాంది.

ఓం శాంతిః శాంతిః శాంతిః

**ఇతరులకు మేలు చేకూర్చేవాడు తనకు తాను మేలు చేసుకున్నట్టే**

# మొక్కలను నాటడం మహా పుణ్యకార్యం

పర్యావరణ సంతులనములో వృక్షసంపదకు సర్వాధికమైన మహత్త్వమున్నది. మొక్కలు, వృక్షములు ఈ సంతులనమును కాపాడుటలో అసామాన్యమైన భూమికను నిర్వహిస్తాయి. ఋతువులు, వర్షము, చివరకు ప్రాణుల అస్తిత్వము సైతము వృక్ష-వనస్పతుల మీదనే ఆధారపడి ఉన్నది. వీటినుండి లభ్యమయ్యే ప్రాణవాయువు ఒకవేళ కన్నుమూసి తెరిచేంత కాలము అయినాసరే నిలిచిపోతే కనుక సమస్త జీవుల ప్రాణములు సంకటస్థితిలో పడిపోతాయి. కొద్ది క్షణములలోనే కనిపించే ప్రాణులన్నింటి కదలికలు స్థంభించిపోతాయి. ప్రాణ వాయువు తరువాత మనుగడ సాగించటానికి అన్నింటినీ మించి ఎంతో అవసరమైనది జలము. జలమునకు కూడా మూలము వృక్షవనస్పతులే! మేఘమాలికల గర్భమునుండి తన ఆకర్షణశక్తి ద్వారా జలమును పీల్చుకొని సమీపక్షేత్రములో ఆ నీటిని ప్రాణిసముదాయము కొరకు వర్షింపజేయుటలో వృక్షములు ఎంతటి అత్యుత్తమ భూమికను నిర్వహిస్తాయి అన్న విషయము అందరికి తెలిసినదే. **'ప్రాణవాయువు మరియు జలము'** వీటి తరువాత జీవించటానికి అవసరమైన ఆహారపదార్థములు లెక్కలోకి వస్తాయి. ఆహారపదార్థములు లేకపోయినప్పటికీ మనిషి కొద్దికాలము జీవితమును నెట్టుకురాగలడు. అయితే ప్రాణవాయువు లేకుండా లిప్తపాటుకూడా మనిషి మనుగడ సాగించుట అసంభవము. ప్రాణవాయువు, జలము అన్న ఈ రెండు తత్త్వములను వృక్షసంపద ద్వారానే సమృద్ధిగా పొందగలుగుట సాధ్యపడుతుంది.

వృక్షములు తమ జీవితకాలములో ప్రాణులందరికి పలు రకములుగా సేవ చేస్తుంటాయి. ఆక్సిజన్ రూపములో ప్రాణ వాయువును నిరంతరముగా విడుదల చేస్తుంటాయి. మేఘముల నుండి సరిపడినంతగా నీటిని ఆకర్షించటము, కాలుష్యమును నియంత్రించే ఒక సేవకుని రూపములో వాయుకాలుష్యమునకు గురియైన వాతావరణమును స్వచ్ఛముగా చెయ్యటము, భూమి యొక్క సారశక్తిని వృద్ధిచెయ్యటము, ఫలపుష్పాలను అందించటము, పలుకార్యములకు ఇంధనమును సమకూర్చడము వంటి అనేకరకములైన భౌతిక అనుదానముల నుండి మనిషి నిరంతరము లాభములను పొందుతూనే ఉన్నాడు. వృక్షముల యొక్క ప్రత్యక్ష-పరోక్ష అనుదానములను భౌతికముగా లెక్కించి చూస్తే కనుక మనిషి సంభ్రమాశ్చర్యములకు లోనవుతాడు. సర్వసామాన్యముగా వృక్షములను ఇంధనము, ఫలములను అందించే రూపములోనే మనిషి చెట్ల విలువను లెక్కిస్తాడు. కానీ ఇది ఒక పక్షము మాత్రమే. వృక్షములు అందించే పరోక్ష అనుదానములను డబ్బురూపములో లెక్కిస్తే కనుక ప్రత్యక్ష సేవలతో పోల్చినప్పుడు పరోక్ష సేవలే ఎన్నో రెట్లు విలువైనవి, మహోన్నతమైనవి.

కలకత్తా వ్యవసాయ విశ్వవిద్యాలయమునకు చెందిన టి.దాసు వృక్షశాస్త్ర నిపుణుడు. ఒక వృక్షము తన 50 సంవత్సరముల జీవిత కాలములో ఎంత సేవచేస్తుంది అన్న విషయమును డబ్బులపరంగా లెక్కగడితే కనుక అది 15 లక్షల రూపాయలను మించి ఉంటుంది అని శాస్త్రవేత్త దాసు అభిప్రాయము. ఒక చెట్టు 50 సంవత్సరముల కాలావధిలో $2^1/_2$ లక్షల రూపాయిల విలువచేసే ఆక్సిజన్‌ను విడుదల చేస్తుంది. భూమియొక్క సారశక్తిని పెంచుటలో $2^1/_2$ లక్షల రూపాయిల విలువచేసే ఎరువు ఎంత సహాయపడుతుందో దానికి సమానముగా వృక్షములు సేవనందిస్తాయి. అలాగే కాలుష్యమును నిరోధించే రూపములో కలుషిత వాతావరణమును స్వచ్ఛముగా చేయుటలో అవి 5 లక్షల రూపాయిలకు సమానమైన పనిని పూర్తిచేస్తాయి. తేమను నిలువరించడము, వర్షింపజేయటము మరియు ఆహారపదార్థములలో విటమిన్స్ ఉండేటట్లు చేయుట వంటి పనుల విలువను పైన చెప్పినవాటికి జోడిస్తే 25 సంవత్సరముల కాలములో రమారమి 5 లక్షల రూపాయిల మొత్తము లెక్కతేలుతుంది. వృక్షములు 15 లక్షల రూపాయిలకు సమానమైన పరోక్ష సేవలను అందిస్తాయి. సామాన్యముగా ఇంధనము, ఫలముల ద్వారా ఒనగూడేవి వందల రూపాయిలు మాత్రమే. మనిషి కనిపించే ఆ లాభమునే లెక్కలోకి తీసుకుంటున్నాడు.

ఇదంతా ఒక వృక్షమునకు సంబంధించిన అంశము. ప్రకృతిప్రదత్తమైన వృక్షసంపద ద్వారా ఒనగూడే సమస్త భౌతిక

**తల్లిదండ్రులు తమ బిడ్డలకు ఉత్తమ విద్యాబుద్ధులు, మంచి నడవడికను అందించాలి**

అనుదానముల చిట్టా తయారుచేస్తే కనుక ఈ వృక్షములు ఉచితముగా ఎంత సేవ చేస్తాయో, అంత సేవను బహుశః మనిషికూడా చెయ్యడు అన్న విషయము బోధపడుతుంది. లభించిన గణాంకములను బట్టి మన దేశములో మొత్తము భూభాగములో 23% ప్రాంతములో వనములు ఉన్నాయి. అయితే పర్యావరణ సంతులనము మరియు దేశ ఆర్థికాభ్యున్నతి కొరకు మొత్తము విస్తీర్ణములో $^1/_3$ వ భాగము వనములతో నిండి ఉండుట ఆవశ్యకము. భారతభూమిలో 2 లక్షల 74 వేల మైళ్ళ పొడవున అడవులు విస్తరించి ఉన్నాయి. ఇందులో కోట్లాది వృక్షములు అలరారుతున్నాయి. భారతదేశము మొత్తములో వ్యాపించి ఉన్న అడవులలో గల వృక్షములు చేసే సేవ కోట్లాది రూపాయలను మించి ఉంటుంది. ప్రాణ వాయువు, భూసారశక్తి-సామర్థ్యము, వాతావరణ కాలుష్య నివారణ, వర్షములను కురియింపజేయుట వంటి ప్రత్యక్ష, పరోక్ష లాభములెన్నింటినో మనిషి వృక్షములనుండి పొందు తున్నాడు. వృక్షములు కోట్లాది రూపాయిలకు సమానమైన సేవ చేస్తున్నాయి, అది ఒక పంచవర్ష ప్రణాళికకు వెచ్చించబడే ధనమునకు 4 రెట్లు ఎక్కువే ఉంటుంది.

పర్యావరణ సంతులనము నిమిత్తము మొత్తము భూభాగ విస్తీర్ణములో 33% వృక్షవనస్పతులతో ఆవరించి ఉండాలి. ఒకప్పుడు దేశములోని 70% భూమి వనములతో శోభిల్లు తుండేది. తరచుగాను, అధికముగాను నరికివేయడము చేత అది 22% పడిపోయింది, అనివార్య పర్యావరణ సంతులన సంఖ్యకన్నా ఇది 11% తక్కువ. ఇతర దేశములు కఠినముగా వ్యవహరిస్తూ వనసంపదను నష్టపరచేవారికి కళ్ళెము వేస్తున్నాయి. ఫిన్‌ల్యాండ్‌లో ఇప్పుడుకూడా 66% భూమిలో అడవులు విస్తరించి ఉన్నాయి. ఇంధన ఆవశ్యకత అధికముగా కలిగిన పారిశ్రామిక దేశమైన జపాన్‌లో కూడా 62% విస్తీర్ణ భూభాగము మొక్కలు, చెట్లతో నిండి పచ్చగా కళకళలాడు తున్నది. ఈజిప్ట్‌లోని మొత్తము విస్తీర్ణములో 34, అమెరికాలో 33% భాగములో అడవులు ఉన్నాయి. అత్యంత దూరదృష్టి రహిత దేశముగా మన దేశము నిలుస్తుంది. కళ్ళు మూసుకుని వృక్షములను నరికివేసిన కారణముగా అసంతులన స్థితి పెచ్చరిల్లింది. ఈ స్థితిలో కఠినచర్యలు చేపట్టి అడవుల నరికివేతను ఆపాలి. సంతులన కొరకు మొక్కలను నాటడం వంటి పుణ్యప్రదమైన భౌతిక మరియు ఆధ్యాత్మిక లాభమును ఒనగూర్చే కార్యమును తక్షణమే ఆరంభించాలి. మన దేశములో లక్షలాది మైళ్ళ పొడవున మొక్కలను నాటాలి. కోట్లాది మొక్కలను నాటవలసిన అవసరమున్నది. అప్పుడే ప్రాకృతిక సంతులనము నకు ఆవశ్యకమైన 33% అటవీ ప్రాంతము విస్తరిల్లుతుంది. ప్రస్తుతము భారతదేశ జనాభా 125 కోట్లు. తదనుగుణముగా ప్రతి ఇంటి నుండి ఒక మనిషి మొక్కలను నాటి, పెంచే కార్యక్రమమును చేపట్టి పర్యావరణ సంతులనమును కాపాడుకోవాలి.

భౌతిక మరియు ఆధ్యాత్మిక మనే రెండు దృష్టికోణముల లోను వృక్షారోపణము వంటి పుణ్యకార్యము మరొకటి లేదు. ఒకానొకప్పుడు ఈ దేశములో మొక్కలను నాటటము అనే దానిని ఒక ఆధ్యాత్మిక కర్మగా భావించేవారు. తత్ఫలితముగా ప్రతివ్యక్తి ఆధ్యాత్మిక ప్రగతికొరకు ఈ అభ్యాసమును లేక సంప్రదాయమును అనివార్యముగా పాటించేవాడు. పర్యావరణము యొక్క సమతుల్యతను కాపాడుకోవటములోనే మానవుని ప్రగతి మరియు సమున్నతి సంభవమౌతుంది అన్న తథ్యము దీని వెనుక దాగి ఉన్నది. వృక్షముల యొక్క అసామాన్యమైన భూమికను గురించి ఆనాటి ఋషులకు బాగా తెలుసు. ఇందువలన వారు వృక్షారోపణను ఇతర ధార్మికకర్మ కాండలవలె పవిత్రము మరియు ఉపయోగకరమైన పనిగా భావించేవారు. కాలాంతరములో ఈ సంప్రదాయము అవహేళనకు గురైనది. ఈనాటి ప్రగతిశీలురు దీనిని ధార్మిక మూఢాచారము అని చెప్పి ఉపేక్షించారు. తత్ఫలితముగా చెట్లు నరికివేయబడ్డాయి, నరికివేయబడుతున్నాయి. వృక్షసంపద మీదనే సమస్త మానవ జాతి అస్తిత్వము ఆధారపడి ఉన్నదనే సంగతిని సుప్రసిద్ధ వృక్షశాస్త్రజ్ఞులందరు ముక్తకంఠముతో ఎలుగెత్తి చాటుతున్నారు. వృక్షములు ప్రకృతి ప్రసాదించిన సర్వశ్రేష్ఠమైన కాపలాభటులు. ఇవి లేకపోతే ప్రాణి సముదాయము యొక్క జీవితము ఇబ్బందులలో కూరుకు పోతుంది. ప్రగతి చెందిన దేశములు ఈ తథ్యమును అవగాహన చేసుకున్నాయి. అక్కడి ప్రభుత్వములు తమ అటవీ సంపదను కాపాడుకోవటానికి మరియు అభివృద్ధిచెయ్యటానికి అన్ని విధాలా అత్యంత ప్రభావవంతమైన చర్యలను చేపట్టి, వాటిని అమలులోకి తేవటానికి ప్రభుత్వములు తమదైన ప్రయత్నమును ఆరంభించాయి.

**రాజకీయ నాయకులు అందరి మంచికోసం పాటుపడాలి**

మనదేశములో వృక్షారోపణకు ఇంకా అంతటి ప్రాముఖ్యము ఇవ్వబడటము లేదు. ప్రభుత్వము ఈ దిశలో తగిన కార్యక్రమాలను వేగవంతముగానే అమలుచేస్తున్నది. అయితే ఏ సృజనాత్మక కార్యక్రమమైన ప్రజా ఉద్యమముగా వ్యాపించక పోతే అది సఫలము అవ్వదు. జనులు వృక్షముల గొప్ప తనమును లోతుగా అర్థము చేసుకోనంతవరకు ప్రభుత్వ ప్రయత్నములు కూడా ఏ మాత్రము విజయవంతము అవ్వవు. 1975 నుండి 1979 వరకు ప్రభుత్వ ఉద్యానవనముల కొరకు ప్రభుత్వ అధికారులు కోట్లాది రూపాయలను వెచ్చించారు అని గణాంకవివరములు వెల్లడిచేస్తున్నాయి. 1979 నాటికి 34 లక్షల హెక్టార్ల విస్తీర్ణములో వృక్షారోపణ కార్యక్రమము చేపట్టాలి అని పెట్టుకున్న లక్ష్యము పూర్తిచేయబడినది. కనుక ఏవిధముగా చూసిన ప్రభుత్వము తనవరకు పూర్తి కార్య ప్రణాళికను భారీ స్థాయిలో అమలుచేస్తున్నది, దానికొరకు కోట్లాదిరూపాయలను కేటాయిస్తున్నది. అయితే కేవలము వృక్షారోపణ చేసినంత మాత్రముననే లక్ష్యము నెరవేరదు. తగిన వన్యసంరక్షణ చర్యలు చేపట్టనిచో మూడొంతుల భాగములోని మొక్కలు ఆరంభ దశలోనే నశించిపోతున్నాయి. మిగిలిన $^1/_4$ వంతు మొక్కలు మాత్రమే పెరిగి వృక్షములుగా రూపుదాలుస్తున్నాయి. వృక్షారోపణను దేశము మరియు సమాజముల సేవగా భావిస్తూ ప్రజలు దీనిని తమ చేతుల్లోకి తీసుకున్నట్లయితే దేశ సంపద సంరక్షింపబడుతుంది మరియు లక్ష్యము పూర్తిగా నెరవేరుతుంది. మిగిలిన ధనమును ప్రభుత్వము మరొక గొప్ప కార్యక్రమమునకు వెచ్చించగలుగుతుంది.

ప్రతి వ్యక్తి తనవంతు బాధ్యతగా 12 మొక్కలను నాటాలి. ప్రతి కుటుంబము తన పరివారము యొక్క సంఖ్యను అనుసరించి వృక్షారోపణ కార్యక్రమమును చేపట్టాలి. కేవలము మొక్కలను నాటినంతమాత్రమున పని పూర్తయినదని భావించరాదు. మొక్క-వృక్షముగా మారేంతవరకు దానికి నీరు పోసి, ఎరువు వేసి, సంరక్షణ చర్యలు చేపట్టినప్పుడే అనుకున్న లక్ష్యము నెరవేరుతుంది. లేకపోతే కనుక ప్రభుత్వము చేపట్టిన కార్యక్రమము వలె ఇది కూడా మూడొంతుల భాగము నిరర్థకముగా మిగిలి పోయి, లక్ష్యము నెరవేరదు. ప్రతి కుటుంబము తన బాధ్యతను చక్కగా నిర్వర్తించాలి. మొక్కలు నాటబడి, అవి పెరిగి వృక్షములుగా మారే క్రమము కొనసాగినచో కొద్ది సంవత్సరము లలోనే పర్యావరణ సంతులనమునకు కావలసిన 33% అటవీ సంపద విస్తరిస్తుంది. ఒక మామిడి మొక్క చెట్టుగా పెరగటానికి సుమారు 10 సంవత్సరములు పడుతుంది. ఈ సంవత్సరమే పనిని ఆరంభించినచో అనుకున్న లక్ష్యమునకు చేరుకొన గలము. అనగా 33% మించి వృక్షములను విస్తరింపజేయ గలము.

మన భరతభూమిలో అతి పురాతనకాలమునుండి వృక్షా రోపణ కార్యక్రమము పట్ల తగిన శ్రద్ధ చూపిస్తూవచ్చారు. దానిని తిరిగి జాగృతపరచుకొనుట ఆవశ్యకము. ధనలేమి చేత, అలాగే శారీరిక శక్తి లేకపోవుట వలన సమాజ సేవ చేయలేకపోతున్నామని వాపోయేవారికి వృక్షారోపణమే సర్వ శ్రేష్ఠమైన సేవగా నిలుస్తుంది. ప్రతి వ్యక్తి ఈ పనిని చేయగలడు. దీనికొరకు ఏమంత పెద్ద మొత్తము ధన ఆవశ్యకత లేదు, ప్రత్యేకమైన యోగ్యత అవసరము లేదు. ధనవంతులు, నిరుపేదలు, చదువుకున్నవారు, నిరక్షరాస్యులు, చిన్నా-పెద్దా, బీద-బిక్కి, బుద్ధిమంతులు, తెలివైనవారు, అమాయకులు ఎవరైనా సరే ఈ పనిని నిరభ్యంతరముగా చేయవచ్చును. అయితే ఆవశ్యకమైనది ఏమిటంటే ఈ వృక్షారోపణ కార్యక్రమము యొక్క గొప్పతనమును తాము తెలుసుకొని, ఇతరులకు అర్థమయ్యేటట్లు చెప్పగలిగి, మనిషి మనిషిలో దీని పట్ల ఉత్సాహమును రేకెత్తిస్తే చాలు అందరూ ధన్యులయినట్లే! ఒక వ్యక్తి తన వంతుగా 12 మొక్కలను నాటడము అనగా ఒక కోటి 80 లక్షల రూపాయిలకు సమానమైన ప్రకృతి సంపదను ప్రోదిచేసినట్లే, తత్కారణముగా 50 సంవత్సరముల పాటు సమాజమునకు నిరంతరము ప్రాణవాయువు లభిస్తుంది, భూ-సారము రెట్టింపు అవుతుంది, వర్షములు సకాలములో కురుస్తాయి, వాతావరణ కాలుష్యము నివారించబడుతుంది. ఈ చిట్టి ప్రయత్నములతోనే పర్యావరణ సంతులనము కాపాడబడుతుంది. దేశము యొక్క ప్రగతి మరియు సమృద్ధి ఈ సంతులనము మీదనే ఆధారపడి ఉన్నది. స్వార్థము-పర మార్థము, భౌతిక-ఆధ్యాత్మికమనే రెండు ప్రయోజనములను పూర్తిచేసే వృక్షారోపణ వంటి పుణ్యకార్యము చేపట్టే దిశగా తక్షణమే ముందడుగు వేయాలి.

*- యుగనిర్మాణ యోజన, మార్చి 1981*

*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

**మనిషి తన హృదయంలో కరుణను నింపుకోవాలి**

బోధ కథ

# చాణక్యుని సాధారణ జీవితము - గొప్ప ఆదర్శము

గ్రీకు దేశపు రాజదూత ఒకసారి, భారతదేశచక్రవర్తికి గురువైన, రాష్ట్ర నిర్మాణానికి నిరంతరం శ్రమించి ప్రధాన సంచాల కుడైన చాణక్యుని విద్వత్తుని, రాజ్యతంత్రజ్ఞతని, నిరాబందర జీవన విధానం గురించి విని, ఆయనను స్వయంగా కలవాలనే కోరికతో భారత్‌కి రావటం జరిగింది. చాణక్యుని కుటీరం గంగానది ఒడ్డున ఉండేది. ఆ రాజదూత వెదుకుతూ చూసాడు. కొంతసేపటికి చాణక్యుడు స్నానం ముగించి, ఒక కుండలో గంగా జలాన్ని నింపి, తన భుజం మీద పెట్టుకొని రావటం జరిగింది.

రాజదూత అగిగాడు సోదరా! నాకు ఆచార్య చాణక్యుని నివాస మెక్కడో చెప్పగలవా? ఆయన గడ్డితో నిర్మించబడిన ఒక కుటీరం వైపు చేతితో సైగచేసాడు...

రాజదూతకు ఎంతో ఆశ్చర్యమేసింది... నేను భారతదేశపు ప్రధాన మంత్రి నివాసం గురించి అడిగితే, ఈయన ఆ కుటీరం వైపు సైగ చేస్తున్నాడు... అంతటి గొప్ప ప్రధానమంత్రి ఈ చిన్న కుటీరంలో ఎందుకుంటాడు? నమ్మశక్యంగాక మరికొంత సేపు అక్కడే నిలుచుని; మరొక వ్యక్తి అటుగా రావటం చూసి; అతడిని అడిగాడు.

శ్రద్ధా-భక్తి-విశ్వాసంతో కూడిన స్వరంతో ఆ వ్యక్తి ఇలా చెప్పాడు ఎదురుగా ఉన్న కుటీరాన్ని చూసారా అదే ఆచార్యుల వారి నివాసమని చెప్పి ఆ వ్యక్తి వెళ్ళిపోయాడు.

సరే వెళ్ళి చూస్తే సరిపోతుందనుకుంటూ రాజదూత కుటీరం వైపు అడుగులు వేసాడు. అక్కడకు చేరి చూడగా కుటీరపు ద్వారం తెరచి ఉంది. ఒక మూల కొన్ని పాత్రలు పెట్టబడి ఉన్నాయి. ఇంకో మూలన తాను అంతకు క్రితం చూసిన కుండ, గంగా జలంతో నిండి ఉన్నది కన్పించింది. ఒక చాప దానిమీద పెద్ద పెద్ద గ్రంథాలు వీటన్నింటి మధ్య కూర్చుని, శ్యామల వర్ణం గల ఒక వ్యక్తి, చిన్నగా వెలుగుతున్న దీపము వెలుగులో ఏదో వ్రాసు కంటూ ఉన్నాడు.

నేను ప్రధానమంత్రి చాణక్యుల వారిని కలవాలనుకుంటు న్నానని రాజదూత చెప్పాడు.

ఈ శబ్దంతో ఆయన ధ్యానం భంగమైంది. వ్రాస్తున్న వ్యక్తి కలాన్ని ఆపి, వెలుగుచున్న దీపంతో మరొకదీపాన్ని వెలిగించి, మొదటి దీపాన్ని ఆర్పివేసాడు. ఈ పనిచేస్తూ ఆయన ముఖ మండలంతో మర్యాదపూర్వక స్వరంతో- "ఓ అతిథి! మీకు స్వాగతం! నన్ను చాణక్యుడని అంటారు" అని అన్నాడు...

రాజదూత కళ్ళు ఒకసారిగా విప్పారిపోయాయి! ఈ వ్యక్తినే తాను గంగానది నుండి స్నానానంతరం కలిసింది... పొడవైన పిలక సాధారణ దుస్తులు ధరించి వ్రాసుకొనుటలో నిమగ్నమై ఉన్న వ్యక్తిని ఒక దేశానికి ప్రధానమంత్రిగా నమ్మబుద్ధి కావటం లేదు. తన స్వంతమైన నిరాడంబరంగా, విచిత్రమైన సాధారణ జీవనం చేస్తున్న వ్యక్తి తనకు కావలసిన జలాన్ని కూడా స్వయంగా కుండలో నింపుకొని తెచ్చుకోవటం అనే విషయం చూస్తున్న ఈ రాజదూతకు నమ్మశక్యం కాకుండా ఉంది! ఈ సాధారణ కుటీరంలో జీ... హుజూరని" పలికే సేవకులు, పరిచారికులుగాని, లేక ఏవిధమైన వస్తువులను కాని, ఆల్మరాలుగాని ఎక్కడా లేవు. రాజదూత అలాగే నిలుచుండి; చూస్తూ ఉండి పోయాడు! చివరకు ఆశ్చర్యం నుండి తెప్పరిల్లిన రాజదూత అన్నాడు-"ఒక విషయం అడగాలను కుంటున్నాను.." "అడగండి" "తమరు ఈ దీపాలను వెలిగించుటలో ఆర్పటంలో ఉన్న రహస్యమేమిటి?" "ఇందులో రహస్యమేదీ లేదు." ఆచార్యుల వారు చిరునవ్వుతూ ఇలా చెప్పారు – "మొదటి దీపంలోని 'నూనె' రాజఖజానాకు సంబంధిం చింది. రెండవ దీపంలోని నూనె నా సంపాదనలోనిది!

"తమరి సంపాదనకు మార్గమేది?" "పుస్తకాలు వ్రాయటం ద్వారా; విద్య చెప్పుట ద్వారా లభిస్తుంది. విద్యార్థులు కూడా తమకు తోచింది ఇస్తున్న దానిలో నాకు అవసరమైన దాన్ని ఉంచుకొని, మిగిలిన దానిని, పేద విద్యార్థుల కొరకు వెచ్చిస్తాను...!

"ఆహా! ఎంత గొప్ప విషయం... కనీసం జీవనం కొరకు ఖజానా మీద కూడా ఆధారపడలేదన్నమాట. ఇంకేదైనా తెలుసు కోవాలనే జిజ్ఞాస ఉన్నదా? లేదు. తమరి జీవన ప్రణాళికతో నాకున్న అన్ని అనుమానాలు తీరాయి. ఆచార్యజీ... నేను ధన్యుడ నయ్యాను" గ్రీకు దేశపు రాజదూత తమదేశానికి తిరిగి వెళ్ళిన తరువాత ఇలా వ్రాసాడు. భారతదేశంలోని రాష్ట్ర నిర్మాణ రహస్యం లభించింది! దేశనిర్మాతగా ఎవరు నిలుస్తారంటే... ఎవరు సాదాగా నిరాడంబరత్వంతో సంయమాన్ని అవిభాజ్యం అంగంగా ప్రభావించి; జీవిస్తారో, అటువంటివారు మాత్రమే ఏ దేశంగాని, సమాజం గాని ఉన్నతిని సాధించాలనుకుంటే, ఇటువంటివారి బలంతోనే అది సాధ్యపడుతుంది. గడచిపోయిన గౌరవాన్ని తిరిగి పొందాలను కుంటే ఇటువంటి వారితోనే సాధ్యపడుతుంది.

*– అఖండజ్యోతి, ఫిబ్రవరి 1990*


*అనువాదం: జి. చెన్నకేశవరావు*

**నమ్మకము, విశ్వాసము, శ్రద్ధ సుదృఢంగా ఉంటే ఆటంకాలు ఏమీ రావు**

### పూజ్య గురుదేవుల అమృతవాణి

# ఆధ్యాత్మికత రొక్కబేరం-1

*పరమపూజ్య గురుదేవుల వాక్కులలో ఒకవైపు అద్భుతమైన ఓజస్సు; మరొకవైపు ప్రత్యేకమైన ప్రఖరత (తీక్షణత) ఉంటాయి. ధర్మము, వేదాంతము, ఆధ్యాత్మికతలకు సంబంధించిన అతిరహస్యమైన విషయములను సహజమైన, సుందరమైన భాషలోనికి మార్చి సాధారణ జనుల ముందుంచటమే ఆయన ప్రవచనములోని వైశిష్ట్యము! అటువంటి ఒకానొక ప్రత్యేకమైన ప్రవచనములో వారు కృత్రిమమైన-నిజమైన ఆధ్యాత్మికతలను నిర్వచిస్తూ 'నకిలీ/కృత్రిమమైన ఆధ్యాత్మికతను అనుసరించటము వల్ల దాని ఫలితముల కోసము జన్మజన్మాంతరముల వరకు వేచి ఉండవలసి వస్తుంది. ఇదే నిజమైన ఆధ్యాత్మికతయైనట్లైతే అది నగదుబేరం వంటిది. తక్షణమే ఫలితమును ప్రసాదిస్తుంది. జీవితము పట్ల సరియైన దృష్టికోణమును ఉంచుకొనటము ద్వారా నిజమైన ఆధ్యాత్మికత అలవడుతుంది. భౌతికవాదులవలె ఇంద్రియసుఖ లాలసలో జీవితము గడపటము వారి జీవనలక్ష్యము కాకూడదు అని కూడా గురుదేవులు ప్రవచిస్తున్నారు. రండి! వారి అమృతవాణిని మరింతగా హృదయంగమము చేసుకుందాము!*



**అసలు నకిలిలలో తేడా తెలుసుకోండి**

మనందరి దగ్గర మంచి కరెన్సీ (నిజమైన డబ్బు) ఉంటే బజారుకు వెళ్ళి మనకు కావలసిన వస్తువులు, మిఠాయిలు, బట్టలు, ధ్యానం, స్థలము... ఇంకా దేన్నయినా కొన గలము. అదే మనవద్ద నకిలీ వెయ్యి రూపాయల నోటు ఉంటే వ్యాపారి వెంటనే అది చెల్లదంటూ మనకు తిరిగి ఇచ్చేస్తాడు. అదేవిధముగా నిజమైన ఆవు అయితే మనకు ఉపయోగపడేలా పాలు ఇస్తుంది. ఒక పిల్లవాడు బజారుకు వెళ్ళి ఆవుబొమ్మను కొనుక్కొచ్చాడనుకోండి. అది పాలు ఇస్తుందా? మట్టిబొమ్మ కాబట్టి ఇవ్వదు.

**నిజమైన-కృత్రిమమైన ఆధ్యాత్మికత**

ఈనాడు ఎటుచూసినా రెండు రకములైన ఆధ్యాత్మికతలు గోచరిస్తున్నాయి. ఒకటి కృత్రిమమైనది. రెండవది నిజమైనది. కృత్రిమమైన ఆధ్యాత్మికత యొక్క ఫలితములు మనము మరణించిన పిదప లభిస్తాయి. నిజమైన ఆధ్యాత్మికత ఫలితము కోసము మనము ఎదురుచూడనవసరము లేదు. అది తక్షణమే లభిస్తుంది. ఇది నగదు బేరం వంటిది. ఈ చేత్తో డబ్బిచ్చి-ఆ చేత్తో కావలసిన వస్తువును తీసుకొనవచ్చు.

**రొక్కబేరం వంటిది ఆధ్యాత్మికత**

మనకు ఎండవేడిగా అనిపించినప్పుడు చెట్టు నీడకు వెళ్ళి నిలబడితే వెంటనే ఒక నిమిషము లోనే హాయిగా-చల్లగా అనిపిస్తుంది. అలాగే శీతలప్రాంతమునకు వెళ్ళి నప్పుడు ఒళ్ళు చల్లబడిపోతుంది. వేడి టీ త్రాగితే శరీరములో తక్షణమే వేడి ఉత్పన్నమవుతుంది. మనము మరణించిన పిదప ఒక వెయ్యి సంవత్సరముల తరువాత మనకు ఫలితము లభిస్తుంది అని చెప్పే ఆధ్యాత్మికతను మనము నమ్మలేము. అది సరిగ్గాను ఉండవచ్చు లేదా తప్పు కావచ్చు.

ఆధ్యాత్మికత సరియైనదైతే దాని ఫలితము సరియైన సమయములో ఈ రోజే ఇప్పుడే లభించి తీరుతుంది. మేము మా జీవితకాలమంతా ఇదే గీటురాయి మీద నిలబడ్డాము. నిజమైన ఆధ్యాత్మికత యొక్క విధానములు సరియైనవి అని తెలుసుకున్నాము. **నిజమైన ఆధ్యాత్మికత మన అంతరంగ క్షేత్రమును సంస్కరించుకొనటము నేర్పుతుంది.**

**1. భౌతికవాద దృష్టికోణము:** ఇది మనకు భౌతిక వస్తువు ద్వారా సుఖం లభిస్తుంది అన్నభావన కలిగిస్తుంది. మనము కోరుకున్న వస్తువులు లభిస్తే మన లక్ష్యము నెరవేరుతుంది. అందమైన భార్య లభిస్తే గృహస్థజీవితము

**గ్రహణశక్తి, ఆసక్తి లేనిచోట నీ ప్రతిభను ప్రదర్శించుట వ్యర్థము**

సుఖముగా ఉంటుంది అవి అనుకుంటాము. మన కోరికలకను గుణముగా భౌతికమైన వస్తుసంపదను పొందటములోనే మనకు సుఖము తద్వారా శాంతి లభిస్తాయని భావిస్తాము.

**2. ఆధ్యాత్మిక దృష్టికోణము:** ఇది మన అంతరంగస్థితిని సంస్కరించుకుంటే క్షణములలోనే మనకోరికలన్నీ నెరవేరుతాయి అని చెపుతుంది. మనకు ఎంతమాత్రము అందుబాటులోకి రావు అనుకున్న సుఖసౌకర్యములు తమంతట తామే మనందరికి వచ్చి చేరతాయి.

మీరు కోరుకున్న వస్తువులు మీకు మేలు చేకూర్చవచ్చు, చేకూర్చలేకపోవచ్చు. **బయట ప్రపంచములో లభించే ఏ వస్తువైనా సరే మనకు శాంతినివ్వదు అని చెప్పటము మా ఉద్దేశ్యము.** కాదు. ప్రపంచములో తళుకులీనే వస్తువులెన్నో ఉన్నాయి. అవి మనకు లభించినంతవరకు 'అవి మనకు లభిస్తే ఎంత బాగుండు... వాటివలన చక్కని సుఖము లభిస్తుంది' అని అనుకుంటాము. కానీ తీరా చేతికందిన పిదప వాటిలోని చెడు మనకు అవగతమౌతుంది. దూరం నుండి చూస్తే పాము బంగారములా మిలమిలా మెఱిసిపోతూ కనిపించవచ్చు. దగ్గరకొస్తే మాత్రం కాటేస్తుంది. నిప్పు కూడా అంతే! దూరం నుండి కాంతులు వెదజల్లుతుంది. దగ్గరకు వెళితే మనలను కాలుస్తుంది. భౌతికమైన వస్తువుల గురించి ప్రజలు ఎప్పుడూ ఫలానా ఫలానా వస్తువులు లభిస్తే బాగుండు మనకు ఎంతో సుఖముగా ఉంటుందని అనుకుంటుంటారు.

### దూరపు కొండలు నునుపు

సాధారణముగా ఒక వస్తువు మనకు లభించనంతవరకు అది మనకు ఎంతోమంచిదిగా, ఆకర్షణీయమైనదిగా అనిపిస్తుంటుంది. ఉదాహరణకు మీకు వివాహము కానంత వరకూ 'భార్య ఎంతో అందముగా ఉంటుంది. ఆమె వస్తే చాలు. ఇల్లు స్వర్గముగా అవుతుంది. దేవకన్యలాగా ఆమె రెక్కలల్లార్చుతూ వస్తుంది' అని ఆలోచిస్తారు. పెళ్ళైన పిదప పెళ్ళిచేసుకొని తప్పు చేశానా అని ఆలోచిస్తారు. పెళ్ళి కానప్పుడు వచ్చే జీతం, సుఖముగా కాలం గడపటానికి, స్వేచ్ఛగా ఖర్చు పెట్టుకోవటానికి సరిపోయేది. పెళ్ళైసంసారం పెరిగిన తరువాత ఆ వచ్చే జీతం ఏ మూలకు సరిపోవటం లేదు అని బాధపడతారు కూడా. పిల్లల విషయములో కూడా అంతే. పిల్లలు పుట్టనంత వరకూ పిల్లలు లేరే అని ఆలోచన... పుట్టిన తరువాత వాళ్ళు పెరిగి పెద్దయ్యే వరకు రోగాలు, రొచ్చులు, ఖర్చులు... అయ్యో! ఎంత ఇబ్బంది సంతానముతో అనుకుంటారు. ఈ అభాగ్యులు పుట్టిన తరువాత మీ రక్తమాంసములన్నీ వాళ్ళకోసమే వెచ్చించ వలసి వస్తుంది. వాళ్ళ చదువులు, పెళ్ళిళ్ళు, ఉద్యోగము... వాటి గురించే మన తెలివి, శ్రమ శక్తి అన్నింటినీ వినియోగించవలసి వస్తుంది.

### మీ శ్రమను, సమయమును ఆత్మోన్నతి కొరకు కూడా ఉపయోగించండి

మీకున్న తెలివితేటలన్నింటినీ వ్యక్తిత్వవికాసమునకు, ఆత్మోన్నతికీ కూడా వెచ్చించినట్లయితే మీరు వివేకానందుడు, సమర్థగురురామదాసు లేదా కబీరువలె మహనీయులు కావచ్చు. సంపద కూడా అంతే! మనకు సంపద లభించనంత వరకూ అయ్యో! డబ్బుంటే ఎంత బాగుండు. ఇవి కొనవచ్చు, అవి కొనవచ్చు అనుకుంటాము. కానీ ఇబ్బడిముబ్బడిగా సంపద మనకందినప్పుడు దాని వలన ఎన్ని సమస్యలొస్తాయో అన్నది అనుభవమౌతుంది. డబ్బు మూలముగా కుటుంబ సభ్యుల మధ్య, అన్నదమ్ముల మధ్య తగాదాలు, దొంగతనాలు, దోపిడీ మొదలైన వాటన్నింటినీ ఎదుర్కొనవలసివస్తుంది. ఆస్తి పన్ను వాళ్ళ నుండి తాఖీదులు, విరాళములు ఇవ్వమని వచ్చి వేధించేవాళ్ళు, భాగస్వామ్యముతో చేసిన వ్యాపారముల తాలూకు ఇబ్బందులు... ఒకటికాదు... అన్ని విధాలా జీవితము దుర్భరముగా అనిపిస్తుంది. డబ్బులేనప్పుడే నయం. హాయిగా ఒక పూట తిని తలుపేసుకుని కంటినిండా నిద్రపోయేవాళ్ళం అని అనుకుంటాము.

అంటే ఇక్కడ నేను డబ్బును నిందించటము లేదు. ఇక్కడ నేను ప్రత్యేకించి మీకు చెప్పదలచుకున్నదేమిటంటే..... భౌతికమైన వస్తుసంపదలేవైతే ఉన్నాయో వాటివలన మనకు సుఖము లభిస్తుంది. శాంతి కలుగుతుంది అని మనము అనుకోవటము పొరపాటు, అది అపోహ మాత్రమే! మండుతున్న అగ్నిలో మంచినెయ్యి వేసినా, నూనెపోసినా, కిరసనాయిలు చల్లినా ఒక్కటే కదా! మంటలు పైపైకి ఎగసిపడతాయి. అదే విధముగా మానవుడు ఎంత సామాను ప్రోగుచేసుకుంటూంటే అతడి ఆంకాంక్షలు, కోర్కెలు అగ్నిలో వేసిన ఆజ్యంవలె అదే నిష్పత్తిలో పెరిగిపోతుంటాయి.

**ఆధ్యాత్మిక జీవితంతో ఎప్పుడు హాని జరుగదు**

## పెరిగిపోయే కోర్కెలకు పరిష్కారమేమిటి?

పై సమస్యకు పరిష్కారమార్గము ఏమిటి? దీనికి ఒక్కటే ఉపాయము. రామాయణములోని సురస వృత్తాంతమును చదివి అర్థము చేసుకుంటే మార్గము గోచరిస్తుంది. లంకానగర రక్షణకొరకై రావణునిచే నియమించబడ్డ రాక్షసియే సురస. లంకా సామ్రాజ్యములోకి అన్యులెవరైనా ప్రవేశించాలని చూస్తే వారిని గమనించిపట్టుకోమని రావణుడు ఆమెను ఆదేశించాడు నాడు. హనుమంతుడు లంకలోకి ప్రవేశించడం చూసిన సురస వెంటనే ఆయనను పట్టుకొని నోటిలో వేసుకున్నది. హనుమంతుడు దానిబారినుండి తప్పించుకొనటానికి తన శరీరమును పెంచటము ప్రారంభించినాడు. హనుమ శరీరమును పెంచేకొద్దీ సురస తననోటిని ఇంకా పెద్దదిగా తెరువసాగింది. సురస తన నోటిని ఎంత పెద్దది చేస్తుందో హనుమంతుడు దానికి రెండు రెట్లు అధికముగా శరీరమును పెంచాడు. ఇలా ఇద్దరు పెంచు కుంటూపోతే పెద్ద ఆపద ఎదురయ్యేట్లుంది. చివరకు హనుమంతుడు ఉపాయమును ఆలోచించి అతి లఘురూపము (దోమ అంత చిన్న రూపం) ధరించి సురస నోటిలోని దంతాల మధ్య నుండి వెలుపలికి వచ్చేశాడు.

## ఆధ్యాత్మికత అంటే దృష్టికోణములో మార్పుతెచ్చుకొనటమే

పైన చెప్పుకున్నది ఆధ్యాత్మిక దృష్టికోణము. రెండవది భౌతికదృష్టికోణం. భౌతికవాదము–ఆధ్యాత్మికవాదము... ఇవి రెండూ రెండు రకములైన ఆలోచనావిధానములు. 'మనం కోరుకున్న వస్తుసముదాయములన్నీ లభిస్తే మనం సుఖముగా ఉంటాం' అనుకునేది భౌతికవాదదృష్టికోణము. రెండవది ఆధ్యాత్మిక దృష్టికోణం. మన అంతరంగములోని ఆలోచనా విధానమును సరిచేసే పద్ధతి. **మన ఆలోచన సరిగ్గా ఉంటే మన కోరికలు నెరవేరుతాయి.**

## సురస నోటివలె కోరికలు పెరిగిపోతుంటాయి

ఈరోజు మీరు ఆకలితో పస్తున్నారు. రేపు మీకు ఎలాగో ఒక 1000 రూపాయలు లభిస్తాయి. సరే మీ ఆకలి తీరింది. కానీ ఎప్పుడైతే 1000 రూపాయలు లభించినాయో అప్పుడే మీలో 10,000 రూపాయలు కావాలనే కోరిక తీవ్రముగా తలెత్తుతుంది. ప్రతి మనిషికీ డబ్బుకావాలి. అది లేకపోతే వారి కోర్కెలు నెరవేరవు. రావణుడుకి ఈ కోర్కె నెరవేరలేదు. సికిందర్‌కు, హిరణ్యకశ్యపుడికి అందరికీ అదే అసంతృప్తి. కానీ వారి మనోభీష్టములు నెరవేరలేదనే బాధ వారిని నిరంతరం వెన్నాడింది.

## ఆప్తకాములుగా నిలవగలగటమే ఆధ్యాత్మిక సంపద

ఆధ్యాత్మిక రంగములో ప్రవేశించిన పిదప 'మన ఆకాంక్షలు నూటికినూఱుపాళ్ళు నెరవేరుతాయి' అని నేను తెలుసుకున్నాను. మనము ఆప్తకాములం కాగలము. ఏ వ్యక్తికైతే కోరికలన్నీ సంపూర్ణముగా నెరవేరుతాయో అతనిని ఆప్తకాముడు అనంటారు. 'నాకు ఇక ఏ కోరికా లేదు. నా మనోవాంఛలన్నీ నెరవేరినాయి. ఇప్పుడు నేను పూర్ణత్వమును పొంది ఉన్నాను' అని చెప్పగలిగిన వ్యక్తి ఎవరు? కల్పవృక్షం చెంతనున్న వ్యక్తులు మాత్రమే ఆ విధముగా చెప్పగలరు. స్వర్గములో ఉండే ఆ కల్పవృక్షం క్రింద కూర్చున్న వ్యక్తి దేనిని కోరుకుంటే తక్షణమే అది అతనికి లభ్యమౌతుంది అని పురాణములలో కల్పవృక్షమును గురించిన వివరణ లభిస్తుంది. *(సశేషం)*

*– అఖండజ్యోతి, జనవరి 2016*
*అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

## తులాధరుని అపరిగ్రహం

*తులాధారుడు మిగుల సాత్వికుడు, అత్యంత సంతోషి! అతడు ప్రతిదినము నదిలో స్నానమాచరించి, భగవంతుని పూజ చేస్తూ తదుపరి శ్రమించి వచ్చిన వేతనంతో తన కుటుంబాన్ని పోషిస్తూ ఉన్నాడు. ఆయన వద్ద ధరించుటకై రెండు జతల వస్త్రాలు మాత్రం ఉన్నాయి! అవి పాతబడి జీర్ణస్థితికి చేరి చిరిగిపోయాయి! ఒకరోజు తులాధారుడు నదిలో స్నానమాచరించి వస్తుండగా నది ఒడ్డున ఉంచిన రెండు జతల వస్త్రాలు అతని కంటబడ్డాయి. అవి అతనికి అవసరమైనవి. అయినప్పటికి తులాధారుడు వానిని తాకనైనాలేదు. రెండవరోజు స్నానమాచరించి తిరిగి వస్తుండగా నది ఒడ్డున తులాధరునికి బంగారు నాణాలు కనిపించాయి, అయినా వానిని కన్నెత్తి చూడలేదు. తులాధరుని అపరిగ్రహబుద్ధికి నిలువెత్తు ఉదాహరణగా నిలిచాయి. దీనితో తులాధారుని కీర్తి మిన్నంటింది.*

*– అఖండజ్యోతి, జూన్ 2016*
*అనువాదం: ఎ. శారద*

**ప్రకాశము అంతరంగం నుండి లభించాలి**

నావారితో నా మాట

# పరమ పవిత్రమైన గంగాజలాలను పరిరక్షించే భాగీరథీ ప్రయత్నం

## ఇప్పట్నుంచే మొదలుపెడితే సాధ్యమే



మనుషులకి, చెట్లకి, జీవజంతువులన్నిటికీ నీరు ఎంత ముఖ్యమో అందరికీ తెలుసు. శరీరం నీటితోనే తయారైంది. దాని అవసరానికి తగ్గ నీరును ఎప్పటికప్పుడు అందేట్టు జాగ్రత్తపడతాం. తూర్పు నుంచి పడమరకి, పడమర నుంచి తూర్పుకి, ఉత్తరం నుంచి దక్షిణానికి నిరంతరం నదులు ప్రవహించే గొప్పదేశం మన భారతావని. వీటన్నిటిలోను గంగనే భారతదేశానికి జీవనధార అంటారు. గంగా ప్రవాహానికి వెనక ఒక సంస్కృతి, విశిష్ఠ సభ్యత మరియు ఆధ్యాత్మ దర్శనం ఉంది. అతి పవిత్రమైన నదిగా కొలుస్తారు. గోముఖంలోంచి పుట్టి, హిమాలయాల నుండి దిగి 2525 కి.మీ. ప్రయాణించి సముద్రంలో కలిసి పోతుంది. ఆర్యావర్తం లేదా సగం భారతదేశం నేలలకి సాగునీటికి గంగానది ఆధారం. లెక్కలేనన్ని నదులు, కాలువలు గంగలో కలుస్తూపోతాయి. తన తీవ్రమైన అవిరళ ప్రవాహం వల్ల అన్నిటినీ తనలో ఇముడ్చుకుంటుంది. ప్రవహిస్తుండే అవిరళ గంగలో ఒకప్పుడు ఎన్నో గుణాలుండేవి, కానీ నేడు సభ్యతా వికాసం పేరు మీద మోక్షప్రదాయిని, పరమపవిత్రమైన గంగ నదీజలాలు తాగడానికి, స్నానానికి కూడా ఉపయోగ పడకుండా పోతున్నాయి. ఏ నదిని గౌరవిస్తూ, గొప్పగా పాటలు పాడుతూ, స్తోత్రాలు చదువుతూంటామో ఆ నీటిలోనే మురికి, కర్మాగారాల వ్యర్థాలు, మురికి కాలువలు, శవాలు మొదలైన వాటిని కూడా నిత్యం వదులుతున్నాం.

కానీ గంగానది ఎలాంటి ఫిర్యాదు చేయకుండా నిరంతరం ప్రవహిస్తూనే ఉంది. హిమాలయాల మంచుకొండలు తమ నీటితో నింపుతూనే ఉంటాయి. గంగానది రిషికేశ్ – హరిద్వార్ దగ్గరకు వస్తూంటే చెట్లు, మొక్కలతో పచ్చని తివాచి పరిచినట్లు ఉంటుంది. కానీ నిజానికి ఏమవుతోంది. గ్లోబల్ వార్మింగ్ వల్ల మంచుకొండలు కరుగుతున్నాయి. చెట్లను నరుకుతూ పోవడం వల్ల మట్టి నిలవక, భూక్షయం జరుగుతోంది. ప్రతి ఏడు భయంకర వరదలు ముంచెత్తుతున్నాయి. భూమి మీదకు దిగిన నది (రిషికేశ్ తరువాత) ప్రవహిస్తూనే ఉండేట్టు చేసే బాధ్యత ఈ ఒడ్డునుండే చెట్లది. కాని ఏం జరుగుతోంది? చెట్లను నరుకుతూ గుడ్డిగా పట్టణాలను పెంచుకుంటూ పోవడం వల్ల గంగ ఒడ్డునే కాదు, గంగోత్రి కింద జలాశయాలు, దేవప్రయాగ, రిషికేశ్ వరకు ప్రభావిత మయ్యాయి. ఒడ్డు మీదే పెద్ద పెద్ద హోటళ్ళు కట్టారు, ధర్మశాలలు, రిసార్టులు కూడా ఉన్నాయి. కరెంటు ఉత్పత్తి కోసం చిన్న టర్బైన్లు ఏర్పాటు చేయడం మొదలుపెట్టి వంతెనలు, పెద్ద అడ్డుకట్టలు, డ్యాములు కూడా కట్టారు, కడుతూనే ఉన్నారు. 2013 లో కేదార్‌నాథ్‌కు పట్టిన వరద ముప్పును చూసి కూడా మనకు బుద్ధి రాలేదు. ఎంత త్వరగా గంగ యొక్క అస్తిత్వాన్ని రూపుమాపుతున్నామో అర్థం కావట్లేదు.

గంగగా రూపుదిద్దుకునే భాగీరథీ మరియు అలకనంద (రెండు మూలధారలు)లను ఈ మాటలు రాస్తున్న రచయిత, పత్రిక సంపాదకుడు స్వయంగా అడుగడుగునా పర్యవేక్షించి చూసాడు. పర్యావరణానికి ఎంత చేటు కలిగిస్తున్నాం అన్నది కళ్ళారా చూసాడు. అమ్మ అంటున్న నదిని, పేరును తలంచినా పాపాలు పోతాయని లక్షలమంది భావించే నదిని, ఎంతగా అవమానిస్తున్నామో! అస్తిత్వాన్ని మంటగలుపుతున్నాం.

అందుకే యువక్రాంతి సంవత్సరంలో గాయత్రీ పరివార్, గంగా జలాభిషేక అభియానానికి పెద్ద పీట వేసింది. 2016 నుండి 2026 వరకూ ప్రతి సంవత్సరం దీనిని మరింత తీవ్రంగా కొనసాగిస్తాం, గంగ అస్తిత్వం ఉంటేనే మనిషి మిగులుతాడు అని ప్రతిమనిషికి పూర్తిగా అర్థమయ్యేవరకు తీవ్రంగా కొనసాగిస్తాం. సంపూర్ణ ఆర్యావర్తం, భారతదేశం యొక్క అస్తిత్వానికి కేంద్ర బిందువు గంగ. అందులోకి సుమారు 31 చిన్న, పెద్ద నదులు వచ్చి కలుస్తాయి. శుభ్రపరచాలంటే, వాటన్నింటిని కూడా శుభ్రపరచాలి. ఈ పని నిరంతరం జరగాలంటే వీలైనంత ఎక్కువ మందిని ఈ లక్ష్యానికై వినియోగించాలి.

నిర్మల గంగా జన అభియానం, జల సంరక్షణ మరియు

**అన్నముతో మనస్సుపైన, జలము ప్రాణముపై ప్రభావాన్ని చూపుతాయి**

సేద్యానికి వినియోగించడానికి వీలుగా వివిధ కార్యక్రమాలు మరియు శ్రీరామ సరోవరాలు – ఈ మూడు రూపాల్లో ఈ అభియానం క్రితం సంవత్సరమే మొదలైంది. ఈ సంవత్సరం వసంత ఋతువు నుండి వేగం పుంజుకుంది.

నిర్మల గంగా జల అభియానం–హిమాలయాల హృదయం కరిగితే, మంచుకొండలు కరిగితే గోముఖం నుండి గంగ ప్రవహించి భూమిపై అవతరిస్తుంది. ఇది కేవలం నీటి ప్రవాహం కాదు, భారతీయదర్శనం–ఆధ్యాత్మికం–సంస్కృతుల పవిత్ర ప్రవాహం. శ్రీకృష్ణుడు గీతలో "స్రోతసామస్మి జాహ్నవి" (10.31) అన్నారు. అంటే నదులలో, జలస్రోతలలో నేను గంగ రూపంలో ఉన్నాను. ఇది మొదలయ్యే చోట ఒక్క గెంతుతో దాటేయచ్చు, అదే బీహార్, బెంగాల్‌కు చేరే సరికి దీని మీద స్టీమర్లు నడుపుతారు. గంగ సముద్రంలో కలిసేటప్పుడు అది చూడదగ్గ దృశ్యం.

భారతదేశంలోనే కాక భారతీయ సంస్కృతిని నమ్మి, గౌరవించే ప్రతి ఒక్కరికీ పూజనీయమైన గంగను గత వందేళ్ళ నుండి పట్టణీకరణ పేరుతో ఎలా కలుషితం చేస్తున్నామో! 1) డ్యాములు కట్టడం వల్ల భూక్షయం జరిగి చెట్లకు కవచం తొలిగిపోయింది. 2) ఒడ్డు మీదనే కర్మాగారాలు నిర్మించి, దాని వ్యర్థాలను నదిలో కలిపేస్తున్నారు. 3) జనాభా పెరిగిపోయి ఈ చుట్టుపక్కలే స్థిరపడడం మొదలైంది (దీన్ని నియంత్రించి ఉండవలసింది). దానితోనే మలమూత్రాలు, వ్యర్థాలు, మురికి, సీవేజ్ నీళ్ళు అన్నీ ఇందులోనే కలుస్తున్నాయి. 4) పర్యటనను విస్తరించడానికి గంగలో రివర్ రాఫ్టింగ్ అనే క్రీడను ప్రోత్సహించారు. మద్యం, మాంసాహారం సేవించే వారు కూడా ఒడ్డు మీద క్యాంపులు  పెట్టారు. ఇటువంటి వాటికి గంగ ఏ మాత్రం సరిపోదు. దీన్ని ఆపాల్సింది కానీ కొనసాగుతూనే ఉంది. 5) పెద్దపెద్ద స్నానాలు–మహాస్నానాలు–మహాకుంభాలు (హరిద్వార్, ప్రయాగల్లో) ద్వారా క్రమం తప్పకుండా కలుషితం చేస్తూనే ఉన్నాం. సోమవతి అమావాస్య, మౌన అమావాస్య, సంక్రాంతి లాంటి చాలా పర్వదినాల్లో గంగకు ప్లాస్టిక్ తొడుగు వేసి, చెత్తతో నింపి వస్తుంటాం. నేటికి వంద సంవత్సరాల పూర్వం గంగలో సబ్బుతో స్నానం చేయరాదనే నియమం ఉండేది. ఒక్కసారి మునిగితే సరిపోయేది. కానీ ఇప్పుడు స్విమ్మింగ్ పూల్ లాంటి వాతావరణం ఏర్పడింది.

హరిద్వార్‌కు చేరే సరికే గంగ ఎంత కలుషితమవుతుందంటే ఆచమనం కూడా చేయబుద్ధి కాదు, స్నానం  అసలే చేయలేం. గోముఖం వరకు చాలా ఆశ్రమాలున్నాయి, కానీ మానవ మలమూత్రాలన్నీ నేరుగా గంగలోనే కలుస్తాయి. అమ్మకెలాంటి గతి పట్టించాం. గంగ ఉపనదుల్లో, శాఖల్లో విద్యుత్తు కోసం కావలసినన్ని చిన్న టర్బైన్లు, డ్యాములు కట్టుంటే సరిపోయేది. కాని ప్రణాళికలు వేసేవారు, శాసనం చేసే వారి అవినీతి వల్ల మనకు దౌర్భాగ్యం తప్పలేదు. ఇప్పటికి ఒక్క కేదార్‌నాథ్ ముప్పే చూసాం. ముందుముందు గంగ ప్రకోపం ఎక్కడెక్కడ చూపిస్తుందో, ఊహించుకోవడం కూడా కష్టమే.

ఈ నిర్మల గంగా జల అభియానానికి గాను గంగ ప్రవహించే 2525 కి.మీ. దూరాన్ని ఐదు అంశలుగా విభజించడం జరిగింది.

1. భాగీరథీ జోన్ – గోముఖం నుండి హరిద్వార్
2. విశ్వామిత్ర జోన్ – హరిద్వార్ నుండి కాన్పూర్
3. భారద్వాజ జోన్ – కాన్పూర్ నుండి కాశి
4. గౌతమ జోన్ – కాశి నుండి సుల్తాన్ గంజ్
5. రామకృష్ణ జోన్– సుల్తాన్‌గంజ్ నుండి గంగాసాగర్ వరకు.

అభియానం కూడా ఐదు అంచెలుగా నిర్వహించబడుతుంది.

1. పూర్తి గంగా బెల్ట్ యొక్క సర్వే
2. "గంగా సంవాద్" – చుట్టు పక్కల గ్రామాల్లో, ఊళ్ళల్లో గంగ గోడు అర్థమయ్యేట్టు కథలు.
3. గంగ అమృత కుంభ జనజాగరణ యాత్రలు–జన జాగరణ, స్వచ్ఛత, మలమూత్ర విసర్జన నిషేధం, బయోడైజెస్టర్ టాయలెట్లు, పచ్చతివాచి, వృక్షారోపణ.
4. ప్రజాసహకారం – భాగస్వామ్య ఆందోళనరూపంలో. గంగఒడ్డు అంతా పరిశుభ్రత. ఘాట్ల శుభ్రత. పచ్చదనం పెంచుట. నది నుండి 20 కిమీ దూరం వరకు నివసించే ప్రజలను చైతన్యపరచి నియమాలను పాటించడానికి ఒప్పించి వారి సహకారం తీసుకోవడం. గంగ ప్రజ్ఞా మండలుల స్థాపన.
5. పది సంవత్సరాల వరకు నిరంతరం పరిశుభ్రత, సంరక్షణల పట్ల ధ్యాస పెట్టడం. ఒక్క గంగానదే కాక దాని ఉపనదులన్నిటినీ చూసుకోవడం. అందుకు గాను 10 లక్షల మంది స్వయంసేవకుల శ్రమదానం.

**కాలుజారితే కూడదీసుకోవచ్చు, నోరుజారితే వెనక్కితీసుకోలేం**

ఈ ఐదు ప్రయత్నాలతో గంగాజలం పరిశుభ్రమవుతుంది, నిర్మలంగా ఉంటుంది. గంగలో సబ్బు, షాంపు, పాచిపోయిన పూలు, దీపాలు మొదలైనవి విసర్జించవద్దని ప్రతి ఒక్కరికీ ప్రేరణ ఇవ్వబడుతుంది. వీలైతే ప్రభుత్వ సహకారంతో, లేని పక్షంలో లీగల్ ఎయిడ్ ద్వారా మురికికాల్వల నీటిని సరైన పద్ధతిలో ట్రీట్మెంట్ చేయించే వ్యవస్థను ఏర్పాటు చేయడం. పారిశ్రామికులనుండి, ప్రజల నుండి ఈ నిమిత్తమై అంశదానం పోగుచేయడం. ప్రదర్శనలు, పోస్టర్లు, గోడల మీద రాయడం, వీధి నాటకాలు, సభలు, ఎలక్ట్రానిక్ మీడియా మొదలైన వాటి ద్వారా ప్రజలలో చైతన్యం తేవడం.

ఒడ్డును శుభ్రపరచడానికి నదీజలాలు వాడకుండా, చెత్తబుట్టల ఏర్పాటు, పురోహితుల భాగస్వామ్యం, కలుషిత నీటి నిర్వహణకు అవసరమైన శిక్షణనిచ్చి అవి గంగలో కలవకుండా ఆపచ్చు. ప్రతితీర్థంలో ఇటువంటి వ్యవస్థను ఏర్పాటు చేస్తే అసంభవంగా కనిపించే పని కూడా సంభవమవు తుంది. ఈ సంవత్సరం గాయత్రీ పరివార్ యువక్రాంతి సంవత్సరంగా పిలుపునిచ్చింది. యువత మరియు 'దియ' (DIYA) సభ్యులను కూడా ఈ కార్యక్రమంలో పలుచోట్ల భాగస్వామ్యం తీసుకోవలసిందిగా చెప్పబడింది. కొన్ని లక్షల మంది సంవత్సరానికి పదిహేను రోజులు కేటాయించగలిగినా ఈ పని అయి తీరుతుంది.

జల సంరక్షణ, నీటి సేద్యం, మురికి నీటి సునియోజనం మరియు శ్రీరామ సరోవరాల స్థాపన ఈ అభియానానికి వేగాన్ని ఇస్తుంది. ఎందుకంటే చివరికి లాభం ఈ ప్రణాళికకే. నిజంగా సంకల్పించుకుంటే, అఖండదీపం యొక్క శతాబ్ది (2026) మరియు పరమవందనీయ మాతాజీ శతాబ్ది (2026) లోపల ఈ పని పూర్తి చేయవచ్చు. ఈ భాగీరథీ ప్రయత్నానికి శ్రమించి, భాగస్వామ్యం తీసుకున్న ప్రతి ఒక్కరికీ గంగమ్మ ఆశీస్సులు, వరాలు తప్పకుండా దక్కుతాయి.

*– అఖండజ్యోతి, ఆగస్టు 2016*
*అనువాదం: ఎం.వి.ప్రసాద్*

# స్ఫూర్తిదాయక గాయత్రీపరివార్ సభ్యులు - 28

### శ్రీమతి కుత్తుర్తి వీరగోవిందమ్మ, భర్త నాగబాబు పళ్ళ కడియం గ్రామం

శ్రీమతి కుత్తుర్తి వీరగోవిందమ్మగారు శ్రీశైలపు సత్యనారాయణ – జయలక్ష్మి దంపతులకు జి. దొంతమూరి గ్రామం, రంగంపేట మండలం, తూర్పుగోదావరి జిల్లాలో జనవరి 1974లో జన్మించారు. 6వ తరగతి వరకు దొంతలూరులో ప్రాథమిక విద్యను పూర్తిచేసి, తదుపరి కుటుంబ పరిస్థితుల కనువుగా తనను తాను మలచుకొని, ప్రైవేటుగా మెట్రిక్ పరీక్ష వ్రాసి ఉత్తీర్ణులయ్యారు. తండ్రి కంసాలి వృత్తిలో నిష్ణాతులు – గ్రామంలోని వారికి నగలు తయారు చేసి అందిస్తూ కుటుంబాన్ని పోషించేవారు. వీరికి జన్మతః ఆధ్యాత్మిక కుటుంబమగుట చేత దైవచింతన సంతానానికి కూడా సులువుగా అబ్బింది. తన వద్దకు వచ్చిన బంగారాన్ని పుటం పెట్టి ఏ రీతిగా శుద్ధిచేసి చక్కగా ఆభరణాలుగా తయారు చేసే శ్రీ సత్యనారాయణగారు తన బిడ్డయైన వీరగోవిందమ్మకు చిన్ననాటి నుండి తగిన సంస్కారాలనందించి సుగుణవతిగా తీర్చిదిద్ది వివాహం గావించి మెట్టినింటికి పంపారు. తండ్రి ద్వారా అబ్బిన సంస్కారాలకు మరింత పదునుపెట్టి తనను తాను గాయత్రీమాతకు దగ్గరగావించుకొంది. క్రమ క్రమంగా దేవీదేవతల స్తుతిస్తూ శ్రావ్యంగా పాటలు పాడుట నేర్చుకున్నది. తన గాత్రమాధుర్యాన్ని అందరికి వినిపించి వారి మన్ననల పొందసాగింది. ఈ నేపథ్యంలో వీరికి 2000 సంవత్సరంలో పూజ్యులు నిగర్వి, మౌనస్వామిగా కీర్తిగాంచిన శ్రీ రామానంద స్వామిగారి శిష్యరికం లభించింది. వీరి ద్వారా గాయత్రీ మంత్రదీక్షను పొంది, ఆనాటి నుండి నిరంతరం గాయత్రీ మంత్ర జపాన్ని దీక్షగా చేస్తూ ఉన్నారు. వీరి వివాహం 1997లో శ్రీ నాగబాబుగారితో జరిగింది. నిత్య గాయత్రీ జప ఫలితంగా వీరికి వివాహానంతరం 16 సంవత్సరములకు సంతానం కలిగింది. భర్త కూడా బంగారపు పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతి పేదరికంలో పుట్టి పెరిగిన ఈమె సుదీర్ఘ గాయత్రీ జపం ఫలించి, సంతానంతోపాటు (లక్ష్మీగాయత్రీపాప) ఆవాసం కూడా తమకు తాము ఏర్పాటు చేసికొనగలిగారు. చిన్నపాటి ఇంటిని నిర్మించుకొన్నారు.

ఈ దంపతులిరువురు సౌమ్యశీలురు, వినమ్రశీలురు,

**సర్వకాల సర్వావస్థలలోనూ మానవాళికి దశ, దిశ నిర్దేశించేవి వేదవాక్కులు**

"సర్వేజనా సుఖినోభవంతు-సమస్త లోకసుఖినోభవంతు" అనే భావనలో జీవనాన్ని కొనసాగించుట అత్యంత ముదావహం. వీరికి ఆ గాయత్రీమాత మరియు గురుసత్తా ఆయురారోగ్యాలను సుఖశాంతుల ప్రసాదించుగాక.

### కుమారి పులుసు గౌరి, అమలాపురం

శ్రీ పులుసు రామచంద్రమూర్తి - కృష్ణవేణి దంపతులకు, కొడమంచి గ్రామం, ఆచంట మండలం పశ్చిమ గోదావరి జిల్లాలో ఆగస్టు 1976లో కుమారి గౌరి జన్మించారు. ప్రాథమిక విద్యను జన్మస్థలంలో పూర్తిచేసి, ఉన్నత విద్యను కాకినాడ పట్టణంలో పూర్తిచేశారు. 1993 నుండి పేరొందిన ఆధ్యాత్మిక వేత్త శ్రీ ఎక్కిరాల కృష్ణమాచార్యుల వారి శిష్యులలో ఒకరైన శ్రీ భూపతిరాజు వెంకటనరసింహరాజుగారి ద్వారా ఆధ్యాత్మిక మార్గంలో పయనించుట ప్రారంభించింది. వీరు హోమియో వైద్యం చేస్తూ సమాజసేవ చేసేవారు. వీరితో అత్యంత సన్నిహితంగా శ్రీ రామిరెడ్డిగారు (రాజానగరం) వారు ఉండేవారు. ఎర్రకాలువ వంతెన వద్ద అమలాపురంలోని గీతా ఆశ్రమంలో ఈ హోమియో వైద్యశాల నడుస్తూ ఉండేది. ఇచ్చటనే డాక్టరు రాజుగారి వద్ద సేవలనందిస్తూ కుమారి గౌరి పనిచేస్తూ ఉండేది. రామిరెడ్డిగారు ఆధ్యాత్మిక జీవితంలోనికి పూర్తిగా ప్రవేశించగనే వారి పేరు శ్రీరామానందస్వామిగా స్థిరపడింది. ఒకానొకప్పుడు రామానందస్వామి తీవ్రంగా జబ్బు పడి లేవలేని స్థితిలో ఉన్నారు. ఈ సమయంలో కుమారి గౌరి, స్వామికి శుశ్రూష చేయవలసి వచ్చింది. కౌమారదశలో ఉన్న కుమారి గౌరి, శ్రీరామానందస్వామికి, మనసా, వాచా, కర్మణా శుశ్రూష చేసి ఆయన త్వరగా కోలుకొనుటకై సేవలనందిం చింది. ఈ రీతిగా ఆమె చిన్ననాటనే స్వామి అనుగ్రహానికి పాత్రురాలైంది. స్వామి యొక్క మితభాషణం, గీతాధ్యయనం పట్ల గల ఆసక్తి, గాయత్రీ మంత్ర జపం, గాయత్రీయజ్ఞ నిర్వహణలు ఈమెను బాగా ఆకర్షించాయి. క్రమక్రమంగా కుమారి గౌరి గీతా శ్లోకాలు, గాయత్రీ యజ్ఞము, కర్మకాండ, సహస్రనామాలు, గుర్వాష్టకమ్ మున్నగు వన్నీ కంఠోపాఠం కాసాగాయి. ఈ రీతిగా ఆమె తన ఆధ్యాత్మిక విద్య, పూజా, కర్మకాండ పాటవాలతో స్వామి మనస్సును చూరగొని, ఆయనకు మంచి శిష్యురాలుగా మారింది.

శ్రీరామానంద స్వామి వెంట అనేకమార్లు ఉత్తర, దక్షిణ భారతదేశ తీర్థయాత్రలు చేసింది. శ్రీరామానందస్వామి ప్రతినిధిగా అనేకానేక పూజా కార్యక్రమాలు నిర్వహించింది. దీనిలో భాగంగా ప్రసిద్ధిగాంచిన శ్రీ విఠల్ బాబాగారి ఆశ్రమాలైన వల్లభాపురం (మహబూబ్‌నగర్ జిల్లా) మరియు జీడిమెట్ల యందు రామానందస్వామి ప్రతినిధిగా యజ్ఞ యాగాదులు నిర్వహించింది. రామానందస్వామి, శ్రీ భూపతి రాజుగారు, శ్రీ విఠల్‌బాబాగారు మరియు అబీద్ బాబాగారు కుమారి గౌరి యొక్క భవిష్యవాణిని తెలుపుచూ, కుమారి గౌరి ఆ జన్మాంతం బ్రహ్మచారిగానే నిలిచిపోతుందని చెప్పుట జరిగింది. కుమారి గౌరి మనోభావాలు కూడా పై స్వాముల భవిష్యవాణి కనుగుణంగా ప్రస్ఫుటం కాసాగాయి. దీనిని దృఢపరుస్తూ పూజ్య శ్రీరామానందస్వామి ఈమెకు 2001లో బ్రహ్మచర్య దీక్షనిచ్చి తన శిష్యురాలినిగా స్వీకరించారు. గీతా ఆశ్రమంలో బాధ్యతాయుత పనిని ఈమెకు అప్పగించారు. అప్పటినుండి శాంతికుంజ్, గాయత్రీతీర్థాన్ని క్రమంతప్పక ప్రతి సంవత్సరము దర్శిస్తున్నది. తిరుపతి అశ్వమేధ యజ్ఞంలో పాల్గొన్నది. గీతాఆశ్రమంలో గాయత్రి, పూజ్యగురుదేవులు, మాతాజీల విగ్రహ స్థాపనలో శ్రీరామానందస్వామి వారికి చేదోడు వాదోడుగా నిలిచి పనిచేసింది. శ్రీరామానందస్వామి తన భౌతిక శరీరాన్ని విడచిపెట్టిన నాటి నుండి ఈమె శారీరకంగా, మానసికంగా ఎంతో కృంగిపోయారు.

అట్టి ఈమెకు తగిన మానసిక శాంతిని కలిగించి తిరిగి సమాజ కళ్యాణానికై తన సేవలనందించే శక్తిని, ఉత్సాహాన్ని, ఆ గాయత్రీమాత, పూజ్య గురుసత్తా వీరికి అందించుగాక.


**దైవీశక్తుల తోడ్పాటుకై**
**కష్ట నష్టముల నివారణకై**
**చేసిన కృషి సత్ఫలితములనిచ్చుటకై**
**జ్ఞానము, సంపదల ఆర్జన కొరకై**
**జీవితంలో స్థిరపడుటకై**



**యుగశక్తి గాయత్రి**

**మాసపత్రిక చదవండి!**
**చదివించండి!!**

**ప్రతుల కొరకై సంప్రదించండి:**
**ఫోన్: 040-23700722, 9949111175**


**మృదువుగా, మంగళప్రదంగా, మనోహరంగా, మర్యాదపూర్వకంగా వాక్కు ఉండాలి**

# ఉభయ తెలుగు రాష్ట్రాలలో జరిగిన వివిధ కార్యక్రమాలు

## అశ్వమేధ మహాయజ్ఞము-2018 కార్యకర్తల సమావేశము

2018లో అశ్వమేధ మహాయజ్ఞము తెలుగు రాష్ట్రములో జరుపతలపెట్టినది శాంతికుంజ్. ఈ సంకల్పాన్ని డా॥ ప్రణవ పండ్యాగారు కన్యాకుమారి అశ్వమేధం యాగం ముగింపు సందర్భముగా కన్యాకుమారిలో ప్రకటించుట జరిగింది.

2018 అశ్వమేధ మహాయాగంలో భాగంగా 'యాజ' ప్రక్రియను ఆగస్టు 5, 7 మరియు 9 తేదిలలో విశాఖ పట్టణము, నారాకోడూరు మరియు హైదరాబాదులలో ఆయా తేదిలలో వరుసగా ప్రారంభించుట జరిగింది. ఈ సమావేశాలకు ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రెండు రాష్ట్రాలలోని గాయత్రీ పరివార్ కార్యకర్తలు దాదాపు 500 మంది పాల్గొనుట జరిగింది.

పై సమావేశాలకు శాంతికుంజ్ ప్రతినిధులుగా పూజ్యులు డా॥ బ్రిజ్‌మోహన్ గౌర్‌జీ, శ్రీ ఉత్తమ్, శ్రీ ఉమేష్‌శర్మ మరియు శ్రీ తోషన్‌సాహులు పాల్గొన్నారు. అట్లే దక్షిణ భారత గాయత్రీ పరివార్ ముఖ్య సంచాలకులైన శ్రీ అశ్విని సుబ్బారావుగారు పాల్గొన్నారు.

పై సమావేశాలలో ఈ క్రింది నిర్ణయాలు తీసుకోవటమైనది.

1. 2018లో జరుగనున్న అశ్వమేధ మహాయజ్ఞములో కనీసము 50,000 (యాభైవేలు) మంది సాధకులు పాల్గొనేలా తగిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలి.
2. పైదానిలో భాగంగా ఒక్కొక్క కార్యకర్త తన బాధ్యతగా కనీసము 50 నుండి 100 మంది సాధకులను ఎంపిక చేసివారికి తగిన మార్గదర్శనాన్ని చేయాలి.
3. సాధకుని కర్తవ్యములను ఈ క్రిందివిధంగా పేర్కొనడ మైనది. ఎ) నిత్యము 1 నుండి 3 మాలలకు తగ్గకుండా గాయత్రీ మంత్రజపం చేయాలి. బి) గాయత్రీ మంత్ర లేఖనాన్ని కనీసం రోజుకు 15-20 సార్లు వ్రాయాలి. సి)తాను ఇవ్వగలిగిన అంశదానాన్ని ప్రతిరోజు ఒక హుండీలో వేసి భద్రపరచాలి డి) స్వాధ్యాయ, సత్యంగాలు నిత్యము చేపట్టాలి. ఇ) యుగశక్తి గాయత్రి మాసపత్రిక చందాదారులుగా చేరాలి. ఎఫ్) ఆయా ప్రాంతాలలో 5 నుండి 10మందితో కూడిన ప్రజ్ఞామండలి మహిళా మండలిని ఏర్పాటు చేయాలి.

ఇంతకు పూర్వము దేవస్థాపన జరిగిన గృహాలలో తిరిగి దేవస్థాపన చేయవలసిన పనిలేదు. నూతన గృహాలలో మాత్రమే దేవస్థాపన చేపట్టాలి. అందరూ నియమిత సంఖ్యలో గాయత్రీ మంత్రజపాన్ని, గాయత్రీ మంత్రలేఖనంతో పాటుగా అంశ దానాలను తీసి ప్రక్కన పెట్టి భద్రపరచాలి.

పై ప్రక్రియను క్రమం తప్పకుండా కనీసము 6 మాసాల పాటు ప్రతి సాధకుడు చేపట్టవలసి ఉన్నది.

డా॥ బ్రిజ్‌మోహన్ గౌర్‌జీగారు కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతూ ఇలా అన్నారు– "నేడు భౌతికపరంగా మానవుడు ఎంతో ప్రగతి సాధించినప్పటికీ అశాంతి అసంతృప్తితో జీవిస్తున్నాడు. పరస్పర విశ్వాసం, పరస్పర ప్రేమలోపించి, అనేక శారీరక, మానసిక రుగ్మతలకు లోనవటం చూస్తున్నాం! వీటన్నింటికి శాశ్వత పరిష్కారం కొరకు తరచి చూసినచో, కారణము మనిషిలో ఆధ్యాత్మిక చింతన, నైతిక చింతన లోపించుట కారణాలుగా విశదమగుచున్నది. ఈ రెండింటి సాధనకై నిత్య గాయత్రీ మంత్రజపము, స్వాధ్యాయ సత్సంగాల నిర్వహణ తప్పనిసరి. అప్పుడే మనిషిలో సత్‌చింతన, సదాలోచన తద్వారా సత్కర్మల చేయుట జరుగుతుంది. ఆనాడు సమాజము రాష్ట్రము, దేశము సమైక్యతతో, సమృద్ధిని సాధిస్తుంది. సుఖశాంతులు నెలకొంటాయి. సామూహిక శక్తి సుసంపన్నమవుతుంది. దేశసమగ్రతకు, దారితీస్తుంది.

పై విస్తృత లక్ష్యసాధనకై అశ్వమేధ మహాయజ్ఞము చేపట్ట బడుచున్నది. దీనికై మనమంతా కలిసికట్టుగా ఈ కార్యక్రమాన్ని చేపట్టవలసి ఉంది అన్నారు.

శ్రీ అశ్విని సుబ్బారావుగారు ఇలా అన్నారు – "మనుష్యుల లోని దుర్బుద్ధి నేడు సమాజం ఎదుర్కొంటున్న అన్ని అనర్ధాలకు

**సత్యముతో కూడిన కోరిక, సత్యవచనమే అన్నివేళలా సంపూర్ణంగా సంరక్షించుగాక - ఋగ్వేదము**

మూలం. ఈ దుర్బుద్ధి తొలగి మనిషికి సద్బుద్ధి రావల యునన్నచో గాయత్రీ మంత్రజపం, మంత్రలేఖనం చేయుట తప్పనిసరి. ఈ లక్ష్యసాధన దిశగా మనమంతా ఇంటింటికి వెళ్ళి గాయత్రీ మంత్రజపాన్ని, దాని విశిష్టతను గురించి తెలుప వలసి ఉంది. అశ్వమేధమహాయజ్ఞాన్ని మాధ్యమంగా చేసికొని, గాయత్రీ పరివార్ సంఖ్యను దేశ మంతటా విస్తృతం గావించ వలసి ఉంది. దీనికై ఆబాల గోపాలాన్ని ప్రభావితం చెయ్యాలి. దీనికై మనమంతా కలసికట్టుగా కృషిచెయ్యాలి! దీనికై మీకు ఈ క్రింది సాహిత్యాన్ని అందజేయుట జరుగుచున్నది.

1) దేవస్థాపన ఫోటో 2) ధైర్యము విడువకండి 3) గాయత్రీ ఉపాసన 4) గాయత్రీ మంత్రలేఖనం

ఈ పై సాహిత్యాన్ని ఉత్సాహవంతులు, నిష్ఠాపరులైన వారిని ఎంచుకొని వారికి అందించాలి. వారు తప్పనిసరిగా జపము మంత్రలేఖనము చేయాలి. దీనికై నిర్ణీత దరఖాస్తు ఫారాన్ని నింపి ఇవ్వవలసి ఉంటుంది.

కార్యక్రమాలకు హాజరైన కార్యకర్తలు అత్యంత ఉత్సాహంగా దాదాపుగా 35000 మంది సాధకులను తయారు చేసి, అశ్వమేధ యాగానికి తీసుకువస్తామనే ప్రథమ సంకల్పాన్ని తీసికొనుట జరిగింది.

పై రీతిగా మూడుచోట్ల కార్యకర్తల ప్రథమ సమావేశాలు దిగ్విజయంగా ముగిశాయి.

## ఈ సూత్రాలను పాటిస్తే - ఆనందమే ఆనందం

*మనిషి ఆనందాన్ని వెదుకుతూ ఉంటాడు. ఈ ఆనందం మనస్సు యొక్క ఆంతరిక వ్యవస్థ అని ఋషులు బోధించారు. దిగువ సూత్రాలను అమలుచేస్తే, ఆ ఆనందం అందే మార్గం దొరుకుతుంది.*

***1) తన శరీరం పట్ల సరైన దృక్పథం :*** *ఈ శరీరం భోగ సాధనం కాదు. ఉన్నత స్థాయి వికాస యాత్రలో ముందుకు పోవడానికి అందిన ఒక దుర్లభ సాధనం. జీవితంలోని మహత్తర అవకాశాలు, బీజాలు మొలకెత్తడానికి ఉవ్విళ్ళూరుతూ ఈ శరీరం లోపల రహస్య కేంద్రంలో ఉన్నాయి. కనుక-శరీరానికి పుష్టికరమైన ఆహారం, సంయమనంతో కూడిన విహారం, తగినంత శ్రమ-విశ్రాంతి ఇవ్వాలి.*

***2) వర్తమానంలో జీవించు :*** *వర్తమానంలో ఉన్నదానిపై మీ దృష్టిని కేంద్రీకరించాలి. మీ దారిలో వచ్చిన ప్రతిదానిని పూర్తిగా స్వీకరించాలి, ఎదుర్కొనాలి. దానినుండి తగు పాఠాన్ని గ్రహించి, దానికి వీడ్కోలు చెప్పాలి. గతకాలపు తీపి జ్ఞాపకాలనూ, భవిష్యత్తులోని ఆశలను మీ శక్తులుగా మలచుకోవాలి. వాటిలో మునిగిపోయి, వర్తమానాన్ని నష్టపరచుకోకూడదు. పశ్చాత్తాపాలు, రేపటి చింతలు మీ కర్తవ్యనిష్ఠకు ఆటంకాలు కాకూడదు. మనం వర్తమానాన్ని సక్రమంగా వినియోగించుకుంటే-గతకాలపు మచ్చలు వాటికవిగా చెరిగిపోతూ ఉంటాయి; రేపటి చింతలు కరిగిపోతూ ఉంటాయి.*

***3) ఆంతరిక ధ్వనిని అనుసరించు :*** *సమాజంలోని ఆచారాలను కట్టుబాట్లను నియమ నిబంధనలను అనుసరించడంలో ఒక్కోసారి సంశయం కలుగవచ్చు. అయితే ఆంతరిక ధ్వని అనే మహత్తర సూచిక మన లోపల ఉంది. చెడ్డదారిలో అడుగుపడగానే మన కాళ్ళు వణకుతాయి. అలాంటి పనిలో చేయిపెట్టగానే, అది వణుకుతుంది. ఈ ఆంతరిక ధ్వని ఎంతో స్పష్టంగా ఉంటుంది. మనం దాన్ని ఉపేక్షించలేము. అయితే అది అత్యంత సూక్ష్మమైనది. దాన్ని సులువుగా అణచివేసి ముందుకుపోవచ్చు. అయితే-ఆంతరిక ధ్వనిగా అవతరించే ఈ దైవ సందేశాలను పాటించడం ఆనందానికి రాచబాట.*

*ఇంకా రోజులో కొద్ది క్షణాలను ఏకాంతంగా మననం, చింతన, ధ్యానం చేయడానికి కేటాయించుకోవాలి.*

**సత్యమే పలుకుతాను, అసత్యం పలకను-సత్యం ఆధారంగానే భూమి ఉంది - అధర్వణ వేదం**